మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130

ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 09, సంచిక: 17 | శనివారం | 13-12-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## యాదవులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారు

- సదర్‌ను రాష్ట్ర ప్రభుత్వ పండుగగా గుర్తించడంపై సిఎం రేవంత్‌రెడ్డికి యుపి మాజీ సిఎం అఖిలేష్ యాదవ్ అభినందనలు
- జూబ్లీహిల్స్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ
- తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు వివరించిన రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



యుపి మాజీ సిఎం అఖిలేష్ యాదవ్ శుక్రవారం సిఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇరువురి మధ్య తాజా రాజకీయ పరిస్థితుల పైన చర్చ జరిగినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అఖిలేష్‌కు వివరించారు. యాదవ్‌లకు ఎంతో ఇష్టమైన సదర్‌ను రాష్ట్ర ప్రభుత్వ పండుగగా గుర్తిస్తూ సిఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడాన్ని తరువాయి 2లో

## బీమా రంగంలో 100% ఎఫ్‌డీఐ

- రెండు దశల్లో జనగణనకు రూ.11,718 కోట్లు
- 71 పాత చట్టాలు బుట్టదాఖలు
- కొబ్బరి ఎంఎస్‌పి పెంపు
- కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు

**ఎఫ్‌డిఐతో ఆర్థిక వ్యవస్థకు ముప్పుందని వామపక్షాలు హెచ్చరించినా మొండివైఖరి వీడని మోదీ సర్కార్**

**న్యూఢిల్లీ:** విదేశీ పెట్టుబడిదారులకు ద్వారాలు తెరిచే విషయంలోగానీ, పథకాలకు కొత్త పేర్లు పెట్టి తమదే ఘనతగా చెప్పుకోవడంలోగానీ మోదీ ప్రభుత్వం తీరు మారలేదు. బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డిఐ) పెంపునకు అనుమతి ఇస్తూ కేంద్ర కేబినెట్ శుక్రవారం కీలక నిర్ణయం తీసుకుంది. అదే విధంగా జనగణన 2027 కోసం రూ.11,718 కోట్లను ఆమోదించింది. 71 పాత చట్టాల బుట్టదాఖలకు అంగీకారం తెలిపింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) పేరును పూజ్య బాబు గ్రామీణ రోజ్‌గార్ యోజనగా మార్చేందుకూ నిర్ణయం తీసుకుంది. అలాగే కొబ్బరి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ను 2026 సీజన్‌కు గాను రూ.445 నుంచి రూ.12,027కు పెంచుతూ ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం నిర్ణయించింది. ఈ మేరకు కేబినెట్ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా, దేశ ఆర్థిక వ్యవస్థకు ముప్పని హెచ్చరించినప్పటికీ బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐకి కేంద్రం అనుమతి ఇచ్చింది. ఎల్‌ఐసి వంటి సంస్థల్లో ప్రభుత్వ వాటాలు తగ్గించి, ప్రైవేటువిదేశీ పెట్టుబడిదారులకు అవకాశమిస్తే ప్రజల జీవితకాల పొదుపు సంక్షోభంలో పడుతుందని వాపమక్షాలు తరువాయి 2లో



## ఉపాధి హామీలో గాంధీపేరు తొలగింపు

**పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజనగా మార్పు**

- 100 నుంచి 125 రోజులకు పనిదినాల పెంపు
- కేంద్ర మంత్రిమండలి ఆమోదం

గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2006లో తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) పేరును పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజన (పిబిజిఆర్‌వై)గా మారుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. పని దినాలను 100 నుంచి 125కు పెంచేందుకు ఆమోదం తెలిపింది. దినసరి కనీస వేతనాన్ని రూ.240కు సవరించింది. ఈ పథకానికి మొదట్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్‌ఆర్‌ఇజిఎ)గా పేరు పెట్టారు. ఆ తర్వాత మహాత్మా గాంధీ పేరును జోడించి సవరించారు. ఇప్పుడు మరోమారు ఈ పథకం పేరు మారింది.

## తొలి పల్లె పోరులో సత్తా చాటాం

- 90 శాతం కాంగ్రెస్ మద్దతుదారులు విజయం సాధించారు
- రెండో, మూడో విడతల్లోనూ పట్టంకట్టండి
- ఓటర్లకు టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ విజ్ఞప్తి
- కవితకు సిఎం కావాలనే కోరిక అత్యాశేనని వ్యాఖ్య



ప్రజాపక్షం/హైదరాబాద్

మొదటి విడత సర్పంచ్ ఎన్నికలలో 4230 పంచాయతీలకు గాను కాంగ్రెస్ మద్దతుదారులు 2,600 పైచిలుకు స్థానాల్లో గెలిచారని, ఏకగ్రీవం అయిన చోట్ల 90 శాతం కాంగ్రెస్ మద్దతు దారులు గెలిచారని, చాలా చోట్ల బిజెపి, బిఆర్‌ఎస్ కలిసి పోటీ చేశాయని, వెయ్యికి దగ్గరగా బిఆర్ ఎస్, 200 లోపు బిజెపి, 40 స్థానాలు సిపిఐ(ఎం), 30 స్థానాల్లో సిపిఐ అభ్యర్థులు గెలిచారని ఆయన తరువాయి 2లో




## హిల్ట్ పాలసీకి బిఆర్‌ఎస్‌లోనే బీజం

- లీజుల భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు గత ప్రభుత్వమే సంతకాలు చేసింది
- కాంగ్రెస్ ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచింది
- నేను ముఖ్యమంత్రినైతే అన్యాయాలపై ఆరాతీస్తా
- ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్

హిల్ట్ పాలసీకి బిఆర్‌ఎస్ కిటికీలు తెరిచి బీజం వేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం దర్వాజలు తెరిచిందని, లీజుల భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు బిఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే సంతకాలు చేశారని, బిఆర్‌ఎస్ వేసిన దొంగదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం రహదారులుగా మారుస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తప్పుడు తరువాయి 2లో



### జర్మనీతో సుదీర్ఘకాలంగా స్నేహబంధం

03

## గజ గజ

ప్రజాపక్షం/హైదరాబాద్

- రాష్ట్రాన్ని వణికిస్తున్న చలి
- ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలులు
- ఉత్తర, పశ్చిమ, ఈశాన్య జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ
- మరో రెండు రోజులు ఇదే పరిస్థితి
- రికార్డుస్థాయిలో కనిష్టానికి పడిపోతున్న ఉష్ణోగ్రతలు

రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత ప్రజలను గజగజ వణికిస్తోంది. ఉత్తరాది నుంచి శీతల గాలులు వీస్తున్నాయి. దీంతో తెలంగాణలో చలి తీవ్రత పెరిగిందని హైదరబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోయినట్లు తెలిపారు. ఉత్తర, పశ్చమ, ఈశాన్య జిల్లాల్లో చలి గాలుల ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. శుక్ర, శనివారాల్లో తరువాయి 2లో



## ప్రభాకర్‌రావు లొంగుబాటు



ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిని విచారిస్తున్న సిట్ దర్యాప్తు అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు రేపిన ఫోన్ టాపింగ్ కేసులో కీలక నిందితుడిగా ఉన్న ఎస్‌ఐబి మాజీ చీఫ్ టి. ప్రభాకర్‌రావు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయంలో సిట్ దర్యాప్తు అధికారుల ముందు లొంగిపోయారు. ఏడు రోజుల పాటు ప్రభాకర్‌రావును సిట్ అధికారులు విచారించనున్నారు. లొంగిపోయిన వెంటనే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు ప్రభాకర్‌రావును అదుపులోకి తీసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు కూడా ఆయన్ని విచారిస్తున్నారు. ఫోన్ టాపింగ్ ఆపరేషన్ ఎవరి ఆదేశాలతో సాగింది? లక్ష్యంగా ఎంచుకున్న ఫోన్ నంబర్ల జాబితా ఎలా తయారైంది? ఈ ఆపరేషన్‌లో రాజకీయ ఒత్తిడి లేదా ఆదేశాలు ఉన్నాయా? వంటి కీలక అంశాలపై విచారణ ముమ్మరంగా తరువాయి 2లో

## మాజీ కార్మిక కుటుంబాలకు అండగా ఉంటాం

- సేఫ్ నిధులతో సింగరేణి ప్రాంతాల అభివృద్ధి
- పేద, కార్మిక కుటుంబాల సొంతింటి కల నెరవేరుస్తాం
- పంచాయతీ ఎన్నికల ప్రచారంలో కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం



సింగరేణి కార్మిక వాడలు, ప్రభావిత ప్రాంతాల్లో నివశిస్తున్న మాజీ కార్మికులకు అండగా ఉంటామని, సంస్థ క్వార్టర్లలో సింగరేణి స్థలాల్లో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నమాజీ కార్మిక కుటుంబాలకు, కాంట్రాక్టు కార్మికులకు, సంస్థ పై పరోక్షంగా ఆధారపడ్డ కుటుంబాల ఇండ్ల, ఇండ్ల స్థలాలకు హక్కు కల్పించేందుకు కృషి చేస్తామని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు తెలిపారు. పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కార్మిక ప్రాంతాలు, ప్రభావిత ప్రాంతాలైన గౌతంపూర్, రుద్రంపూర్, ఫోర్ ఇంక్లైన్, ప్రశాంతినగర్, రామాంజనేయ కాలనీ, బాబుక్యాంపు, ఎన్‌కే నగర్, నందా తండా, చంచుపల్లి తరువాయి 12లో

## శివరాజ్ పాటిల్ కన్నుమూత



- కాంగ్రెస్ సీనియర్ నేతకు నేడు అంత్యక్రియలు
- రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సంతాపం

**లాతూర్ :** లోక్‌సభ మాజీ స్పీకర్, కేంద్ర హోం శాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శివరాజ్ పాటిల్ శుక్రవారం ఉదయం తన స్వస్థలం మహారాష్ట్రలోని లాతూర్‌లో మరణించారు. 90 ఏళ్ల పాటిల్ స్వల్ప అనారోగ్యంతో తన నివాసం 'దేవ్‌ఘర్'లో మరణించారని, శనివారం ఆయన అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన కుమారుడు శైలేష్ పాటిల్, కోడలు అర్చన, గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై లాతూర్ నగరం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి అమిత్ దేశ్‌ముఖ్‌పై పోటీ చేసి ఓడిపోయారు. శివరాజ్ పాటిల్ ఇద్దరు మనవరాలు ఆయనతో కలిసి జీవించారు. పాటిల్ తన చివరి రోజుల వరకు కాంగ్రెస్, నెహ్రూగాంధీ కుటుంబానికి విధేయుడిగా తరువాయి 2లో

## మరో 10 మంది జనజీవనంలోకి

- ఛత్తీస్‌గఢ్‌లో ఆయుధాలు వీడిన నక్సల్స్
- మావోయిస్టుల కంపెనీ ప్లాటూన్ కమాండర్ మిదియం భీమా తలపై రూ.8 లక్షల రివార్డు



**సుక్మా :** ఛత్తీస్‌గఢ్‌లో మరో దఫా మావోయిస్టులు లొంగిపోయారు. సుక్మా జిల్లాలో శుక్రవారం ఆరుగురు మహిళలు సహా పది మంది నక్సలైట్లు లొంగిపోయారని పోలీసులు తెలిపారు. దీంతో ఈ ఏడాది జిల్లాలో మొత్తం 263 మంది మావోయిస్టులు హింస వీడినట్లు పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ తెలిపారు. పోలీసుల ఋూపూనా మార్గెమ్ (పునరావాసం నుండి సామాజిక పునరేకీకరణ వరకు) చొరవ కింద సీనియర్ పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) జిల్లా అధికారుల సమక్షంలో ఈ కార్యకర్తలు తరువాయి 2లో

## ఊపిరి అందడం లేదు



- ప్రమాదకరంగా వాయు కాలుష్యం : సమస్యపై చర్చిద్దాం
- ప్రధాని మోదీకి రాహుల్ సూచన
- వ్యవస్థాత్మక ప్రణాళిక అవసరమని వెల్లడి

**న్యూఢిల్లీ :** దేశంలోని ప్రధాన నగరాల్లో రోజు రోజుకూ పెరుగుతున్న వాయు కాలుష్యం అంశాన్ని శుక్రవారం ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో లేవనెత్తారు. ఈ అంశంపై చర్చించాలని డిమాండ్ చేశారు. జీరో అవర్ సందర్భంగా వాయు కాలుష్యం అంశాన్ని లేవనెత్తిన రాహుల్‌గాంధీ, ప్రతిపక్షం, ప్రభుత్వం ఒకరినొకరు దూషించుకోకుండా, సమస్యకు పరిష్కారం కనుగొనే విధంగా ఈ అంశంపై చర్చను ఆసక్తికరమైన రీతిలో రూపొందించవచ్చని సూచించారు. 'ఇది సైద్ధాంతిక సమస్య కాదు. వాయు కాలుష్యం ప్రజలకు తీవ్ర నష్టం చేకూరుస్తుంది. ఈ సమస్య పరిష్కారానికి తాము సహకరించాలనుకుంటున్నామని, ఈ సభలోని ప్రతి ఒక్కరూ అంగీకరిస్తారు' అని అన్నారు. వాయు కాలుష్య సమస్యను పరిష్కరించడానికి ప్రధానమంత్రి ఒక ప్రణాళికను రూపొందించవచ్చని కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు. 'మన ప్రధాన నగరాల్లో ఎక్కువ భాగం విషపూరితమైన గాలి దుప్పటి కింద జీవిస్తున్నాయి. లక్షలాది మంది పిల్లలు ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్నారు. వారి భవిష్యత్తు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## జపాన్‌లో భూకంపం.. సునామీ హెచ్చరిక జారీ

**టోక్యో:** జపాన్ ఈశాన్య ప్రాంతంలో 6.7 తీవ్రతతో వచ్చిన భూకంపం తర్వాత, జపాన్ వాతావరణ సంస్థ (జెఎంఎ) శుక్రవారం సునామీ హెచ్చరిక జారీ చేసింది. ఆఓమోరి తీరానికి సమీపంలోని సముద్ర ప్రాంతంలో, సుమారు 20 కిలోమీటర్ల లోతున చోటు చేసుకుందని ప్రకటించింది. జెఎంఎ ప్రకారం, హొక్కైడో, ఆఓమోరి, ఇవాటే, మియాగి తీర ప్రాంతాల్లో సుమారు ఒక మీటర్ (3.2 అడుగులు) వరకు భారీ అలలు వచ్చే అవకాశం ఉంది. కాగా, భూకంపం బాధితులు లేదా క్షతగాత్రుల వివరాలు ఇంకా తెలియరాలేదు. దీనిని ఈ వారం సంభవించిన రెండో పెద్ద భూకంపంగా పేర్కొంటున్నారు. సోమవారం ఆఓమోరి తీరంలో 7.5 తీవ్రతతో భూమి కంపించింది. ఆ ఘటనలో 34 మంది గాయపడ్డారు. ఇవాటేలోని కుజి పోర్ట్‌లో 0.6 మీటర్ల ఎత్తులో సునామీ నమోదైంది. తాజా భూకంపం నమోదైన ప్రాంతంలోనే 2011లో భారీ భూకంపం సంభవించింది. రెక్టార్ స్కేల్‌పై దాని తీవ్రత 9.0 మాగ్నిట్యూడ్‌గా నమోదైంది. దాదాపు 20,000 మంది మృతి చెందారు. ప్రసిద్ధి చెందిన ఫుకుషిమా అణు విద్యుత్ కేంద్రం నాశనమైంది.



## ప్రభుత్వ రాజీనామాకు బల్గేరియా పార్లమెంట్ ఆమోదం

**సోఫియా (బల్గేరియా):** బల్గేరియా ప్రధాని రోజెన్ జెల్యాజ్కోవ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దేశవ్యాప్తంగా జరుగుతున్న అవినీతి వ్యతిరేక నిరసనల నేపథ్యంలో రాజీనామా చేయగా, పార్లమెంట్ శుక్రవారం దాన్ని ఆమోదించింది. బల్గేరియా వచ్చే నెల యూరోజోన్‌లో చేరేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. అధిక పన్నులు, సోషల్ సెక్యూరిటీ భాగ్యతలు పెంచే బడ్జెట్ ప్రతిపాదన వంటి అంశాలకు వ్యతిరేకంగా, దేశవ్యాప్తంగా వేలాది మంది, ముఖ్యంగా యువకులు, గత వారం రోజులుగా నిరసనలు వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. రాజకీయ వర్గాల్లో వ్యాప్తి చెందిన అవినీతి, సామాన్య పౌరులకు న్యాయం దొరకడం లేదన్న భావన కూడా ఈ నిరసనలకు ఆజ్యం పోసింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రభుత్వం సమర్పించిన రాజీనామాను, 240 సభ్యులు గల పార్లమెంట్ 127—0 ఓట్లతో ఆమోదించింది. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ప్రస్తుత కేబినెట్ విధులు కొనసాగిస్తుంది. ఈ ఏడాది జనవరిలో అధికారంలోకి వచ్చిన జెల్యాజ్కోవ్ ప్రభుత్వం ఇప్పటివరకు ఆరు అవిశ్వాస తీర్మానాలను ఎదుర్కొని నిలబెట్టుకుంది. కానీ ఈసారి రోడ్లపై భారీగా ప్రజలు చేరడంతో పరిస్థితి మారిపోయింది. ప్రధాని గురువారం రాజీనామా ప్రకటిస్తూ 'ప్రజల ఒత్తిడికి ఇది ప్రత్యక్ష ప్రతిస్పందన.. ప్రజల స్వరం దేవుని స్వరం' అని వ్యాఖ్యానించారు. ఇలాఉంటే, అధ్యక్షుడు రుమెన్ రాడేవ్ ముందుగా పార్లమెంట్‌లో ఎక్కువ మంది సభ్యుల మద్దతు ఉన్న పార్టీ లేదా కూటమికి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలి. అది విఫలమైతే, రెండవ పెద్ద కూటమికి అవకాశం. ఈ రెండూ విఫలమైతే, అధ్యక్షుడే కేర్‌టేకర్ ప్రభుత్వం ఏర్పాటు చేసి, కొత్త ఎన్నికలకు వెళతారు. 2021 నుండి ఇంత వరకూ ఏడు ఎన్నికలు జరగ్గా, ఎనిమిదోసారి కూడా ఎన్నికలే శరణమవుతాయని పరిశీలకులు అంటున్నారు. 6.4 మిలియన్ జనాభా గల బల్గేరియా జనవరి 1 నుంచి తన లెవ్ కరెన్సీకి బదులుగా యూరోని స్వీకరించనుంది, తద్వారా యూరోజోన్‌లో 21వ సభ్యదేశంగా మారనుంది. బల్గేరియా 2007లో యూరోపియన్ యూనియన్‌లో చేరింది.

# హెచ్1బి వీసాలతో ప్రమాదం

### స్థానిక అమెరికన్లకు ఉద్యోగాలు లభించడంలేదని పోల్‌స్టర్ మిచెల్ సంచలన వ్యాఖ్య



**వాషింగ్టన్:** అమెరికాలో విదేశీయులపై, ప్రత్యేకించి భారతీయులపై వ్యతిరేక రోజురోజుకూ పెరుగుతున్నది. హెచ్1బి వీసాపై అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకొని ప్రజాభిప్రాయాన్ని సేకరించడానికి సర్వే నిర్వహించే పోల్‌స్టర్, వ్యాఖ్యాత మార్క్ మిచెల్ చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. ఒక హెచ్1బి వీసాదారుడిని దేశం నుంచి పంపిస్తే, అదే పది మంది అక్రమ చొరబాటుదారులను పంపించినంత ప్రభావం ఉంటుందని అతను వ్యాఖ్యానించారు. దేశంలో భారతీయుల ప్రభావం తగ్గించడానికి 'డీఇండియనైజ్' అత్యవసరమని అన్నారు. సిలికాన్ వ్యాలీలో పని చేస్తున్న వారిలో 66 శాతం మంది విదేశీయులేనని, వారిలో భారతీయులే ఎక్కువగా ఉన్నారని వివరించారు. విదేశాల నుంచి వచ్చిన వారు హెచ్1బి వీసాపై పనులు చేస్తున్న కారణంగా కనీసం 12 కోట్ల మంది అమెరికన్ టెక్ వర్కర్లు నిరుద్యోగులయ్యారని ఆరోపించారు. అమెరికా కంపెనీలు తక్కువ ఖర్చుతో పని చేసే యువ ఇమ్మిగ్రెంట్ ఇంజనీర్‌లకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల సీనియర్ అమెరికన్ ఇంజనీర్లు నిర్లక్ష్యానికి గురవుతున్నారని మిచెల్ విమర్శించారు. ఆపిల్ వంటి టాప్ కంపెనీల్లో ఉన్న సీనియర్ భారతీయ దేవలపర్లను పంపిస్తే, అమెరికాకు ఆర్థికంగా లాభమని అన్నారు. వాల్‌మార్ట్, సిలికాన్ వ్యాలీ వంటి చోట్ల భారీగా భారతీయులు ఉన్నందున అమెరికన్ ఉద్యోగాలు కోల్పోతున్నాయని ఆరోపించారు. కాగా, మిచెల్ ఈ విధంగా జాతి ఆధారిత విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తున్నాయి. సోషల్ మీడియాలో ఇది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. జాత్యహంకారానికి నిదర్శనంగా నిలుస్తున్న మిచెల్ వ్యాఖ్యలు ఇండియన్—అమెరికన్లను కూడా టార్గెట్ చేస్తున్నట్టు కనిపిస్తోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ట్రంప్‌పై రెండో అభిశంసనను తిరస్కరించిన ప్రతినిధుల సభ

**వాషింగ్టన్:** టెక్సాస్‌కు చెందిన డెమోక్రటిక్ ప్రతినిధి అల్‌గ్రీన్ తీసుకొచ్చిన అభిశంసన (ఇంపీచ్‌మెంట్) తీర్మానాన్ని అమెరికా ప్రతినిధుల సభ గురువారం తిరస్కరించింది. ఇది అల్‌గ్రీన్ ఈ ఏడాది చేపట్టిన రెండో విఫల ప్రయత్నం. ఈ తీర్మానానికి వ్యతిరేకంగా 237, అనుకూలంగా 140 ఓట్లు వచ్చాయి. 47 మంది డెమోక్రాట్లు 'ప్రెజెంట్ ఓట్' (తటస్థ ఓటు) వేశారు. ఈ ఏడాది జూన్‌లో ఇదే తీర్మానాన్ని విస్తృత మెజారిటీతో తిరస్కరించినప్పటికీ, ఈసారి డెమోక్రాట్లలో మద్దతు పెరిగినట్లు కనిపిస్తోంది. డెమోక్రటిక్ హౌస్ నాయకుడు హకీమ్ జెఫ్రీస్ తదితరులు ఓటు ముందు వెల్లడించిన ప్రకారం, రిపబ్లికన్ మెజారిటీ ఎలాంటి దర్యాప్తు జరపలేదు. అందుకే పూర్తిగా వ్యతిరేకించకుండా ప్రెజెంట్ అని ఓటు వేస్తున్నారు. 'ఇంపీచ్‌మెంట్ అంటే రాజ్యాంగం ఇచ్చిన పవిత్ర బాధ్యత. అధికార దుర్వినియోగం, చట్ట ఉల్లంఘనలు, ప్రజా నమ్మక ద్రోహం వంటి తీవ్రమైన కారణాలు ఉండాలి' అని చెప్పారు. కాగా, ట్రంప్ తన రెండో పదవీ కాలంలో 'అత్యున్నత నేరాలు, దుశ్చర్యలు'కు పాల్పడ్డారని అల్‌గ్రీన్ ఆరోపణ. ట్రంప్ కాంగ్రెస్‌ను పక్కనబెట్టి ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రారంభించేందుకు ప్రయత్నించారని ఆయన ఆరోపిస్తున్నారు. డెమోక్రటిక్ శాసనసభ్యులకు 'మరణదండన' తప్పదన్న బెదిరింపులకు కూడా ట్రంప్ పాల్పడుతున్నట్టు తెలిపారు. అయితే, రిపబ్లికన్లు ఈ ఆరోపణను ఖండిస్తున్నారు.



అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రాన్ని భారీ వర్షాలు, వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. వేలాది ఇళ్లు మునిగిపోయాయి. కనీసం 78,000 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిందిగా అధికారులు ఆదేశించారు. శుక్రవారం కూడా వరదలు ముంచెత్తే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు.





## థాయిలాండ్ పార్లమెంట్ రద్దు

### వచ్చే ఏడాది ఆరంభంలో ముందస్తు ఎన్నికలు

**బ్యాంకాక్:** థాయిలాండ్ ప్రధాని అనుతిన్ చాన్‌వీరాకుల్, రాజు మహా వజిరాలొంగ్‌కోర్న్ ఆమోదం అనంతరం శుక్రవారం పార్లమెంట్‌ను రద్దు చేశారు. ఈ నిర్ణయం రాయల్ గెజెట్‌లో ప్రచురణతో అమల్లోకి వచ్చింది. అధికారాన్ని ప్రజలకు తిరిగి ఇస్తున్నానని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. నిబంధనలను అనుసరించి రాజు ఆమోదించిన తర్వాత 45 నుంచి 60 రోజుల్లో ఎన్నికలు జరగాలి. ఈ కాలంలో అనుతిన్ పరిమిత అధికారాలతో కేర్‌టేకర్ ప్రభుత్వాన్ని నడిపిస్తారు. అయితే, కొత్త బడ్జెట్‌కు ఆమోదం ఇవ్వలేరు. ఈ నిర్ణయం థాయిలాండ్—కాంబోడియా సరిహద్దుల్లో మళ్లీ భారీ స్థాయి యుద్ధం జరుగుతున్న సమయంలో రావడం గమనార్హం. మాజీ ప్రధాని పాయెతోంగ్‌టార్న్ శినావాత్ర స్థానాన్ని అనుతిన్ ఈ ఏడాది సెప్టెంబర్‌లోదక్కించుకున్నారు. శినావాత్ర గత సంవత్సరం సరిహద్దు వివాదం నేపథ్యంలో వచ్చిన కుంభోణాల ఆరోపణల కారణంగా పదవి కోల్పోగా, సెప్టెంబర్‌లో విపక్షం 'పీపుల్స్ పార్టీ' మద్దతుతోనే అనుతిన్ ప్రధాని అయ్యారు. ప్రతిఫలంగా నాలుగు నెలల్లో పార్లమెంట్ రద్దు చేసి, కొత్త రాజ్యాంగానికి ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని అంగీకరించారు. రాజ్యాంగ సవరణ విషయంలో విభేదాలు పెరగడంతో, పీపుల్స్ పార్టీ గురువారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. దీనివల్లే పార్లమెంట్ రద్దు నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. పీపుల్స్ పార్టీ హౌస్‌లో అతిపెద్ద పార్టీగా ఉంది. భవిష్యత్తు ఎన్నికల్లో భూం జైథాయ్ పార్టీకి ప్రధాన ప్రత్యర్థిగా పీపల్స్ పార్టీని పేర్కొంటున్నారు. పాయెతోంగ్‌టార్న్ ప్రభుత్వం పతనమవుతున్న సమయంలో అనుతిన్ తన పదవులను రాజీనామా చేసి, ఆమె కూటమి నుండి బయటకు వెళ్లిన విషయాన్ని ఈ సందర్భం గా ప్రస్తావించాలి. పాయెతోంగ్‌టార్న్ కాంబోడియా సెనేట్ అధ్యక్షుడు హున్ సేన్‌తో ఫోన్ కాల్ వివాదం కారణంగా నైతిక ఉల్లంఘనలకు దోషిగా తేలారు.

ఇలావుంటే, కాంబోడియాతో మళ్లీ యుద్ధం ప్రారంభమైన నేపథ్యంలో అనుతిన్ జాతీయతను ఉద్దేశించిన కఠిన వైఖరి అవలంబించారు. జులైలో జరిగిన రోజుల యుద్ధం తర్వాత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, వాణిజ్య రాయితీలను నిలిపివేస్తానని హెచ్చరించి, యుద్ధ విరమణకు ఒప్పించారు. అయితే, ఈ వారం మళ్లీ ఘర్షణలు పెరగడంతో, ట్రంప్ మరోసారి శాంతి నెలకొల్పుతానని ట్రంప్ ప్రకటించారు. థాయ్ ఎగుమతులపై భారీ సుంకాలు విధించే అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చారు. కాగా, ఈ వారం జరిగిన యుద్ధంలో 24 మంది మరణించగా, లక్షలాది మంది ఇరువైపులా తలదాచుకున్నారు. థాయ్ సైన్యం ప్రకారం 165 మంది కాంబోడియా సైనికులు చనిపోయినట్లు అంచనా, అయితే కాంబోడియా అధికారిక సంఖ్య వెల్లడించలేదు.

## లొంగుబాటు (మొదటి పేజీ తరువాయి)

సాగుతోంది. విచారణలో పలువురు కీలక అధికారులు, రాజకీయ నేతల పేర్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే అరెస్టై బెయిల్‌పై బయటికి వచ్చిన నిందితులు గతంలో వెల్లడించిన అంశాలపై కూడా ప్రభాకర్‌రావును ప్రశ్నిస్తున్నారు. పదవీ విరమణ చేసిన తరువాత ఎస్ఐబి చీఫ్‌గా ఎవరు నియమించారు అనే అంశం ఇందులో ప్రధానంగా ఉంది. ఈ విషయంపై సిట్ అధికారులు కూపి లాగుతున్నారు. అధికారులు అభ్యంతరం పెట్టినా అప్పటి సిఎం కెసిఆర్ స్వయంగా జోక్యం చేసుకుని ప్రభాకర్‌రావును ఎస్ఐబి చీఫ్‌గా నియమించినట్లు తెలుస్తుంది. దీనిపై ప్రభాకర్‌రావును సిట్ అధికారుల లోతుగా ప్రశ్నిస్తున్నారు. ప్రభాకర్‌రావు నుంచి కీలక వివరాలు సేకరించినట్లు సమాచారం. ఇదే కేసులో మరికొందరు ఉన్నతాధికారులు, మునుపటి ప్రభుత్వ కాలంలోని కొందరు కీలక వ్యక్తుల పాత్రపై సిట్ దృష్టి సారించింది. ప్రభాకర్‌రావు 26 హార్డ్ డిస్క్ లు ధ్వంసం చేసినట్లు ఇప్పటికే గుర్తించారు. అందులో 7 కొత్త హార్డ్ డిస్క్ ల రీ ప్లేస్ చేయడం పై ఆయన్ని విచారిస్తున్నారు. రివ్యూ కమిటీ అనుమతి లేకుండానే రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలు ఫోన్ ట్యాప్ ఎందుకోసం? ఎవరికోసం? చేశారనే అంశంపై లోతుగా విచారిస్తున్నారు. ప్రభాకర్‌రావు ఎలాంటి విషయాలు బయటపెడుతారోనని గత ప్రభుత్వ పెద్దల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

## గుర్తుంచుకుంటారు (మొదటి పేజీ తరువాయి)

అఖిలేష్ యాదవ్ ప్రశంసించారు. దేశంలోని యాదవ సమాజం రేవంత్ రెడ్డిని ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటుందని, యాదవుల హృదయంలో రేవంత్ రెడ్డి ఉండిపోతారని అఖిలేష్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తెలంగాణలోని యాదవ వర్గానికి రాజకీయంగా మంచి గుర్తింపు ఇస్తున్నందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్, రామగుండం ఎంఎల్ఎ రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ సీనియర్ నేత రోహిన్ రెడ్డి తదితరులు సిఎం వెంట ఉన్నారు.

**విజన్ డాక్యుమెంట్‌తో గణనీయమైన ప్రగతి : సుబ్రమణియన్**

తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించి, అనుసరించడం ద్వారా రాష్ట్రం గణనీయమైన ప్రగతిని సాధిస్తుందని కేంద్ర ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు, ఆర్థికవేత్త ప్రొఫెసర్ అరవింద్ సుబ్రమణియన్ అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ప్రొఫెసర్ అరవింద్ సుబ్రమణియన్ మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8, 9 తేదీలలో జరిగిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజన్ డాక్యుమెంట్‌లోని విషయాలను ముఖ్యమంత్రితో ఆయన చర్చించారు.

## గజ గజ (మొదటి పేజీ తరువాయి)

శీతల, అతిశీతల గాలులు వీచే అవకాశం ఉందని చెప్పారు. దీంతో ఉత్తర, పశ్చిమ, ఈశాన్య జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు అధికారులు వివరించారు. ఆదివారం నుంచి పొగ మంచు పెరిగే అవకాశం ఉందన్నారు. శీతల గాలులతో పాటు పొగ మంచు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. చలిగాలులు, పొగ మంచు ప్రభావంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**రికార్డు స్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు..**

జిల్లాల్లో చలి ప్రభావం తీవ్రమైంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా గిన్నెధరిలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు 5.4 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోనూ చలి వణికిస్తోంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో శీతల గాలులు వీచే అవకాశం ఉంది. దీంతో ఈ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. శనివారం ఆదిలాబాద్, కొమరంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో శీతల గాలులు వీచే సూచనలున్నాయి. ఈ జిల్లాలకు సైతం ఎల్లో అలర్ట్ జారీ చేశారు. డిసెంబర్ 14వ తేదీన రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌లో చూస్తే రాత్రి వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందన్నారు.

**26 జిల్లాల్లో 10 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు..**

రాష్ట్రంలోని 26 జిల్లాల్లో రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపే నమోదవుతున్నాయి. వీటిలో 13 జిల్లాల్లో 8 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవడం చలి తీవ్రతను స్పష్టంగా చూపిస్తోంది. ఈశాన్య భారత దేశం నుంచి తెలంగాణ వైపు వచ్చే చల్లని గాలుల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని అధికారులు తెలిపారు. సాధారణం కన్నా గరిష్ఠంగా 4 డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. జనగామ మినహా అన్ని జిల్లాల్లో 10డిగ్రీల లోపు రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందన్నారు.

## సత్తా చాటాం (మొదటి పేజీ తరువాయి)

వివరించారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మొదటి విడత మాదిరిగానే రెండో విడత, మూడో విడత ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్ మద్దతు దారులకు పట్టం కట్టాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత 15 మాసాల్లో 80 వేలకు పై ఉద్యోగాలు ఇచ్చామని, ఉచిత బస్సు మొదలుకుని సన్న బియ్యం వరకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి నిదర్శనం పంచాయతీలో అత్యధిక స్థానాలు గెలుపు అన్నారు.

కాంగ్రెస్ ప్రజాపాలనను మెచ్చి ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. ఇతర రాష్ట్రాల్లో లేని సంక్షేమాన్ని తెలంగాణలో అందిస్తున్నామని జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కి 25 వేలకు పైగా మెజార్టీ ప్రజలు ఇచ్చారని గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు సామాజిక న్యాయంమెచ్చి ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో పనిచేసిన మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, స్థానిక నాయకులకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు.

**తెలంగాణ వికాసం వైపు పయనిస్తోంది..**

గ్లోబల్ సమ్మిట్‌తో ఊహించని విధంగా 5 లక్షల 75 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని తద్వారా తెలంగాణ ప్రభుత్వం పట్ల పెట్టుబడిదారులకు నమ్మకం, విశ్వాసం పెరిగిందన్నారు. పదేళ్ల బిఆర్ ఎస్ పాలనలో వచ్చిన పెట్టుబడులు ఎన్ని? వచ్చాయని ప్రశ్నించారు. ఓట్ చోరీపై 14 లక్షల వరకు సంతక సేకరణ జరిగిందన్నారు. ఈ నెల 14 వ తేదీన రామ్ లీలా మైదాన్ లో జరిగే మహాధర్నాలో సిఎం రేవంత్,కేబినెట్ మొత్తం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పిపిసి సభ్యులకు, పాల్గొంటారని తెలిపారు. మహాధర్నాలో పెద్ద ఎత్తున నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఓట్ చోరీ తోనే తెలంగాణ బిజెపి ఎంపిలు గెలిచారని ఆయన స్పష్టం చేశారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఎనిమిదిమంది ఎంపిలు ఉన్న బిజెపి గెలిచింది ఎంత? బిజెపి ఎమ్మెల్యేలకు, ఎంపిలకు వేసిన ఓట్లు ఎక్కడ పోయాయి? అని ప్రశ్నించారు.

**కవితకు అత్యాశ...**

'నేను కూడా సిఎం అవుతా..ఒక్కొక్కరి తోలు తీస్తా'' అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పేర్కొనడంపై టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ స్పందించారు. కవితకి సిఎం కావాలనే ఆశ ఉంటే తప్పు లేదు.. మనిషికి అత్యాశ ఉండకూడదు అని చురకలంటించారు. బిఆర్ఎస్ నేతల అక్రమాలను కవిత వాస్తవాలను బయటపెట్టారు, కవిత ఆరోపణలపై విచారణ చేయించాలని సిఎం దృష్టికి తీసుకెళ్తా అని తెలిపారు.

## బిఆర్ఎస్‌లోనే బీజం (మొదటి పేజీ తరువాయి)

ప్రచారం చేసినందుకు, తమ పరపతిని దెబ్బతిసినందుకు తనకు,తన భర్తకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, బిజెపి, బిఆర్ఎస్ ఎంఎల్ఎలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాదవరం కృష్ణారావు, టి న్యూస్ చానల్‌ను డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి లీగల్ నోటీసు అందజేస్తున్నట్టు వెల్లడించారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ తాను ముఖ్యమంత్రి అయితే మాత్రం 2014 నుంచి ఇప్పటి వరకు అన్ని అన్యాలపైన ఆరా తీస్తానని స్పష్టం చేశారు. తన భర్త అనిల్ కుమార్, వ్యాపార వేత్త ఎ.వి రెడ్డితో కలిసి ఫోటోను చూపిస్తూ భూలావాదేవీలు జరిగాయని గుంటనక్కలు వెకిలి ప్రయత్నాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. తాము పార్లమెంట్‌లో పోరాటం చేస్తుంటే, ఎసి గదుల్లో కూర్చొని, కెసిఆర్ నీడలో చేరి పందికొక్కుల్లాలగా ప్రజల సొమ్ము తిన్నారని ఆరోపించారు. లీజుకు ఇచ్చిన భూములు కెటిఆర్ విక్రయించలేదా? అని అన్నారు. తాను ఇంకా మొత్తం చిట్టా విప్పలేదని, కేవలం ఇది టాస్క్ మాత్రమేనని, దీనికే ఇలా భయపడితే ఎలా అని ఎద్దేవా చేశారు. ముందు, ముందు టెస్ట్ మ్యాచ్‌లు కూడా ఉంటాయన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తన భర్త వచ్చి ఏమైనా పనులు అడిగారా అని నిలదీశారు. కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావులతో తాము ఏమైనా అవుటాఫ్‌గా అనుకూలమైన పనులు చేసుకున్నామా? అని మండిపడ్డారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో తాను ఒక్కరూపాయి కూడా లాభం పొందలేదని వివరించారు. మాజీ మంత్రి హరీశ్ రావు, బిఆర్ఎస్ తనపైన దుష్ప్రచారం చేయాలనుకున్నప్పుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బిఆర్ఎస్ సోషల్ మీడియా, కృష్ణారావు లాంటి ఎమ్మెల్యేల ఆరోపణలు వస్తాయన్నారు.

**ఎన్నికల ముందే భూ బదలాయింపు జరిగింది...**

ఎన్నికల కు ముందు 2023, అక్టోబర్ 7న బిఆర్ఎస్ ప్రభుత్వం కెటిఆర్‌కు చెందిన శాఖ నుంచి ఐదు ఎకరాలకు సంబంధించిన స్థలాన్ని భూమార్పిడి చేశారని కవిత ఆరోపించారు. పరిశ్రమల భూమిని రెసిడెన్షియల్ భూమిగా మార్చుకోవచ్చని ఎన్నికల ముందు ఎందుకు జివో ఇచ్చారని?, ఇందుకు ఏం లాభం జరిగిందని, ఇందులో కృష్ణారావు పాత్ర ఏమిటని ప్రశ్నించారు. ఈ స్థల బదలాయింపు చేసిన వ్యక్తి కృష్ణారావుకు బందువు అంటా కదా అని అన్నారు. ఈభూమికి సంబంధించి బిఆర్ఎస్, కెటిఆర్, ఎవరు సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వ్యాపార వేత్త ఎవి.రెడ్డికి పోచారం శ్రీనివాస్ రెడ్డి వ్యాపార భాగస్వామి అని, పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎవరికి బినామీ అని, ఆయన ఎక్కువగా 'రామన్న'తోనే ఉంటారని తెలిపారు. కృష్ణారావు కుమారుడు భాగస్వామిగా ఉన్న కంపెనీ 70 ఎకరాలలో విల్లాలు నిర్మించిందని, ఇందులో ప్రభుత్వ రోడ్ స్థలంఉన్నదని, అలాగే చెరువు స్థలం కూడా ఉన్నదని ఆరోపించారు. గాజుల రామారంలో కె.పి. వివేకానంద, మాదవరం కబ్జా చేశారని కవిత ఆరోపించారు.

## కన్నుమూత (మొదటి పేజీ తరువాయి)

ఉన్నారు. ఐదు దశాబ్దాలకు పైగా ప్రజా జీవితంలో అనేక కీలకమైన రాజ్యాంగ, మంత్రి పదవులను నిర్వహించారు. 2008 లో కేంద్ర హోం మంత్రిగా ఉన్న సమయంలో పాకిస్తాన్ శిక్షణ పొందిన పది మంది ఉగ్రవాదులు నవంబరు 26 రాత్రి ముంబైపై దాడులకు ఒడిగట్టినప్పుడు... ఈ అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు మూడు వేర్వేరు దుస్తులలో కనిపించడంపై ప్రజల నుంచి, మీడియా నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్నారు. విమర్శలకు వ్యతిరేకంగా తనను తాను సమర్థించుకుంటూ, ప్రజలు దుస్తులను కాదు, విధానాన్ని విమర్శించాలని ఆయన అన్నారు. ముంబై దాడులు పాటిల్ రాజకీయ జీవితంపై తీవ్రంగా ప్రభావం చూపాయి. కేంద్ర మంత్రివర్గంలో ఆయన స్థానం దాదాపుగా భరించలేనిదిగా మారింది. దీంతో పాటిల్ నవంబరు 30, 2008న రాజీనామా చేశారు. కాగా శివరాజ్ పాటిల్ మృతికి పార్టీలకు అతీతంగా నాయకులు సంతాపం ప్రకటించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధినేత శరద్ పవార్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, అనేకమంది పాటిల్‌కు సంతాపం తెలిపారు. నివాళులర్పించారు. 1935 అక్టోబరు 12న జన్మించిన పాటిల్, 19661970 మధ్య లాతూర్ మునిసిపాలిటీ అధ్యక్షుడిగా తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు. తరువాత రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 19771979 మధ్య ఆయన మహారాష్ట్ర అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్, స్పీకర్‌తో సహా కీలక పదవులను నిర్వహించారు. ఆ తర్వాత ఆయన లాతూర్ లోక్‌సభ స్థానాన్ని ఏడుసార్లు గెలుచుకున్నారు. 1991 నుంచి 1996 వరకు లోక్‌సభకు 10వ స్పీకర్‌గా ఉన్నారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి చెందిన రూపతై పాటిల్ నీలంగేకర్ చేతిలో ఆయన ఓడిపోయారు. ఆయన రాజ్యసభ సభ్యుడు కూడా. కాంగ్రెస్ నాయకుడు కేంద్ర మంత్రివర్గంలో హోం, రక్షణ, వాణిజ్యం, శాస్త్ర, సాంకేతికతతో సహా అనేక కీలక మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. పాటిల్ పంజాబ్ గవర్నర్‌గా 2010 నుంచి 2015 వరకు చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతానికి అడ్మినిస్ట్రేటర్‌గా పని చేశారు. 2022లో ఒక పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతూ 'జిహాద్' భావన ఇస్లాంలోనే కాకుండా భగవద్గీత, క్రైస్తవ మతంలో కూడా ఉందని చెప్పినందుకు ఆయన వివాదానికి గురయ్యారు. మార్చి 2025 లో పాటిల్ తన కుటుంబంతో ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిశారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం**

నైతిక విలువలు, హుందాతనంతో రాజకీయాలు నెరిపిన పెద్ద మనిషి శివ్‌రాజ్ పాటిల్ మృతి దేశానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మాజీ మంత్రి, లోక్‌సభ మాజీ స్పీకర్ శివ్‌రాజ్ పాటిల్ మృతిపై సిఎం రేవంత్ రెడ్డి సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. స్థానిక సంస్థల ప్రతినిధి నుంచి ప్రస్థానం ప్రారంభించిన పాటిల్ ఏడు సార్లు ఎంపిగా, లోక్‌సభ స్పీకర్‌గా, కేంద్ర హోమ్ శాఖ మంత్రిగా, పంజాబ్ గవర్నర్‌గా సేవలు అందించారని సిఎం రేవంత్ రెడ్డి ఒక సంతాప సందేశంలో కొనియాడారు.

**టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ సంతాపం**

మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శివరాజ్ పాటిల్ మృతి పట్ల టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. లోకసభ స్పీకర్‌గా, కేంద్ర మంత్రిగా, గవర్నర్‌గా శివరాజ్ పాటిల్ అనేక పదవులు నిర్వహించారని ఆయన గుర్తు చేసుకున్నారు.

## 100% ఎఫ్‌డిఐ (మొదటి పేజీ తరువాయి)

నొక్కిచెప్పినప్పటికీ ఏకపక్షంగా ముందుకెళ్లింది. దేశం ఆర్థికంగా బలహీనపడవచ్చని కూడా వామపక్ష నాయకులు గతంలోనే హెచ్చరించారు. ఉద్యోగ సంఘాలు కూడా గతంలో దేశవ్యాప్త సమ్మెలకు పిలుపులిచ్చాయి. కార్మికులకు, ప్రజలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవద్దంటూ పార్లమెంటు లోపల, బయట కూడా వామపక్షాలు పోరాడాయి. కానీ, బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డిఐలను మోదీ కేబినెట్ ఆమోదించింది. పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరుగుతుండటంతో ఈ బిల్లును ప్రవేశపెట్టాలని భావిస్తోంది. పార్లమెంటు సమావేశాల కోసం లిస్ట్ చేసిన13 శాసనాల్లో బీమా చట్టాల (సవరణ) బిల్లు 2025 ఉన్నట్లు లోక్‌సభ బులెటిన్ పేర్కొంది. బీమా రంగంలో ఎఫ్‌డిఐలను 74 శాతం నుంచి 100 శాతానికి పెంచుతామని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కాగా, బీమా రంగం ఎఫ్‌డిఐ ద్వారా రూ.82వేల కోట్లను ఆకర్షించగలిగింది. ఈ రంగంలోకి ఎఫ్‌డిఐలకు పూర్తి అనుమతినిస్తే, దేశీయ పెట్టుబడులు కూడా పెరుగుతాయన్నది కేంద్రం అంచనా. విదేశీ సంస్థలు భారతీయ కంపెనీలపై ఆధారపడకుండా సొంతంగా పని చేయడానికి 100 శాతం ఎఫ్‌డిఐ పెంపుదలతో అవకాశం లభిస్తోందని భావిస్తోంది.

**జనగణనకు రూ.11,718 కోట్లు** : జనాభా లెక్కలు చేపట్టడం కోసం రూ.11,718 కోట్ల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం లభించినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దేశంలో తొలిసారిగా డిజిటల్ జనగణనకు మోదీ ప్రభుత్వం సిద్ధమైందని చెప్పారు. రెండు దశల్లో ప్రక్రియ జరుగుతుందని అన్నారు. హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ (గృహాలను జాబితా చేయడం, లెక్కించడం) 2026, ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు జరుగుతుందని, జనాభా లెక్కల సేకరణ (పీఈ) 2027 ఫిబ్రవరిలో మొదలవుతుందన్నారు. లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని హిమ క్షేత్రాల్లో ఎన్యుమరేషన్ 2026 సెప్టెంబరులో జరుగుతుందని వైష్ణవ్ తెలిపారు. ఎన్యుమరేషన్ డిజిటల్‌గా జరుగుతుందన్నారు. 30 లక్షల మంది ఫీల్డ్ అధికారులు ఈ బృహత్ కార్యాన్ని చేపడతారన్నారు. డేటా సేకరణ కోసం మొబైల్ యాప్, పర్యవేక్షణ కోసం కేంద్ర పోర్టల్ వినియోగిస్తారని చెప్పారు. ఒక్క క్లిక్‌తో వివరాలన్నీ అందుబాటులోకి రావడమే కాకుండా సందేహాల నివృత్తికి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. మెషిన్ రీడబుల్ ఆక్షనబుల్ ఫార్మాట్‌లో మంత్రిత్వ శాఖలకు డేటా మొత్తం సెన్సెస్‌యాజ్‌ఏ సర్వీస్ (సిఎఎఎస్) ద్వారా అందుతుందని వైష్ణవ్ అన్నారు. జనగణనలో భాగంగానే కులగణన కూడా జరుగుతుందని ఆయన తెలిపారు.

**71 చట్టాలు బుట్టదాఖలు** : దీర్ఘకాలంగా వినియోగంలో లేని 71 చట్టాలను బుట్టదాఖలు చేసేందుకు కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. ఈ 71 చట్టాల్లో 65 'ప్రిన్సిపల్ యాక్ట్'కు జరిగిన సవరణలు కాగా ఆరు 'ప్రిన్సిల్ లాస్' అని అధికారులు వెల్లడించారు. ఇందులో ఒకటి బ్రిటిష్ కాలం నాటిదిగా తెలిపారు. ఇప్పటివరకు మొత్తంగా 1,562 పాత చట్టాలను రద్దు అయ్యాయని వెల్లడించారు.

**కొబ్బరి ఎంఎస్‌పి పెంపు:** కొబ్బరి సాగుదారులకు మెరుగైన రాబడి వచ్చేందుకుగాను, డిమాండ్‌కు తగ్గట్లు ఉత్పత్తి పెంచేందుకు 2026 సీజన్‌కుగాను మిల్లింగ్ కొబ్బరి (క్వింటా)ఎంఎస్‌పిని రూ.445 నుంచి రూ12,027కు పెంచేందుకు కేంద్రకేబినెట్ ఆమోదం తెలిపింది. కొబ్బరి కాయ క్వింటా ఎంఎస్‌పిని రూ.400నుంచి రూ.12,500కు పెంచినట్లు అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఐసిసిసిలో ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బంజారాహిల్స్‌లోని తెలంగాణ రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అత్యాధునిక ఫిట్‌నెస్ కేంద్రాన్ని శుక్రవారం డిజిపి బి.శివధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిపి శ్రీ బి.శివధర్ రెడ్డి మాట్లాడుతూ.... సిబ్బంది ఆరోగ్యం, శ్రేయస్సుకు ప్రాధాన్య తనిచ్చిన టీజీఐసీసీ అధికారులను అభినందించారు. ఇటువంటి చర్యలు సిబ్బందిలో నైతిక స్థైర్యాన్ని బలోపేతం చేసి, పోలీసింగ్ విభాగంలో నిరంతర ఉత్తమ పనితీరుకు దోహదపడతాయని పేర్కొన్నారు. హైదరాబాద్ సిటీ పోలీస్, తెలంగాణా సైబర్ సెక్యూరిటీ బ్యూరో, తెలంగాణా ఈగల్ ఫోర్స్‌తో పాటు టిజిఐసిసిలలోని సిబ్బంది శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం మెరుగుపరచడానికి ఈ కొత్త సెంటర్‌ను సిద్ధం చేశారు. 1900 చదరపు అడుగుల విస్తీర్ణంలో నెలకొల్పబడిన ఈ ఫిట్‌నెస్ సెంటర్లో అత్యాధునిక కార్డియో, స్ట్రెంథ్‌ట్రైనింగ్ మరియు కండిషనింగ్ పరికరాల సముదాయం ఉంది. ఇందులో ఇతర వృత్తిపరమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఈ కార్యక్రమానికి సీనియర్ ఐపిఎస్ అధికారులు శిఖా గోయల్, విసి సజ్జనార్, కమలాసన్ రెడ్డి, అవినాష్ మహంతి, అభిషేక్ మహంతిలు పాల్గొన్నారు.

## సివిల్ వివాదంలో పోలీసుల జోక్యమా?

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఒక స్థల వివాదంలో పోలీసులు జోక్యం చేసుకోవడంపై హైకోర్టు శుక్రవారం విచారించి రాష్ట్ర ప్రభుత్వానికి ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. కౌంటరు దాఖలు చేయాలని హోంశాఖ ముఖ్యకార్యదర్శి, నగర పోలీసు కమిషనర్, శామీర్‌పేట్ ఎస్‌హెచ్‌ఓ, ఎస్సై, ప్రైవేటు వ్యక్తి వెంకటరెడ్డిలకు నోటీసులు ఇచ్చింది. విచారణను ఈ నెల 19కి వాయిదా వేస్తూ జస్టిస్ శ్రవణ్‌కుమార్ ఆదేశాలను జారీ చేశారు. సివిల్ వివాదంలో పోలీసులు ఏవిధంగా జోక్యం చేసుకుంటారో చెప్పాలని ఆదేశించారు. శామీర్‌పేట్ ఎస్‌హెచ్‌ఓ, ఎస్సైలు సివిల్ వివాదంలో జోక్యం చేసుకున్నారని పేర్కొంటూ శామీర్‌పేట్ మండలం తూంకుంటకు చెందిన అనిల్‌కుమార్ పిటిషన్ వేశారు. తూంకుంటలో 133 చదరపు గజాలను పిటిషనర్ 2018 మార్చిలో కొన్నారని, ప్రహరీ కట్టి గది కట్టి పన్ను చెల్లిస్తున్నారని, ఆ గదిలోని వాచ్‌మెన్ వెంకటరెడ్డి అనే వ్యక్తిని బయటకు పంపేసి నోటరీ పేపర్‌తో స్థలాన్ని కాజేశారని, ఇందకు పోలీసులు కూడా సహకరించారని చెప్పారు.



## ఔట్‌సోర్సింగ్‌కు బదిలీ చేయవద్దు

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో ఒప్పంద ఉద్యోగులకు న్యాయం చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎఐటియుసి ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం శుక్రవారం ప్రజాభవన్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. ఇటీవల జివొ 1195 ద్వారా కొన్ని క్యాడర్ల ఉద్యోగులను కాంట్రా క్ట్ నుంచి ఔట్‌సోర్సింగ్‌లోకి మార్చారని, దీంతో ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని చిన్నారెడ్డికి వివరించారు. దీనిపై స్పందించిన చిన్నారెడ్డి తక్షణమే వైద్య ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తుకి ఫోన్ చేసి కాంట్రాక్ట్ ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్‌కి బదిలీ చేయవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆచంట అభిషేక్, బుచ్చయ్య, అంజి, జయమ్మ, అలివేలు, జెన్. బి, నార్సింగ్ శీను, కమలమ్మ, భద్రయ్య, రాధమ్మ, అలివేలు పాల్గొన్నారు.

# జర్మనీతో సుదీర్ఘకాలంగా స్నేహబంధం



ఐటి, డిఫెన్స్, ఫార్మా రంగాల్లో కలిసి పనిచేద్దాం

జర్మనీ పార్లమెంటు బృందంతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

2047 విజన్ డాక్యుమెంట్ అద్భుతం: జర్మనీ పార్లమెంట్ బృందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జర్మనీ, భారతదేశం మధ్య సుదీర్ఘకాలంగా స్నేహబంధం కొనసాగుతుందని, రాబోయే రోజుల్లో ఈ బంధం మరింత పటిష్టంగా ముందుకు సాగాలని ఆశిస్తున్నట్టు డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాభవన్‌లో శుక్రవారం మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి జర్మనీ పార్లమెంటు బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంటు బృందాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఐటి, డిఫెన్స్, ఫార్మా రంగాల్లో జర్మనీతో కలిసి పని చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టండని, తెలంగాణ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులను జర్మనీకి పంపడానికి తెలంగాణ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని, జర్మనీ ప్రసిద్ధి చెందిన మెటలర్జీ, కార్ల తయారీ రంగంలో జర్మనీతో కలిసి పని చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని డిప్యూటీ సీఎం జర్మనీ పార్లమెంట్ బృందానికి వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుందని, హైదరాబాద్ ఐటీ రంగానికి హబ్‌గా వెలుగొందుతుందని, దీంతోపాటు మూసీ పునర్జీవనం, వ్యవసాయ ఆధారిత రంగంపైన ఆసక్తిగా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మిస్తున్న స్కిల్ యూనివర్సిటీలో జర్మన్ లాంగ్వేజ్ విభాగాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని, తద్వారా తెలంగాణ విద్యార్థులు జర్మనీ భాష నేర్చుకొని జర్మనీ దేశంలో పనిచేసేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

**సైబర్ సెక్యూరిటీకి అత్యంత ప్రాధాన్యత..**

తెలంగాణ ప్రభుత్వం సైబర్ సెక్యూరిటీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సైబర్ సెక్యూరిటీ విషయాల్లో చాలా దూరదృష్టితో సైబర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రం ఏర్పాటు చేశామని, ఈ రంగంలో లోతుగా అధ్యయనం చేస్తున్నామని వివరించారు. సీనియర్ పోలీసు అధికారి ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ సెల్ ఏర్పాటు చేశామని, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేకంగా రెండు ఫ్లోర్లు సైబర్ సెక్యూరిటీ కోసం కేటాయించామన్నారు. ఆర్థిక నేరాలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయని, ఫైనాన్స్ రంగంలో సైబర్ ఫిషింగ్ ఎలా జరుగుతుంది, వాటిని అరికట్టేందుకు బెస్ట్ ఎఐ టూల్స్ వాడుతున్నట్టు మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ అద్భుతంగా ఉందని జర్మనీ పార్లమెంటు బృందం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించింది. ప్రతి రంగంలో సాధించాల్సిన లక్ష్యాలను ఈ విజన్ డాక్యుమెంట్‌లో స్పష్టంగా పేర్కొనడం అభినందనీయమని, రాష్ట్ర ప్రగతి పట్ల ప్రభుత్వ నిబద్ధత ఈ డాక్యుమెంట్ ద్వారా స్పష్టంగా తెలుస్తుందని జర్మనీ పార్లమెంట్ బృందం డిప్యూటీ సిఎం, మంత్రి శ్రీధర్ బాబుకు వివరించారు. సైబర్ సెక్యూరిటీ, స్కిల్ లేబర్ అంశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం కోరుకుంటున్నామని జర్మన్ పార్లమెంట్ బృందం వివరించింది. జర్మనీకి చెందిన పెట్టుబడిదారులు చాలా మంది భారతదేశంలో పెట్టుబడులు పెట్టారని, తమ దేశానికి చెందిన బిఒఎస్‌హెచ్ వంటి ప్రసిద్ధ కంపెనీలు ఇక్కడ పెద్ద సంఖ్యలో పనిచేస్తున్నాయి, తమ దేశానికి చెందిన ఇంజనీర్లు భారతదేశంలో, ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్నారని జర్మనీ పార్లమెంటు బృందం వివరించింది. భారతదేశానికి చెందిన 60 వేల మంది విద్యార్థులు జర్మనీలో వివిధ రకాల కోర్సులను అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు, స్కిల్ లేబర్‌కు భారతదేశం, తెలంగాణ రాష్ట్రంలో కొదవలేదని అన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఇందన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, జెన్‌కొ సిఎండి హరీష్, ప్రణాళిక శాఖ సెక్రటరీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, అసెంబ్లీ సెక్రటరీ నర్సింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



## జాతర పనులు త్వరితగతిన పూర్తి

మేడారం సమ్మక్క–సారలమ్మలను దర్శించుకున్న మంత్రులు

**ప్రజాపక్షం/ములుగు :** మేడారం దేవాలయం అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి, సీతక్కలు కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి ధనసరి సీతక్క శుక్రవారం సందర్శించారు. మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. శుక్రవారం ఎస్ఎస్ తాడ్వాయి మండలం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయ గద్దెల పునరుద్దరణ అభివృద్ధి పనులను, దేవాలయ ప్రాంగణంలోని పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల రాతి నిర్మాణాలను, ఆలయ ప్రాంగణ ఫ్లోరింగ్ పనులను, రాతి స్తంభాల స్థాపన నిర్మాణ పనులను, జంపన్న వాగు వద్ద పనులను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులల్లో వేగం పెంచి త్వరిగతిన పూర్తి చేయాలని సంబందిత అదికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, పూజారులు ఆర్అండ్‌బి, ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిది గోబెల్స్ ప్రచారం

లేబర్ కోడ్లు కార్మిక వర్గానికి మేలు చేస్తాయంటూ తప్పుడు ప్రచారం

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మండిపాటు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లు కార్మిక వర్గానికి ఎంతో మేలు చేస్తాయని తప్పుడు ప్రకటన చేస్తున్న బిజెపిని రానున్న రోజుల్లో కార్మిక వర్గం తగిన గుణపాఠం చెబుతుందని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ అన్నారు. కార్మిక వర్గానికి అండగా నిలబడిన కమ్యూనిస్టులపైన బిజెపి నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి తప్పుడు ప్రకటన చేశారన్నారు. ఇలాంటి గోబెల్స్ ప్రచారంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలను నిలువునా మోసం చేస్తున్నదని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో 100 మంది వరకు కార్మికులు ఉన్న సంస్థల్లో కార్మిక చట్టాలను అమలు చేయాలనేది స్పష్టంగా ఉన్నప్పటికీ ప్రస్తుత లేబర్ కోడ్‌లలో దీనిని 300 మంది వరకు పెంచడం ఎవరి ప్రయోజనం కోసమనే అంశాన్ని కార్మికులు అర్థం చేసుకుంటున్నారని వివరించారు. పర్మినెంట్ ఉద్యోగాలకు కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం మిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో సంవత్సరానికి ఒకసారి సగం నెల జీతం ఇచ్చి ఇంటికి పంపిస్తామని, ఈ లేబర్ కోడ్‌లలో స్పష్టం చేశారని, దీనిని బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వానికి అంటగాగుతున్న బిఎంఎస్ కూడా కార్మిక కోడ్‌లను వ్యతిరేకిస్తున్నదని నరసింహ గుర్తు చేశారు. పర్మినెంట్ ఉద్యోగాల స్థానంలో ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ పేరుతో కార్మిక వర్గాన్ని శ్రమదోపిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. దిగు వర్కర్లకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేస్తామని అంశాన్ని కార్మిక వర్గం స్వాగతిస్తున్నప్పటికీ, అదే స్థాయిలో అసంఘటిత రంగంలో ఉన్నటువంటి ఆటో హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో లక్షలాదిగా ఉన్న ఆశ, అంగన్వాడి, మధ్యాహ్న భోజనం లాంటి అనేక స్కీములలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు కూడా అందించడం లేదని అన్నారు. వారి కోసం ఏ చట్టాలను తీసుకురాకపోవడం ఏ విధంగా న్యాయం అనేది బిజెపి నాయకులు సమాధానం చెప్పాలన్నారు. కార్మికులకు అండగా కార్మిక నాయకులు ఉండే విధానాన్ని తొలగించే ప్రయత్నం చేస్తున్నదని, 51 శాతానికి పైబడి ఓట్లు వస్తేనే గుర్తింపు సంఘంగా గుర్తించాలని నిబంధన తీసుకురావడం ఏ విధమైన న్యాయమని ప్రశ్నించారు. భారత రాజ్యాంగ ప్రకారం కొద్ది శాతం మెజార్టీ ఓట్లతో దేశ ప్రధానిగా ఉన్నటువంటి నరేంద్ర మోడీ ఈ విధమైన చట్టాలు తీసుకురావడం ఎంత వరకు సమంజసం అని మండిపడ్డారు. గతంలో రైతాంగం రైతు చట్టాలకు వ్యతిరేకంగా చేసిన పోరాటాన్ని బిజెపి నాయకులు గుర్తుంచుకోవాలని సూచించారు.

# హెచ్‌సిఎను రద్దు చేయండి

సిసిఎస్, సిఐడి, ఉప్పల్, ఇడి కేసుల్లో చిక్కుకున్న వైనం

బిసిసిఐ నిధుల్లో భారీ కుంభకోణం.. సెలక్షన్ పేరుతో కలెక్షన్‌లు

మీడియా సమావేశంలో టిసిఎ నేతల వెల్లడి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పీకలలోతు అవినీతిలో కూరుకుపోయిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)ను రద్దు చేయాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బిసిసిఐ ఇచ్చిన వందల కోట్ల రూపాయలను దోచుకోవడంతో పాటు సిసిఎస్, ఉప్పల్, సిఐడి, ఇడి కేసులు నమోదు చేసిందని, ఈ కేసుల్లో హెచ్‌సిఎ నేతలు జైళ్లకు కూడా వెళ్లి వచ్చారని ఇలాంటి వారిని క్రికెట్ అసోసియేషన్ నుంచి భర్తరఫ్ చేయాలని టిసిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రికెట్ టీంకు క్రీడాకారులను సెలక్షన్‌ల పేరుతో కలెక్షన్‌లకు తెగబడుతున్న హెచ్‌సిఎ పట్ల క్రికెట్ అభిమానులు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెచ్‌సిఎ తాజాగా నిర్వహించిన అండర్14 ఎంపికల్లో హెచ్‌సిఎ హైకోర్టు ఆదేశాలను, బిసిసిఐ నిబంధనలను ఉల్లంఘించి సెలక్షన్‌ల పేరుతో కలెక్షన్‌ల దోపిడీకి పాల్పడిందన్నారు. టిసిఎ వెల్లడించిన వివరాల ప్రకారం, జిల్లావారీగా ట్రయల్స్ నిర్వహించాల్సినప్పటికీ హెచ్‌సిఎ పబ్లిక్ నోటిఫికేషన్ ఇవ్వకుండానే రాష్ట్రంలోని అన్ని జిల్లాల యువ క్రికెటర్లను సికింద్రాబాద్ జిమ్ఖానా గ్రౌండ్స్‌కు ఒకేచోటకు పిలిపించిందని ఆరోపించింది. జిల్లాల్లో ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకుండానే ఈ విధంగా పిలుపునివ్వడం వల్ల సుమారు 3,500 మంది విద్యార్థులు 250 కిమీ మేర ప్రయాణించి తల్లిదండ్రులతో రాగా, అక్కడ ఏర్పాట్లు లేక కలకలం, అవ్యవస్థ పరిస్థితులు నెలకొన్నాయని ఆయన విమర్శించారు. ఒకేచోట వేలాది మందికి ఒకరోజులో ట్రయల్స్ ఎలా నిర్వహించగలరు? జిల్లా మ్యాచ్లు నిర్వహించడం తప్పనిసరి క్రమంలో ఈ ప్రక్రియను పక్కనపెట్టడం ద్వారా అర్హులైన ప్రతిభను అణగదొక్కడానికే ఇది చేసిన చర్య అని టిసిఎ ఆరోపించింది. అంతేకాకుండా అండర్ 14 విభాగం బిసిసిఐ గుర్తింపు పొందిన టోర్నమెంట్ కాదని, ఈ పరిస్థితుల్లో వేలాదిమంది పిల్లల వ్యక్తిగత వివరాలు సేకరించడంపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. హెచ్‌సిఎ క్రీడాకారుల డేటాను ప్రైవేట్ అకాడమీలకు వాణిజ్య ప్రయోజనాల కోసం మళ్లించే ప్రయత్నం జరుగుతోందని, ఇది డేటా చౌర్యంతో పాటు క్రిమినల్ ఉద్దేశపూర్వక చర్య అని ఆయన ఆరోపించారు. రాబోయే నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్ 2025 నిబంధనలను హెచ్‌సిఎ స్పష్టంగా ఉల్లంఘిస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో 4 కోట్ల జనాభా ఉన్నప్పటికీ హెసిఎ ఆధీనంలో కేవలం 210 క్లబ్బు మాత్రమే ఉండటం, ఒకే లీగ్ హైదరాబాద్‌లోనే సాగుతున్న దాన్ని లెక్కచూపుతూ హెచ్‌సిఎ క్రికెట్‌పై ఏకపక్ష ఆధిపత్యం కొనసాగిస్తోందని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో టిసిఎ రాబోయే సంవత్సరాల్లో తెలంగాణ ప్రీమియర్ లీగ్ 2026, పాఠశాలలు–కళాశాలల స్థాయి టోర్నమెంట్లు, డిసెంబర్ 21 నుంచి తెలంగాణ గోల్డ్ కప్ 2025 వంటి రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. హెచ్‌సిఎపై ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

## రాజకీయాల్లో గెలుపోటములు సహజం : ఎంపి అఖిలేష్ యాదవ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజకీయాల్లో గెలుపు, ఓటములు ఉంటాయని, ప్రజలు ఎప్పుడు మన వెంట ఉంటారో తెలియబోదని సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు, ఎంపి అఖిలేష్ యాదవ్ అన్నారు. హైదరాబాద్, నందినగర్‌లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావును అఖిలేష్ యాదవ్ శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా తాజా రాజకీయాలు, తదితర అంశాలపైన చర్చించినట్టు తెలిసింది. అనంతరం అఖిలేష్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ దేశం ప్రగతిశీల, ఒక విజన్‌వైపు వెళ్లాలని, విభజన రాజకీయాలు అంతం కావాలని ఆకాంక్షించారు. ప్రజలు ఒకసారి స్వీకరిస్తారని, మరోసారి అవకాశం కల్పిస్తారన్నారు. కెటిఆర్ మాట్లాడుతూ యుపిలో సమాజ్‌వాది పార్టీ శాసనసభలో అధికారాన్ని కోల్పోయిన తర్వాత 37 మంది ఎంపిలను గెలిపించుకుని పార్లమెంట్‌లో మూడవ అతి పెద్ద పార్టీగా అవతరించిందని, అదే స్ఫూర్తితో బిఆర్ఎస్ ముందుకు వెళ్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తన్నీరు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కట్టడికి అత్యాధునిక సాంకేతికత

డ్రగ్స్ నేరగాళ్లపై రౌడీషీటర్ల తరహా నిఘా

కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీల సమన్వయ సమావేశంలో సిపి సజ్జనార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డ్రగ్స్ కట్టడికి అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నట్లు హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి.సజ్జనార్ తెలిపారు. యువతరం భవిష్యత్తును భ్రష్టు పట్టిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని ఏరిపారేసేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టడంతో పాటు డ్రగ్స్ వినియోగదారులపై ఉక్కుపాదం మోపుతామని ఆయన హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లపై ఎటువంటి నిఘా ఉంచుతామో, డ్రగ్స్ నేరగాళ్లు, పెడ్లర్లపైనా అదే స్థాయి నిఘా ఉంటుందని సిపి స్పష్టం చేశారు. డ్రగ్స్ నియంత్రణ చర్యల్లో భాగంగా బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసిలో శుక్రవారం నగర సిపి విసి సజ్జనార్ అధ్యక్షతన అత్యున్నత స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ఈ భేటీకి ఐబి, డిఆర్ఐ, ఎన్‌సిబి, ఎక్సైజ్, కౌంటర్ ఇంటెలిజెన్స్, ఈగల్, ఎఫ్ఆర్ఆర్వో తదితర కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌కు చెక్ పెట్టేందుకు 'హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్' (హెచ్‌న్యూ)ను మరింత బలోపేతం చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న బృందాలకు అదనంగా నాలుగైదు కొత్త బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ, నిందితుల అరెస్టుల్లో ఈ బృందాలు కీలకంగా వ్యవహరిస్తాయని పేర్కొన్నారు.

**డ్రగ్స్ నియంత్రణకు అన్ని విభాగాల పరస్పర సహకారం..**

మాదకద్రవ్యాల నిర్మూలన అనేది ఒక్కరోజుతో ముగిసే ప్రక్రియ కాదని, అది నిరంతర పోరాటమని, అన్ని విభాగాలు పరస్పర సహకారంతో పని చేయాలని సూచించారు. ఇకపై ప్రతినెల అన్ని ఏజెన్సీలతో సమన్వయ సమావేశాలు నిర్వహించి, కేసుల పురోగతిని సమీక్షించనున్నట్లు తెలిపారు. పాత కేసులు, నిందితుల కదలికలు, కొత్త నేర పద్ధతులపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని మార్పిడి చేసుకోవాలన్నారు. డ్రగ్స్ రవాణా, వినియోగంలో విదేశీయుల పాత్రపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించడంతో పాటు విమానాశ్రయాల్లో ప్రయాణికుల సమాచారం ఆధారంగా సంబంధిత ఏజెన్సీస్ నిరంతరం సమన్వయం చేసుకుంటూ అనుమానితుల కదలికలపై నిఘా పెట్టాలని సూచించారు. అలాగే, డ్రగ్స్ రవాణాకు కొరియర్ సర్వీసులు వేదికగా మారుతున్న నేపథ్యంలో వాటిపైనా ప్రత్యేక దృష్టి సారించాలని, వైద్యం కోసం నగరానికి వచ్చి, ఆసుపత్రుల్లో చేరకుండా తిరుగుతున్న విదేశీయుల వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోవాలని, ఇలాంటి వారి వివరాలను డిఆర్ఐ, ఎఫ్ఆర్ఆర్ఓ అధికారులతో పంచుకుని వారిని వెంటనే ట్రాక్ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి, ఐబి జాయింట్ డైరెక్టర్ తిరుగణన సంబంధన్, డిఆర్ఐ డిప్యూటీ డైరెక్టర్ గురు రాజేష్, ఎన్‌సిబి అసిస్టెంట్ డైరెక్టర్ విష్ణు వర్ధన్, ఈగల్ టీమ్ డిఐజి అభిషేక్ మహంతి, సిఐఎస్ఎఫ్ డిఐజి మొహంకా, ఎఫ్ఆర్ఆర్ఓ అప్పలనాయుడు, ఇంటలిజెన్స్ ఎస్‌పి.భాస్కరన్, డిసిపి ఎస్‌బి కె.అపూర్వారావు, డిసిపి టాస్క్‌ఫోర్స్ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, డిఆర్ఐ అసిస్టెంట్ డైరెక్టర్ అనురాగ్ సింగ్, ఆబ్కారీ శాఖ జాయింట్ కమిషనర్ ఖురేషి పాల్గొన్నారు.

## క్యాన్సర్ చికిత్సలో.. తెలంగాణ గ్లోబల్ లీడర్‌గా నిలబడే ఛాన్స్

ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** ప్రపంచ వేదికపై తెలంగాణ పోటీ పడడానికి 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' ఉపయోగపడుతుందని ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పెట్టుబడులు తెలంగాణలోని ప్రజారోగ్యంలో మౌలిక సదుపాయలు కల్పించడానికి, ప్రతి పౌరుడికి ప్రపంచ స్థాయి వైద్యం అందేలా చేస్తాయని ఆయన తెలిపారు. క్యాన్సర్ చికిత్సలో తెలంగాణ గ్లోబల్ లీడర్‌గా నిలబడే అవకాశాలున్నాయన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావడం పట్ల ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని డాక్టర్ నోరి దత్తాత్రేయుడు అభినందించారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి ఆయన శుక్రవారం ఒక లేఖ రాశారు. వచ్చే ఏడాది జనవరి మూడో వారంలో తెలంగాణ రాష్ట్ర పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రిని కలుసుకోనున్నట్లు డాక్టర్ నోరి దత్తాత్రేయ తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ చారిత్రాత్మక విజయం సాధించిందని, లక్షలాది కోట్ల రూపాయల పెట్టుబడులు రావడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన, స్థిరత్వం, భవిష్యత్తుపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని ఆయన తన లేఖలో తెలిపారు. డీప్ టెక్, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్ వంటి రంగాల్లోకి పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడం తెలంగాణ రైజింగ్ విజన్ 2047 శక్తికి ఊతమిస్తుందన్నారు. తెలంగాణలో ఆరోగ్య సంరక్షణ, జీవన ప్రమాణాల పెంపు కోసం చేస్తున్న ప్రయత్నాలు హర్షనీయమన్నారు. ప్రపంచ దిగ్గజాలను హైదరాబాద్, ఫోర్త్ సిటీకి రప్పించి తెలంగాణను భారతదేశ స్టార్టప్‌గా, మానవ కేంద్రీకృత అభివృద్ధికి ప్రపంచ కేంద్రంగా మారుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుజువు చేశారన్నారు.


**GREATER HYDERABAD MUNICIPAL CORPORATION**
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**

**NIT No.** 50, **పని పేరు:** 1 పని కోసం జిహెచ్ఎంసి, రాజేంద్రనగర్ సర్కిల్-11లో కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయడం. **అంచనా విలువ / ఇసివి:** రూ.11.60లక్షలు, **డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ & సమయం:** 12.12.2025న మ.2:30గం.ల నుండి, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 17.12.2025న మ.2:45గం.ల వరకు. **ఇఇ/ఎస్ఇ పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ డివిజన్ నెం.11, జిహెచ్ఎంసి. సెల్ నెం.9989930608. ఇ-మెయిల్ ఐడి: eec11.ghmc2@gmail.com.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-XI, (ఆర్‌జెఎన్ఆర్), జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 11977-PP/CL/ADVT/1/2025-26, Date: 12-12-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
మల్కాజ్‌గిరి సర్కిల్-28

కొటేషన్ నోటీసు

**NIT No. Quotation Notice No.07/EE-28/SBZ/GHMC/2025-26**

**పని పేరు:** వివేకనందపురం థీమ్ పార్క్ మరియు శ్రీ కృషి ఎన్‌క్లేవ్ అభివృద్ధి. **పరిమాణం:** Each/Job, **బిడ్స్ దాఖలుకు ప్రారంభ తేదీ & సమయం / బిడ్స్ దాఖలుకు ఆఖరి తేదీ & సమయం:** 12.12.2025న ఉ.10:30గం.ల నుండి 15.12.2025న ఉ.10:30గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం.9154796465. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 11960-PP/CL/ADVT/1/2025-26 Date: 12-12-2025

దేవాదాయ ధర్మాదాయ శాఖ, తెలంగాణ ప్రభుత్వం
**శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానము**
బీచుపల్లి గ్రామము, ఎర్రవల్లి మండలం, జోగుళాంబ గద్వాల జిల్లా, తెలంగాణ

బహిరంగ వేలము & సీల్డ్ టెండర్ ప్రకటన

**లేఖ సంఖ్య : 32/E.O/S.A.S.D/BPLY/2025** **తేది: 10-12-2025**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మం.బీచుపల్లి గ్రామములో వేంచేసియున్న శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానము యొక్క క్రింద తెలిపిన విధముగా వివిధ టెండర్స్ తేది: 20-12-2025 శనివారము ఉ.11-30 గం.లకు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానము ఆవరణములో సీల్డ్ టెండర్ & బహిరంగ వేలములు ద్వారా నిర్వహించబడును. ఈ బహిరంగ వేలములలో పాల్గొనుటకు అసక్తి కలవారు ముందుగా వారు తేది: 20-12-2025 శనివారము రోజు మ.12-00 గంటలలోపు డిపాజిట్ డి.డి. రూపములో చెల్లించవలయును.

| క్ర.సం. | వేలము పాట వివరములు | కాలపరిమితి | డిపాజిట్ రూపాయలు |
|---|---|---|---|
| 1 | టెంకాయలు, వాహనపూజ సామాగ్రి కిరాణము అమ్ముకొనుటకు హక్కు | 01/01/2016 నుండి 31/12/2026 వరకు | రూ.6,00,000/- |
| 2 | కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు | 01/01/2026 నుండి 31/01/2026 వరకు | రూ.50,000/- |
| 3 | రక్షా కంకణముల అమ్ముకొనుటకు హక్కు | 01/01/2026 నుండి 31/12/2026 వరకు | రూ.2,00,000/- |

డి.డి.లు తీయవలసిన చిరునామ: Excutive Officer, Sri Anjaneya Swamy Devastanam, Beechupalli పేరుమీద డి.డి. తీయవలయును.

**గమనిక :** బహిరంగ వేలము & సీల్డ్ టెండర్‌లో పాల్గొనుటకు ఆసక్తి కలవారు వేలంపాటకు ముందుగా దేవస్థానం కార్యాలయము నందు తేది 19-12-2025 నుండి తేది 20-12-2025 ఉ.10-00 గంటల వరకు రూ.1,000/- చెల్లించి టెండర్ షెడ్యూల్ తీసుకొగలరు.

డి.కె. భరతసింహారెడ్డి, వ్యవస్థాపక వంశీయులు,
సి. రామన్ గౌడ్, కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 11989-PP/CL/ADVT/1/2025-26, Date: 12-12-2025

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వరంగల్‌లో మహిళా న్యాయవాది యామిని పై జరిగిన అమానుష దాడిని నిరసిస్తూ మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ అలుగుబెల్లి భూపతి రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించి బాధ్యులను వెంటనే శిక్షించాలన్నారు. ఈ సందర్భంగా నేతి సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయవృత్తి, ఆత్మగౌరవంపై చేసిన దాడిగా భావించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు లింగంపల్లి అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్, ప్రభాకర్, రెడ్డిపల్లి సైదులు, ఒలేటి రాము, కళ్యాణ్‌బాబు, భాస్కర్, భవాని, రమణ,పవన్‌కుమార్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## సాయిలు ఆశయాలను సాధిద్దాం



**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని సింగారం గ్రామ సిపిఐ సీనియర్ నాయకులు జీసుకుంట్ల సాయిలు ఆశయాలను సాధించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురజా రామచంద్రం అన్నారు.జీసుకుంట్ల సాయిలు ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆ గ్రామంలో ఆయన స్థూపానికి ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.సాయిలు పార్టీకి నిస్వార్ధంగా పనిచేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భోలుగూరి నరసింహ,సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, ఉప్పునూతల రమేష్, కుంభం లక్ష్మారెడ్డి,ఆయన కుటుంబ సభ్యులు గ్రామ శాఖ కార్యదర్శి జీసు కుంట్ల నరసింహ,జీసు కుంట్ల శేఖర్,పాలకూరి నరసింహ,పాలకూరి వెంకన్న తదితరులు ఉన్నారు.



## ఉపకార వేతనాల వ్యవస్థ బలోపేతం

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రభుత్వం అందించే స్కాలర్షిప్ పేద విద్యార్థుల విద్యకు భవిష్యత్‌లో భద్రత లాంటిదని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. అలాంటి స్కాలర్షిప్ లను అందించడంలో జాప్యం చేయకుండా వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. శుక్రవారం ఆమె కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ లపై సమీక్షా నిర్వహించారు. మండల విద్యాధికారులు (ఎంఈఓలు),ఎస్‌సి,బిసి,ఎస్‌టి వెల్ఫేర్ శాఖల అధికారులు, లీడ్ బ్యాంకు అధికారులు విద్యార్థులకు ప్రభుత్వం అందించే వివిధ స్కాలర్షిప్ పథకాల అమలు వేగవంతం చేయాలని చెప్పారు.ఉపకార వేతనాల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగలు, సామాజిఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఇవి అత్యంత కీలకమని అన్నారు.అందువల్ల స్కాలర్షిప్‌ల అప్లికేషన్ల పై సమీక్ష, ధృవీకరణ, ఫండ్ విడుదలలన్నీ నిర్దిష్ట గడువుల్లోనే పూర్తి చేయాలన్నారు.ఏ విద్యార్థి సాంకేతిక కారణాలతో, పత్రాల లోపాలతో ,లేదా డేటా ఎంట్రీ సమస్యలతో బెనిఫిట్ కోల్పోకుండా చూసుకోవడం ఈ సమావేశానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి,జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శశికళ, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్, తదితరులు పాల్గొన్నారు.

## దోపిడీకి వ్యతిరేకం కమ్యూనిజం

### సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సంపన్న వర్గాల దోపిడికి వ్యతిరేకంగా కమ్యూనిజం ఆవిర్భవించిందని దానితోనే దోపిడి అంతమవుతుందని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ సిపిఐ కార్యాలయంలో సిపిఐ సభ్యత్వ నమోదు, ఆవిర్భావ దినోత్సవ వేడుకల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారి వర్గశ్రమ దోపిడిని కమ్యూనిజం ఎప్పుడు వ్యతిరేకిస్తుందన్నారు. బిజెపి అనుసరిస్తున్న కార్పోరేట్ అనుకూల విధానం సామాన్య ప్రజలను దోచుకోవడమే అన్నారు. దేశంలో కమ్యూనిజం ఆవిర్భవించి శత వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 26న సిపిఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలో నిర్వహించ తలపెట్టిన సిపిఐ భారీ బహిరంగ సభ జనవరి 18న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరి, మామిడి వెంకయ్య, సోమగాని కృష్ణ, జడ వెంకన్న, జక్కుల రమేష్, ఉమా, చక్రాల స్టాలిన్ పాల్గొన్నారు.

## గాంధీ ప్రతిష్ఠాన్ స్వర్ణోత్సవాల గోడ పత్రిక



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ స్వర్ణోత్సవాలను పునస్కరించుకుని చేపట్టే మహాత్మా గాంధీ లక్ష విగ్రహాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గాంధీ జ్ఞాన్ ప్రతిష్టన్,గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర కార్యదర్శి యానాల ప్రభాకర్ రెడ్డి కోరారు. శుక్రవారం మండలకేంద్రం లో గాంధీజీ విగ్రహాల సేకరణ గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ స్వర్ణోత్సవాల సందర్భంగా మహాత్మా గాంధీ ఒక లక్ష విగ్రహాల ప్రదర్శన నిర్వహించే కార్యక్రమానికి ప్రతి నియోజకవర్గంలో గాంధీజీ విగ్రహాల సేకరణ చేపట్టాలని సూచించారు.ఈ స్వర్ణోత్సవాలలో భాగంగా నకిరేకల్ నియోజకవర్గంలో డిసెంబర్ 23న రైతు సదస్సు నిర్వహించి రాష్ట్ర అన్ని జిల్లాలలోని ఉత్తమ రైతులకు పుడమి పుత్ర అవార్డులు అందించడం, 156 బాలురచే బాల గాంధీల వేశాధారణ,1156 ఒక అడుగు ఎత్తు గాంధీజీ విగ్రహాల సామూహిక ప్రదర్శన,గ్రామ నిర్మాతల వృత్తులు , ఉత్పత్తుల ప్రదర్శన,ఎద్దు గానుగ ప్రదర్శన,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కార్యక్రమ కన్వీనర్ డా. పుచ్చకాయల వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం లో సభ్యులు మట్ట చెన్నయ్య, యంపల్ల భీష్మ రెడ్డి, జటావత్ జవహర్ లాల్, బొపంగి అశోక్,మంచికంటి సంతోష్ కుమార్,పల్లె శ్రీనివాస్ గౌడ్,శింర శెట్టి జాస్మిన్,ఎండీ సన,మైనంపాటి అరుణ పాల్గొన్నారు.

## ఉప ఎన్నికను తలపించిన మునుగోడు సర్పంచ్ ఎన్నికలు

### ఒక్క ఓటుకు రూ.5వేల రుపాయాలు




**ప్రజాపక్షం/మునుగోడు:** మునుగోడు నియోజకవర్గంలో గత మూడు సంవత్సరాల క్రితం మునుగోడుకు ప్రస్తుత ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజీనామాతో మునుగోడు ఉప ఎన్నిక నిర్వహించారు ఆ ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థులు గెలుపు కోసం ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు విందుతో పాటు ఓటుకు భారీగా నగదు పంపిణీ చేశారు. అదే తరహాలో నిన్న జరిగిన మునుగోడు మండల స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా గ్రామ సర్పంచిగా గెలిచేందుకు గ్రామాలలో ప్రత్యేక విందులను ఏర్పాటు చేశారు. దాంతోపాటు ఇంటింటికి మటన్ చికెన్ మద్యం పంచుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ఒక పండుగ వాతావరణం నెలకొన్నది ఒక్కొక్క గ్రామంలో సర్పంచిగా గెలిచేందుకు పంతంతో ఒక్క ఓటుకు రూ.2వేలు నుంచి రూ.5వేలుచొప్పున నగదు చెల్లించి ఓట్లు వేయించుకున్నారని వా ర్తలు వినిపిస్తున్నాయి. ఓ గ్రామంలో అధికార పార్టీకి చెందిన ముగ్గురు నా యకులు సర్పంచ్ గా బరిలో నిలిచి సర్పంచ్ పదవి దక్కించుకోవాలని పంతంతో ఒక్కొక్క ఓటుకు మూడు వేల చొప్పున ముగ్గురు అభ్యర్థులు సమానం గా నగదును పంపిణీ చేశారని గుసగుసలు వినపడుతున్నాయి. పదవి కోసం ఖర్చుకు భయపడకుండా ఎమ్మెల్యేకు అయ్యే ఖర్చు తో సమానంగా సర్పంచి పదవి కోసం సర్పంచ్ అభ్యర్థులు ఖర్చు పెట్టారని మండల ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఎన్నికలు ఇంత ఖర్చుతో కూడుకుంటే సామాన్య ప్రజలు ఎన్నికల్లో ఎట్లా పోటీ చేస్తారని సామాన్య వ్యక్తులు అనుకుంటున్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** నల్లగొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి తగిన ప్రాధాన్యతనిచ్చి అధిక నిధులు కేటాయిస్తానని రాష్ట్ర రోడ్లుభవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నల్లగొండ,తిప్పర్తి,కనగల్ మండలాలలోని పలు గ్రామాలలో నూతనంగా సర్పంచులుగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లను శుక్రవారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలోని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన నూతనంగా ఎన్నికైన సర్పంచులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పదవులు అనేవి ఎవరికి శాశ్వతం కావని తెలిపారు.వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లు గ్రామాలలో అందరినీ కలుపుకుపోతూ పార్టీలకతీతంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలన్నారు.ఎన్నికలప్పుడే పార్టీలని, ఆ తర్వాత అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల అభివృద్ధికి తాను తగిన నిధులు కేటాయిస్తానని అన్నారు. నూతనంగా ఎన్నికైన పెద్ద సూ రారం సర్పంచ్ గుండె జానమ్మ,ఉప సర్పంచ్ పెండెం అరుణ రామకృష్ణ, తిప్పర్తి మండలం ఎల్లమ్మ గూడెం సర్పంచ్ ఊట్కూరి వాణి సందీప్ రెడ్డి,నల్లగొండ మండలం చెన్నుగూడెం సర్పంచ్ మర్రి సతీష్ యాదవ్, బుద్ధారం సర్పంచ్ తుక్కాని వెంకట్ రెడ్డి,చందనపల్లి సర్పంచ్ పెద్ది లక్ష్మమ్మ గోవర్ధన్,నర్సింగ్ బట్ల సర్పంచ్ జకిర తాజుద్దీన్,వెలుగు పల్లి సర్పంచ్ పోతేపాక వినోద్, కాంచనపల్లి సర్పంచ్ ముప్పిడి మహేశ్వరి, తొర్రగల్ సర్పంచ్ చిర్రబోయిన యాద య్య, దొనకల్ సర్పంచ్ కొత్తపల్లి సునీత తదితర నూతన సర్పంచులు,వార్డు సభ్యులకు మంత్రి కోమటిరెడ్డి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

### విజయోత్సవ ర్యాలీలో మంత్రి

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** మండలంలోని ఎల్లారెడ్డి గూడెం గ్రామంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుతో విజయం సాధించిన అభ్యర్థి ఎల్లందుల లింగస్వామి(కిట్టు)విజయోత్సవ ర్యాలీలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రజల ఆశలు,ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామాభివృద్ధి దిశగా కృషి చేయడానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజలతో ఉన్నదని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.అభివృద్ధి,సంక్షేమ పాలన చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి పల్లెలో ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదం ఈ విజయం. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలతో కలసి పనిచేస్తుందని ఆయన తెలిపారు.



# ప్రజాస్వామ్యానికి ప్రజలే బలం

### ప్రజలకు ఓటే ఆయుధం : కలెక్టర్ వి.హనుమంతరావు




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పౌరుడికి ఓటు కీలకమని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు వజ్రాయుధం మీ ఓటు మీ భవిష్యత్తు నిర్ణయిస్తుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ వి.హనుమంతరావు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఓటరు అవగాహన, చైతన్య (స్వీప్) కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ గ్రామపంచాయతీ నుండి రాఘవేంద్ర ఫంక్షన్ హాల్ వరకు ఓటరు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రలోభాల పర్వం మొదలవుతుందని డబ్బు, మద్యం, బహుమతులు లేదా ఇతర ప్రలోభాల కోసం ఓటును అమ్ముకోవడం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే చర్య అని అన్నారు. ఓటు పవిత్రమైందని ఓటు అమ్ముకోకండి మీ ఓటు మీ పిల్లల భవిష్యత్తును నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. సర్వసాధారణ ఓటర్లు ప్రజాస్వామ్య బలానికి మూల స్తంభం అని గుర్తు చేశారు. జిల్లావ్యాప్తంగా ఓటరు వినియోగశాతం పెంచేందుకు అవగాహన ర్యాలీలు, యువజన సంఘాల, విద్యార్థులు, మహిళలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ర్యాలీలు చేపట్టడం జరిగిందని అన్నారు. స్వచ్ఛమైన ఓటుతో మంచి అభ్యర్థిని ఎన్నుకొని గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో జూనియర్ కళాశాల విద్యార్థినులు స్వచ్ఛందంగా ఓటు వేయండి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అనే నినాదం ఫ్లాకార్డ్స్ పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి నాగిరెడ్డి, సంస్థ నారాయణపురం మండల ప్రత్యేక అధికారి జయశ్రీ, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో ప్రమోద్ కుమార్, స్థానిక ఎస్సై జె.జగన్, ఎంపీఓ నరసింహారావు, ఏపీఎం శ్రీదేవి, ఏపీఎంలు గడ్డం వెంకటేష్, విష్ణు, మహిళా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వహించాలి



జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి నాయక్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** అధికారులు గ్రామ పంచాయితీ ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి నాయక్ సూచించారు. 2వ విడత గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పహార్‌తో కలిసి సాధారణ పరిశీలకులు రవి నాయక్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు శుక్రవారం ర్యాండమైజేషన్ జరిపించారు. రెండవ విడత ఎన్నికలు జరిగే పెన్‌పహాడ్, చివ్వెంల, మోతె, మునగాల, నడిగూడెం, కోదాడ, అనంతగిరి, చిలుకూరు మండలాల్లోని ఆయా గ్రామ పంచాయితీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపిఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణలోనికి తీసుకుని, సిబ్బందికి పోలింగ్ విధులను కేటాయించారు. జిల్లాలో రెండవ విడతలో మొత్తం 181 గ్రామ పంచాయితీల సర్పంచ్‌లకు, 1628 వార్డు సభ్యులకి ఎన్నికల నోటిఫికేషన్ విడదల అవ్వగా 23 సర్పంచ్‌లు, 166 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నిక అవ్వడంతో మిగిలిన 158 గ్రామ పంచాయితీల సర్పంచ్, 1462 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ సిబ్బంది కలుపుకుని ప్రిసైడింగ్ అదికారులు 1901 ఓపిఓలు 2429 పోలింగ్ కోసం ర్యాండమైజేషన్ జరిపారు.

## గ్రామాల అభివృద్ధి ఘనత కెసిఆర్‌దే


### మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

**ప్రజాపక్షం/చివ్వెంల/పెన్‌పహాడ్ :** గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత మాజీ సిఎం కేసీఆర్‌దేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రెండవ విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా చివ్వెంల మండలంలోని చందుపట్ల, పెన్‌పహాడ్ మండల పరిధిలోని భక్తళాపురం, చీదెళ్ళ గ్రామాల్లో ఆ పార్టీ బలపర్చిన సర్పంచ్, వార్డు అభ్యర్థుల గెలుపును ఆకాంక్షిస్తూ ప్రచారం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై ప్రజల్లో నమ్మకం పోయిందన్నారు. రేవంత్ పాలనలో అన్ని అమ్మకాలు, ఆరచకాలేనని చెప్పారు. రాష్ట్రంలో తిరిగి బిఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా తమ పాలనపై ఆశలు సన్నగిల్లాయన్నారు. కేసీఆర్ ఇచ్చిన పథకాలే సక్కగా ఇవ్వలేక ఎగవేస్తున్నారని మండిపడ్డారు. ఐదు విడతల రైతుబందులో చాలా మంది రైతులకు రెండు విడతలే డబ్బులు అందాయని ఆవేదన వ్యక్తం చేశారు. సన్న ధాన్యంకు క్వింటాకు బోనస్ రూ.500లు, నిరుపేద ఆడపిల్లల పెండ్లికి కళ్యాణలక్ష్మి ద్వారా తులం బంగారం, మహిళలకు రూ.2500 ఫించన్ ఇస్తామని నిలువునా కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ అంటేనే కమీషన్లు, కొట్లాటలని అన్నారు. గ్రామాలలో మళ్ళీ అభివృద్ధి జరగాలంటే బిఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ చిల్లర మూకలకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని ధైర్యంగా నిలబడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చివ్వెంల సహకార పరపతి సంఘం చైర్మన్ సుధీర్ రావు, పెన్‌పహాడ్ మాజీ ఎంపిపి నెమ్మాది బిక్షం, చివ్వెంల మాజీ జడ్పిటిసి భూక్య సంజీవ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన రెండవ విడత ప్రచారం

### మొదలైన ప్రలోభాల పర్వం



**ప్రజాపక్షం/సూర్యాపేట :** రెండవ విడత పంచాయితీ ఎన్నికల ప్రచారం శుక్రవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. నామినేషన్ల దాఖలు ముగిసిన నాటి నుండి ఆయా గ్రామాల్లో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు చేసే హడావుడి, లౌడ్ స్పీకర్లతో చేసే ప్రచారంతో హోరెత్తిపోయాయి. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు తమ గెలుపే లక్ష్యంగా ఓటర్లకు డబ్బు, మద్యం, మాంసంతోపాటు ఇతర నజరానాలు పంచడం మొదలుపెట్టారు. సూర్యాపేట జిల్లాలో రెండవ విడత ఎన్నికలు 8 మండలాల పరిధిలో ఈనెల 14న జరగనున్నాయి. ఇందులో సూర్యాపేట నియోజక వర్గ పరిధిలోని చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాలు ఉండగా, కోదాడ నియోజక వర్గంలోని కోదాడ రూరల్, అనంతగిరి, మోతె, మునగాల, నడిగూడెం, చిలుకూరు మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో మొత్తం 181 గ్రామ పంచాయితీలు, 1628 వార్డులు ఉండగా ఇందులో 23 గ్రామ పంచాయితీలకు సర్పంచ్‌లు, 166 వార్డులకు అభ్యర్థులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 158 సర్పంచ్, 1462 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులో సర్పంచ్ అభ్యర్థులుగా 493 మంది, వార్డుల బరిలో 3224 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరు తమ తమ గ్రామాల్లో హోరాహోరీగా ప్రచారాన్ని కొనసాగించారు. తమ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగారు. ఈ ఎన్నికల్లో ఆయా గ్రామాల్లో రాజకీయ పొత్తులు చిత్రవిచిత్రంగా పెట్టుకున్నారు. రాష్ట్రంలోని అధికార పార్టీ, ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ నేతలు ఇరువురు కలిసి అనేక గ్రామాల్లో ఎన్నికల పొత్తులు పెట్టుకోవడం గమనార్హం. ఎన్నికల ముందు వరకు పార్టీలుగా విడిపోయి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్న వారు కలిసిపోయి గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ పొత్తులు పెట్టుకోవడంతో ఓటర్లు సైతం ముక్కున వెలువేసుకుంటున్నారు. ఎన్నికల ప్రచారం ముగియడంతో అభ్యర్థులు ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేందుకు ప్రలోభాల పర్వాన్ని మొదలుపెట్టారు. ఓటర్ జాబితా ప్రకారం ఇంటింటికి వెళ్ళి ఓటర్లను కలుస్తూ మందు, మాంసం పంపిణీ చేయడంతోపాటు డబ్బులను ఇస్తున్నారు. మొదటి విడత ఎన్నికల్లో అభ్యర్థులు స్థానిక పరిస్థితులను అంచనా వేస్తూ ఆయా గ్రామాల్లో ఒక్క ఓటుకు రూ.2 వేల నుండి రూ.5వేల వరకు పంపిణీ చేశారు. ఇదే తరహాలో రెండో విడత ఎన్నికల్లో కూడా పంపిణీ చేసేందుకు అభ్యర్థులు కొందరు సిద్ధం కాగా మరికొందరు ఇప్పటికే పంపిణీ చేశారు. 65వ జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామాల్లో పోటీ చేసిన అభ్యర్థులు పోటాపోటీగా ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బును ఖర్చు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో అభ్యర్థులు ఎన్నికల్లో ఎంత డబ్బును ఖర్చు చేసినా గెలిచిన తరువాత తిరిగి రెట్టింపు సంపాదించుకునే అవకాశాలు ఉన్నాయి. ప్రధానంగా ఈ ప్రాంతాల్లో వేలాది ఎకరాల వ్యవసాయ భూములను రియాల్టర్లు కొనుగోలు చేసి వెంచర్లుగా మార్చి వ్యాపారాలను పెద్దఎత్తున సాగిస్తున్నారు. దీంతో గ్రామ పంచాయితీలకు ఆదాయం పెరగడంతోపాటు గెలుపొందిన అభ్యర్థులకు వ్యక్తిగతంగా కూడా లక్షల్లో ఆదాయం వచ్చే అవకాశం ఉండడంతో ఖర్చుకు వెనకాడడం లేదు.



## ప్రతీ ఒక్కరికీ ప్రజా పాలన ఫలాలు

### అభ్యర్థుల గెలుపునకు ఎమ్మెల్యే బీర్ల సుడిగాలి పర్యటన

**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని సీతారాంపురం, గురుజుబావి, కొమ్మాయిపల్లి, మరిపడిగ, మసాన్‌పల్లి, వెల్మజాల, రామారం, బ్రహ్మణపల్లి, సుద్దాల గ్రామాలలో శుక్రవారం స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యుల గెలుపు కొరుతూ జిల్లా నాయకులతో కలిసి ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య కు ప్రతి గ్రామంలో ప్రజలు బ్రహ్మ రథం పట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో రాష్ట్రం ముందుకు సాగుతున్న తరుణంలో గ్రామాలలో కూడా ప్రజాపాలన ఫలాలు ప్రతి ఒక్కరికి అందేవిధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న నేపథ్యం లో గ్రామాలలో కూడా కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను సర్పంచులుగా, వార్డు సభ్యులుగా ఎన్నుకోవడం ద్వారా గ్రామాలకు అధిక నిధులు చేకూరి గ్రామాలు సస్యశ్యామలంగా అభివృద్ధి చెందడంతో పాటు, గ్రామాలలో ఎటువంటి సమస్యలకు తావు లేకుండా చర్యలు తీసుకోవడమే కాకుండా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా అందే అవకావం ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు, వార్డుల అభ్యర్థులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ




**ప్రజాపక్షం/చింతలపాలెం :** ఎన్నికల సమయంలో ఏ పార్టీ, ఏ అభ్యర్థి అయినా చట్టాన్ని అతిక్రమించే చర్యలు చేస్తే పోలీసులు ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటారని జిల్లా ఎస్‌పి కె నరసింహ స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్‌పిహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు పోలీసుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. డబ్బు, మద్యం, బహుమతుల పంపిణీ చేస్తే వెంటనే కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. రాత్రి వేళల్లో అనవసరంగా గుంపులుగా తిరగడం, క్యాంపులు ఏర్పాటు చేయడం, ఓటర్లపై ఒత్తిడి చేయడం నేరమన్నారు. అలా చేసిన వారిపై బైండోవర్ చర్యలు, నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారం, ప్రతిష్ట దెబ్బతీసే పోస్టులు చేస్తే ఐటి యాక్ట్ ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వ్యక్తులను ముందుగానే గుర్తించి నిర్బంధ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, సిఐ ప్రతాప్ లింగం, చింతలపాలం తహశీల్దార్ సురేందర్ రెడ్డి, ఎంపిడిఓ రామచంద్రరావు, ఎంపిఓ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## అభ్యర్థులకు మద్దతుగా కాంగ్రెస్ ప్రచారం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండలంలోని కాల్వపల్లి, సుబ్బారెడ్డిగూడెం, ఆలగడప, రాయినిపాలెం, ముల్కలకాల్వ, అవంతీపురం, బాదలాపురం, గూడూరు, కిష్టాపురం, కొత్తగూడెం, రుద్రారం, బోట్యానాయక్‌తండా, చింతపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపుకై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని విస్తృత ప్రచారం చేశారు. గ్రామగ్రామాన కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు మంద సైదులు, చిమట పద్మమదార్, జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, బానావత్ నాగలక్ష్మి వంశీ, జంగిలి శివలీల లింగయ్య, గాదనబోయిన మట్టయ్య, బొడ్డు సైదులు, కడియం గురవయ్య, మురళిలను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు దైద సంజీవరెడ్డి, తలకొప్పుల సైదులు, శంకర్‌నాయక్, జంగ్లి లింగయ్య, బసవయ్యగౌడ్ పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## అన్నా హజారే మళ్లీ నిరాహారదీక్ష

### జనవరి 30 నుంచి చేస్తానని ప్రకటన

**న్యూఢిల్లీ :** ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే మరోసారి నిరాహార దీక్షకు సిద్ధమయ్యారు. మహారాష్ట్రలో లోకాయుక్త చట్టం అమల్లో జాప్యం జరుగుతున్నందుకు నిరసనగా వచ్చే ఏడాది జనవరి 30న తన స్వగ్రామం రాలేగావ్ సిద్ధిలో నిరాహార దీక్ష చేపట్టనున్నారు. లోకాయుక్త చట్టం అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నా హజారే మండిపడ్డారు. ప్రజా సంక్షేమానికి కీలకమైన ఈ చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. చట్టం అమలుకు గతంలో ఇచ్చిన హామీలను పక్కనపెట్టారని ఆరోపించారు. లోకాయుక్త చట్టాన్ని తీసుకురావాలంటూ హజారే 2022లో నిరాహార దీక్ష చేపట్టారు. అయితే, అప్పటి ముఖ్యమంత్రి జోక్యంతో ఆయన దీక్షను విరమించారు. అనంతరం మహారాష్ట్ర అసెంబ్లీ లోకాయుక్త బిల్లుకు ఆమోదం కూడా తెలిపింది.క్షేత్రస్థాయిలో మాత్రం చట్టం అమలు జరగట్లేదని హజారే అన్నారు. ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌కు 7 లేఖలు రాసినా స్పందన కరువైందని ఆక్షేపించారు. 'ఈ చట్టం ప్రజాసంక్షేమానికిఅవసరం. నేను ఈ విషయంపై ఏడు లేఖలు రాశాను. కానీ అవతలి వైపు నుంచి ఎటువంటి స్పందనా లేదు.

### కరూర్ తొక్కిసలాట ఘటనలో విచారణ కమిషన్ సస్పెన్షన్‌పై

# మా ఆదేశాలు సవరించం

### సుప్రీంకోర్టు స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** కరూర్ తొక్కిసలాటలో 41మంది మృతి చెందిన ఘటనపై దర్యాప్తు చేయడానికి ఏర్పాటు చేసిన ఏకసభ్య విచారణ కమిషన్‌ను, సిట్‌ను సస్పెండ్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 'ప్రతిదీ న్యాయంగా, నిష్పాక్షికంగా జరగాలని మేం కోరుకుంటున్నాం' అని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. మద్రాస్ హైకోర్టు రిజిస్ట్రార్ దాఖలు చేసిన నివేదికను న్యాయమూర్తులు జె.కె.మహేశ్వరి , విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విమర్శనాత్మకంగా పరిశీలించింది. హైకోర్టులో ఏదో తప్పు జరుగుతోంది. ఇలా హైకోర్టులో జరగడం సరైనది కాదు అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సెప్టెంబరు 27న నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ తమిళగ వెట్రి కజగం (టివికె) ర్యాలీ సందర్భంగా జరిగిన కరూర్ తొక్కిసలాటపై అక్టోబరు 13న సుప్రీంకోర్టు సిబిఐ దర్యాప్తునకు ఆదేశించింది. ఈ సంఘటన జాతీయ మనస్సాక్షిని కదిలించిందని, న్యాయమైన, నిష్పాక్షికమైన దర్యాప్తునకు అర్హమైనదని పేర్కొంది. స్వతంత్ర దర్యాప్తు కోసం టివికె దాఖలు చేసిన తన ఆదేశంలో సిబిఐ దర్యాప్తును పర్యవేక్షించడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అజయ్ రస్తోగి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల పర్యవేక్షక కమిటీని ఏర్పాటు చేసింది. సిట్, ఏకసభ్య విచారణ కమిషన్ నియామకానికి ఆదేశాలను నిలిపివేసింది. ఈ సంఘటనపై పిటిషన్లను స్వీకరించడం, సిట్ దర్యాప్తునకు ఆదేశించడం, టివికె మరియు దాని సభ్యులను కేసులో పార్టీగా చేయకుండా వారిపై వ్యాఖ్యలు చేయడం పట్ల మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. సెంథిల్ కుమార్‌ను కూడా ఇది విమర్శించింది. శుక్రవారం విచారణ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం తరపున విచారణకు హాజరైన సీనియర్ న్యాయవాది పి.విల్సన్ తన వాదనలు వినిపిస్తూ రాష్ట్ర కమిషన్ సిబిఐ దర్యాప్తులో జోక్యం చేసుకోదని, అలాంటి సంఘటనలను నివారించేందుకు సిఫార్సులు ఇవ్వడానికి మాత్రమే పరిమితం అవుతుందని వాదించారు. ప్రతిదీ న్యాయంగా, నిష్పాక్షికంగా ఉండాలని మేం కోరుకుంటున్నాం అని ధర్మాసనం విల్సన్‌కు తెలిపింది. కమిషన్ నియామక నోటిఫికేషన్ చదవాలని సూచించింది. విల్సన్, సిద్దార్థ్ లూథ్రా కూడా రాష్ట్రం తరపున అప్పీల్ చేసుకుని రిజిస్ట్రార్ జనరల్ నివేదిక కాపీని కోరుతూ సమాధానం దాఖలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. కరూర్ తొక్కిసలాట సమస్యపై కె.కె.రమేష్ దాఖలు చేసిన ఒక తాజా పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం నోటీస్ జారీ చేసి, పార్టీల వాదనలు పూర్తి చేయాలని కోరింది. తుది విచారణకు కేసును వాయిదా వేసింది. అక్టోబరు 30న కరూర్ తొక్కిసలాటలో మరణించిన కుటుంబాన్ని అధికారులు బెదిరిస్తున్నారనే ఆరోపణపై సిబిఐను సంప్రదించమని సుప్రీంకోర్టు కోరింది. అక్టోబరు 13న కోర్టు సిబిఐ దర్యాప్తునకు ఆదేశించిన విషయం తెలిసిందే. టివికె ర్యాలీకి 10,000మంది రావచ్చని అంచనా వేయగా, దాదాపు 27,000మంది హాజరవడంతో తొక్కిలాటకు దారితీసిందని అంతకు ముందు పోలీసులు చెప్పారు. ఏడుగంటల ఆలస్యంతో విజయ్ వేదిక వద్దకు చేరుకున్నారని ఈ ఆలస్యమే తొక్కిసలాటకు దారితీసి 41మంది మృతికి కారణమైందన్నారు.

### పార్లమెంటులో బాగా మాట్లాడారు..

# ప్రభుత్వ కథనాన్ని విచ్ఛిన్నం చేశారు

### కాంగ్రెస్ ఎంపిలకు రాహుల్‌గాంధీ కితాబు




**న్యూఢిల్లీ :** వందేమాతరం, ఎన్నికల సంస్కరణలపై పార్లమెంటు ఉభయ సభలలో జరిగిన చర్చలలో కాంగ్రెస్ పార్టీ ఎంపిల పని తీరును ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రశంసించారు. ప్రభుత్వ కథనాన్ని ప్రతిపక్షం విచ్ఛిన్నం చేసిందని పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుల సమావేశానికి ఆయన అధ్యక్షతన వహించారు. ప్రభుత్వం రెండు అంశాలపై ప్రతిపక్షాల నుండి ఒత్తిడిలో ఉన్నట్లుగా కనిపిస్తుందని ఈ సమావేశంలో రాహుల్‌గాంధీ అన్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. అనంతరం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వందేమాతరం, ఎస్ఐఆర్ పై ఉభయ సభల్లో గంభీరమైన చర్చ జరిగిందని, ఈ చర్చలలో తాము వారి కథనాన్ని విచ్ఛిన్నం చేసినట్లు భావిస్తున్నామన్నారు. ఎస్ఐఆర్ చర్చ సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కలవరపడ్డారని, పార్లమెంటులో నిందాపూర్వక పదాన్ని కూడా ఉపయోగించారని ఆయన పేర్కొన్నారు. హోంమంత్రి ఒత్తిడిలో ఉన్నాడని, మొత్తం యంత్రాంగం ఓటు చోరీలో ఉందని, అది దేశం మొత్తానికి తెలుసునని, అదే అందుకు కారణమని అని గాంధీ పేర్కొన్నారు.ఇండిగో విమానాల అంతరాయాలు, వాయు కాలుష్యం, కార్మిక కోడ్ల సమస్య వంటి ప్రజల ప్రస్తుత సమస్యలను లేవనెత్తడంలో పార్టీ విజయవంతమైందని ఎంపిల సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైనట్లు లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ అన్నారు. కాంగ్రెస్ చీఫ్ విప్ కె.సురేశ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రతి సమావేశంలోనూ ఎంపిల పనితీరును అంచనా వేయడానికి, వారి అభిప్రాయాలను, అభిప్రాయాలను వినడానికి సమావేశమవుతారని అన్నారు. కాగా ఎంపిల సమావేశంలో శుక్రవారం ఉదయం లాతూర్‌లో మరణించిన మాజీ కేంద్ర మంత్రి శివరాజ్ పాటిల్‌కు సంతాపసూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించి, నివాళులర్పించారు.

### మధ్య ప్రాచ్యం నుంచి గత మూడేళ్లలో

# 5,945 మంది భారతీయుల తరలింపు

### పార్లమెంట్‌కు మంత్రి జయశంకర్ వెల్లడి



**న్యూఢిల్లీ :** విదేశాల్లో ఉన్న భారతీయుల రక్షణ, భద్రతను దృష్టిలో పెట్టుకుని గత మూడు సంవత్సరాలలో మధ్యప్రాచ్యంలోనిఇజ్రాయెల్, ఇరాన్, సిరియా, ఇరాక్ నుండి 5,945 మందిని స్వదేశానికి తరలించినట్లు కేంద్రం ప్రభుత్వం శుక్రవారం పార్లమెంటుకు తెలియజేసింది. 2023 లో ఇజ్రాయెల్‌లో 'ఆపరేషన్ అజయ్', 2025లో ఇరాన్, ఇజ్రాయెల్‌లో 'ఆపరేషన్ సింధు' వంటి ఆపరేషన్‌ల ద్వారా భారతీయులను విదేశాల నుంచి తీసుకువచ్చినట్లు విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. '2024లో కువైట్‌లో జరిగిన విషాదకరమైన అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 45 మంది భారతీయుల మృతదేహాలను ప్రభుత్వం మానవతా దృక్పథంతో విమానంలో తరలించింది. ఇందులో ముగ్గురు ఉత్తరప్రదేశ్ పౌరులు కూడా ఉన్నారు' అని ఆయన తెలిపారు. మధ్యప్రాచ్య ప్రాంతంతో సహా ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న ఏవైనా ప్రతికూల పరిస్థితులను ప్రభుత్వం నిశితంగా పర్యవేక్షిస్తుందని కేంద్ర మంత్రి అన్నారు. ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా, అనవసరమైన ప్రయాణాలను నివారించాలని, స్థానిక అధికారులు జారీ చేసిన భద్రతా మార్గదర్శకాలను పాటించాలని, ప్రచురించిన హెల్ప్‌లైన్ నంబర్‌లు, ఇతర కమ్యూనికేషన్ విధానాలపై భారత మిషన్లతో సంప్రదింపులు జరపాలని ప్రభుత్వం సలహాలను జారీ చేస్తుందనారు. అవసరమైన చోట, చిక్కుకున్న భారతీయ పౌరులను సురక్షితంగా తరలించడానికి ప్రభుత్వం పూర్తి ప్రభుత్వ విధానంతో తరలింపు కార్యకలాపాలను ప్రారంభిస్తుందని జయశంకర్ తెలిపారు. ప్రభుత్వం సురక్షితమైన ఆశ్రయం, భోజనం, స్థానిక, సరిహద్దు కదలికలు, రవాణాతో సహా లాజిస్టికల్ ప్రత్యేక వాహనాలు, తరలింపు విమానాలను ఉచితంగా ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రస్తుతం, భారతీయ పౌరుల రక్షమ, భద్రతకు ఏదైనా ముప్పు లేదా మధ్యప్రాచ్య ప్రాంతం నుండి భారతీయ పౌరులను తరలించాల్సిన పరిస్థితి గురించి ఎటువంటి సమాచారం లేదన్నారు.

### ఈ ఏడాది అక్టోబరు నాటికి

# 5,897 భారతీయ మృతదేహాల తరలింపు

**న్యూఢిల్లీ :** విదేశాల్లో పనిచేస్తున్న లేదా నివసిస్తున్న భారతీయ పౌరుల మరణాలకు సంబంధించిన మొత్తం కేసుల సంఖ్య ఇటీవలి కాలంలో తగ్గిందని కేంద్రం ప్రభుత్వం శుక్రవారం పార్లమెంటుకు తెలియజేసింది. ఈ సంవత్సరం అక్టోబర్ నాటికి విదేశాల్లో మృతి చెందిన 5,897 భారతీయుల మృతదేహాలను స్వదేశానికి తరలించినట్లు పేర్కొంది. మృతదేహాలను స్వదేశానికి తరలించడానికి పట్టే సమయంపై ప్రభుత్వం డేటాను నిర్వహిస్తుందా అని లోక్‌సభలో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌ను సభ్యులు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో జయశంకర్ లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ మరణాలు, స్థానిక దహన సంస్కారాలు/ఖననం, భారతదేశంలోని వారి స్వస్థలాలకు మృతదేహాలను తరలించడం వంటి విదేశాలలో ఉన్న భారతీయ పౌరులను ప్రభావితం చేసే సమస్యలను పరిష్కరించడానికి, పరిష్కరించడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. విదేశాల్లో పనిచేస్తున్న లేదా నివసిస్తున్న భారతీయ పౌరుల మరణాలకు సంబంధించిన మొత్తం కేసుల సంఖ్య ఇటీవలి కాలంలో పెద్దగా పెరగలేదన్నారు. 2016 నుండి స్వదేశానికి తరలించిన భారతీయ పౌరుల మృతదేహాల జాబితాను కూడా ఆయన పంచుకున్నారు. ఈ గణాంకాల ప్రకారం ఈ సంవత్సరం అక్టోబర్ వరకు స్వదేశానికి 5,897 మంది భారత పౌరుల మృతదేహాలను తీసుకువచ్చారు. ఇతర సంవత్సరాల గణాంకాలనుకూడాపరిశీలిస్తే...4,167;4,222; 4,205; 5,291; 5,321; 5,834; 5,946; 6,532, 7,096గా ఉన్నాయి. మరణానికి కారణం, మృతదేహాలను ఎక్కడి నుండి తీసుకురవాలనేది, భారతదేశం నుండి వారి ఉంటున్న దేశం దూరం, ఆతిథ్య దేశానికి చెందిన దేశీయ చట్టాలు, మరణించిన వ్యక్తి ఉద్యోగ స్థితి, దేశంలో బంధువుల ఉనికి వంటి అనేక అంశాల ఆధారంగా మృతదేహాలను స్వదేశానికి తరలించడానికి పట్టే సమయం మారుతుందని అన్నారు.

# విమాన టికెట్ల ధరలను ఏడాది పొడవునా నియంత్రించలేం

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**న్యూఢిల్లీ :** ఇటీవల ఇండిగో సంక్షోభం సమయంలోవిమాన చార్జీలు విపరీతంగా పెరిగాయి. దాంతోకేంద్రంప్రభుత్వం రంగంలోకి దిగి టికెట్ల ధరలపైపరిమితిని విధించింది. తాజాగా విమాన చార్జీల నియంత్రణపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. విమాన టికెట్ల ఛార్జీలను ఏడాది పొడవునానియంత్రించలేమని పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు పార్లమెంట్‌లో స్పష్టం చేశారు. పండుగల సమయంలో టికెట్ల ధరల పెరుగుతాయని.. ఛార్జీలపై దేశవ్యాప్తంగా పరిమితి విధించడం ఆచరణాత్మకం కాదని తెలిపారు. నియంత్రణ లేని మార్కెట్ కారణంగా వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని వ్యాఖ్యానించారు. రంగం అభివృద్ధి చెందడానికి నియంత్రణ సడలింపులు జరిగాయన్న ఆయన..అసాధారణవృద్ధినిచూసినఇతర దేశాలునియంత్రణఎత్తివేసిందన్నారు.దాంతో మరిన్ని కంపెనీలు ఈ రంగంలోకి ప్రవేశించేలా ప్రోత్సహిస్తుందని చెప్పారు. మార్కెట్ డైనమిక్స్ ఆధారంగా ధరలుంటాయని.. అంతిమంగా ప్రయాణిలు అతిపెద్ద లబ్ధిదారులుగా నిలుస్తారన్నారు. విమాన ఛార్జీలపై నియంత్రణ ఎత్తివేయాలని కోరుతూ ఓ సభ్యుడు ప్రైవేట్ మెంబర్ బిల్లుపై స్పందించారు. నియంత్రణ సడలింపు ఆలోచన ఇప్పటికీ కొనసాగుతోందని.. మనం పౌర విమానయాన రంగాన్ని అభివృద్ధి చేయాలనుకుంటే, ముఖ్యమైన అవసరం ఏమిటంటే.. మరిన్ని కంపెనీలు మార్కెట్లోకి ప్రవేశించగలిగేలా దానిపై నియంత్రణలు తొలగించడమేనన్నారు. మార్కెట్ నియంత్రణ సడలింపు ఉన్నప్పటికీ.. ప్రస్తుత రూపంలో ఉన్న విమాన చట్టం దుర్వినియోగం జరిగే అవకాశం ఉన్న అసాధారణ పరిస్థితులలో జోక్యం చేసుకుని పరిస్థితిని సరిదిద్దే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి ఇస్తుందని.. ఇందులో ప్రయాణీకుల నుంచి అసమంజసమైన ఛార్జీలను నివారించడానికి చార్జీలపై పరిమితిని నిర్ణయించడం సైతం ఉందని కేంద్ర మంత్రి తెలిపారు.

# భారత పౌరసత్వం వదులుకున్న 9 లక్షల మంది

### కేంద్రమంత్రి కీర్తివర్ధన్ సింగ్ వెల్లడి

**న్యూఢిల్లీ:**గత ఐదేళ్లలో దాదాపు 9 లక్షల మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకున్నారని విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ శుక్రవారం పార్లమెంటులో చెప్పారు. భారత పౌరసత్వంపై సభ్యులు అడిగిన ఓ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో ఆయన ఈ డేటా వెల్లడించారు. భారత పౌరసత్వాన్ని వదులుకొనే వ్యక్తుల వార్షిక రికార్డులను ప్రభుత్వం భద్రపరుస్తోందని తెలిపారు. ఆ రికార్డుల ప్రకారం 2011–2019 మధ్య 11,89,194 మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకున్నారు. గత 14 ఏళ్లలో భారత్‌లోని 20 లక్షలకు పైగా ప్రజలు తమ పౌరసత్వం వదులుకొన్నట్లు డేటా సూచిస్తోంది. విదేశీ పౌరసత్వాన్ని ఎంచుకునే భారతీయుల సంఖ్యలో పెరుగుదల కనిపిస్తున్నట్లు విదేశాంగ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవల కాలంలో విదేశీ పౌరసత్వం పొందుతున్న భారతీయుల సంఖ్య మరింత పెరిగిందని, గత ఐదేళ్లలో దాదాపు 9 లక్షల మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకొన్నారని కేంద్రమంత్రి కీర్తివర్ధన్ సింగ్ పేర్కొన్నారు. అలాగే, విదేశాలలో ఉద్యోగాలు చేయాలని కలలు కంటున్న భారత యువతీ యువకులు మోసపూరిత ఉద్యోగ ఆఫర్ల బారిన పడుతున్నారని, గల్ఫ్ దేశాలలో ఉద్యోగాల కోసం భారత యువత నకిలీ గల్ఫ్ ఉద్యోగ ఆఫర్లకు ఆకర్షితులై అక్రమ రవాణా నెట్‌వర్క్‌ల బారిన పడుతున్నారని కేంద్ర మంత్రి కీర్తివర్ధన్ సింగ్ తెలిపారు. ఇటీవల ఇటువంటి కేసులు తమ దృష్టికి వచ్చాయన్నారు. వీటిలో చాలావరకు సోషల్ మీడియాలో ఉద్యోగ ఆఫర్లను నమ్మడంతోనే మొదలవుతున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఇటువంటివి నివారించడానికి సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ప్రకటనల ద్వారా విదేశాంగ శాఖ యువతకు అవగాహన కల్పిస్తోందన్నారు. నమోదు కాని ఏజెంట్లపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులోభాగంగా అక్టోబర్ 2025 నాటికి 3,505 నమోదుకాని ఏజెంట్ల వివరాలను ఇమ్మిగ్రేట్ పోర్టల్‌లో పొందుపరిచామన్నారు.

### దగ్గు సిరప్ అక్రమ రవాణా కేసులో...

# యుపిలో ఇడి సోదాలు

**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో అక్రమంగా దగ్గు సిరప్ రవాణా జరుగుతోందన్న ఆరోపణలపై మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) శుక్రవారం అనేక రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించింది. ఉదయం 7:30 గంటలకు ప్రారంభమైన ఈ సోదాలు ఉత్తరప్రదేశ్‌లోని లక్నో, వారణాసి, జౌన్‌పూర్, సహరాన్‌పూర్‌లోని 25 ప్రాంగణాలతో పాటు రాంచీ (జార్ఖండ్, అహ్మదాబాద్ (గుజరాత్)లలో జరుగుతున్నాయి. కోడైన్ ఆధారిత దగ్గు సిరప్‌ల (సిబిసిఎస్) అక్రమ తయారీ, వ్యాపారం, రవాణాపై దర్యాప్తు చేయడానికి ఇడి మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద క్రిమినల్ కేసు నమోదు చేసింది. వీటిలో బంగ్లాదేశ్‌లోకి అనుమానిత సరిహద్దు అక్రమ రవాణా కూడా ఉంది. ఈ కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు శుభం జైస్వాల్, అతని సహచరులు అలోక్ సింగ్, అమిత్ సింగ్‌లతో పాటు కొంతమంది దగ్గు సిరప్ తయారీదారులు, చార్టర్డ్ అకౌంటెంట్ విష్ణు అగర్వాల్‌లకు సంబంధించిన ప్రదేశాల్లో సోదా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సిబిసిఎస్ విస్తృత దుర్వినియోగం, అక్రమ రవాణాను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన తర్వాత ఉత్తరప్రదేశ్ పోలీసులు నమోదు చేసిన దాదాపు 30 ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఏజెన్సీ ఈ చర్య తీసుకుంది. ఇడి అధికారుల ప్రకారం.. ఈ కేసులో నేరం ద్వారా వచ్చిన ఆదాయం సుమారు రూ. 1,000 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. కాగా, శుభమ్ జైస్వాల్ దుబాయ్‌కు పారిపోయినట్లు భావిస్తున్నారు. అతని తండ్రిని ఉత్తరప్రదేశ్ పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం 32 మందిని అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తు చేయడానికి పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు.


# త్వరలో సిఎంగా డికె శివకుమార్

### కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్

**బెళగావి:** కర్నాటకలో 'విందు' రాజకీయం జోరుగా సాగుతోంది. ఈ మధ్యనే సీఎం, డిప్యూటీ సీఎం ఉదయం అల్పాహారం కోసం కలుకొని తమ మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, ఒక్కటిగా ముందుకెళతామని సందేశమిచ్చారు. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఎమ్మెల్యేలు అందరికీ రాత్రి విందు ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇదే క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ త్వరలో బాధ్యతలు తీసుకుంటారన్న ప్రచారం జోరందుకున్నది. ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా ఇదే విషయం చెప్పడంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరినట్లు అయింది. శివకుమార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ శాసనసభ శీతాకాల సమావేశాల తర్వాత డీకే శివకుమార్ సీఎం అవుతారని ప్రకటించారు. 'విందుపై విలేకరుల ప్రశ్నలకు సమాధానమిస్తూ ఎమ్మెల్యేలంతా ఒక చోటు కలుకోవడమన్నది అరుదు, అంతా కలిసి భోజనం చేశా. విందులో పాల్గొన్నంత మాత్రానా బల ప్రదర్శన అయిపోదుగా!' అని ఇక్బాల్ అన్నారు. శివకుమార్ సన్నిహితులు మాత్రమే పాల్గొన్నారా అన్న ప్రశ్నకు అందరం మిత్రులమే అని ఆయన సమాధానమిచ్చారు. శివకుమార్ శుభవార్త ఏమైనా చెప్పారా అని అడిగితే 'నేను మీకు శుభవార్త చెబుతాను. డీకే శివకుమార్ ఈ అసెంబ్లీ సమావేశాల తర్వాత సీఎం అవుతారు' అని ఇబ్బాల్ అన్నారు. శివకుమార్‌ను అవకాశం వరిస్తుందని దీమాగా చెప్పారు. అదృష్టముంటేనే సీఎం అవుతారన్నారుగా అని ఓ విలేకరి ప్రశ్నించగా 'దైవాజ్ఞ లేకుండా ఏ పని జరగదు. శివకుమార్ శ్రమకు తగ్గ ఫలితం దక్కుతుందన్న నమ్మకం ఉంది. ఆయన పడిన కష్టాన్ని గుర్తించి తగు విధంగా నిర్ణయం తీసుకోవాలని అధిష్ఠానానికి చెప్పాం' అని అన్నారు. శివకుమార్ విందుకు సమారు 5055 మంది హాజరయ్యారని ఇక్బాల్ తెలిపారు.

### ఎమ్మెల్యేలతో 'రాజకీయ విందు సమావేశం'

# వార్తలు అసత్యం : డికె శివకుమార్



**బెళగావి (కర్ణాటక) :** కర్ణాటక కాంగ్రెస్ పార్టీలో రాజకీయాలు రోజురోజుకూ వేడెక్కుతున్నాయి. శాసనసభ్యులతో రాజకీయ విందు సమావేశం జరిగిందనే వార్తలను శుక్రవారం కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ కొట్టిపారేశారు. తన పర్యటన పూర్తిగా వ్యక్తిగతమైనదని, పార్టీ సహచరుల ప్రేమతోనే ముందుకు సాగిందని ఆయన నొక్కిచెప్పారు. ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు సహా దీర్ఘకాల సహచరుల నుండి తనకు తరచుగా అనధికార భోజన ఆహ్వానాలు అందుతాయని, రాజకీయ పార్టీ ఉద్దేశంతో చూడకుండా మర్యాదపూర్వకంగా స్వీకరిస్తూ వాటికి హాజరవుతుంటానని స్పష్టం చేశారు. 'ఈ ప్రాంతం నుండి స్నేహితులు నన్ను ఆప్యాయంగా భోజనానికి లేదా విందుకు ఆహ్వానిస్తుంటారు. నేను వాటిని ఎలా నిరాకరించగలను ?. ఇది విందు సమావేశం కాదుకానీ నేను ఆహ్వానించబడిన వారితో వెళ్లాలి'. బెళగావి శివార్లలో శాసనసభ్యులతో విందు గురించి ప్రత్యేకంగా అడిగినప్పుడు శివకుమార్ ఆ ప్రశ్నకు సమాధానమిస్తూ మా నియోజకవర్గం నుంచి ఇక్కడ పనిచేస్తున్న ఒక అబ్బాయి మాట్లాడుతూ 'మధ్యాహ్న భోజనం కోసం 'తాను ముద్దే, ఉప్సారు' పంపుతానని చెప్పారు. కానీ నేను దానిని తిరస్కరించాను. ఒక రోజు అనంతరం ఆసిఫ్ సైత్, ఫిరోజ్ సైత్ నన్ను ఆహ్వానించారు.' పార్టీలోని దీర్ఘకాలిక నాయకులు,స్నేహితులకు కూడా విస్తృత ఆహ్వానాలు అందాయన్నారు. 'దొడ్డన్నవర్ బెళగావి జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మాత్రమే కాదు నాకు స్నేహితుడు కూడా. ఆయన చాలా కాలంగా నన్ను అతడి ఇంటికి డిన్నర్‌కు ఆహ్వానిస్తున్నాడు. అలాంటప్పుడు నేను నా కాంగ్రెస్ కుటుంబాన్ని మర్చిపోవాలా? అందుకే నేను, కొంతమంది అక్కడికి డిన్నర్‌కు వెళ్లాం. అది డిన్నర్ సమావేశం కాదు' అని శివకుమార్ చెప్పారు. బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లకు అనుమతిచ్చే అంశంపై ఉప ముఖ్యమంత్రి శివకుమార్ మాట్లాడుతూ బెంగళూరు నగర ప్రతిష్ఠను కాపాడటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. భద్రతా ఏర్పాట్లను నిర్ధారించడంలో హోం మంత్రి జి.పరమేశ్వర చాలా జాగ్రత్తగా ఉన్నారని ఆయన చెప్పారు. 'తగినంతగా చూసుకునేలా బాధ్యత హోంమంత్రికి ఇవ్వబడింది.మ్యాచ్‌ల సమయంలో ముందు జాగ్రత్త చర్యలు కె.ఎస్.సి.ఎ అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్, అతడి బృందం పోలీస్ విభాగంతో చర్చించారు' అని శివకుమార్ చెప్పారు.


**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on X @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

నెం. CEE/P/SC-2x25kV-OHE-KMT-DKJ- BDCR-2025-26-01 తేదీ: 11.12.2025 PUB/1587

భారత యూనియన్ రాష్ట్రపతి తరపున, సికింద్రాబాద్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ప్రాజెక్టులు) కింది పనుల కోసం (ఆన్‌లైన్) ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నారు:

**టెండర్ నెం.:-** 2x25kV-OHE-KMT-DKJ-BDCR, తేది. 10/12/2025. **పని వివరణ:** 'దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్ డివిజన్‌లోని ఖమ్మం (KMT) (మినహాయించి) - డోర్నకల్ (DKJ) (మినహాయించి) - భద్రాచలం రోడ్ (BDCR) (కలిపి) సెక్షన్‌లో ఫీడర్ మరియు ఎర్తింగ్ పనులతో సహా, ఇప్పటికే ఉన్న 1x25kV సిస్టమ్‌ను 2x25kV AT ఫీడింగ్ సిస్టమ్‌గా OHE అప్‌గ్రేడ్ చేయడానికి డిజైన్, సరఫరా, నిర్మాణం, పరీక్ష మరియు ప్రారంభోత్సవ పనులు. మొత్తం 78 RKM/101 TKM'. **సుమారు విలువ: (రూ.)** 503751882.87. ముందస్తు **ఆన్‌లైన్‌లో చెల్లించవలసిన ధరావత్తు సొమ్ము: (రూ.)** 2668800.00. **టెండర్ ఫారం ధర: (రూ.)** ఏమీ లేదు. **పనుల పూర్తి కాలం:** 15 నెలలు. **టెండర్ తెరిచే ప్రదేశం:** సికింద్రాబాద్.

1. ఇ-టెండర్ (ఆన్‌లైన్) ద్వారా టెండర్ ముగింపు: సమయం: 15.00 గంటలు, తేదీ: 28/01/2026
2. ఇ-టెండర్ (ఆన్‌లైన్) ద్వారా టెండర్ ప్రారంభం: సమయం: 15.30 గంటలు, తేదీ: 28/01/2026

టెండర్ తెరిచే తేదీ తర్వాత ప్రకటించిన సెలవుదినం అయినట్లయితే, టెండర్లు తదుపరి పనిదినం నాడు నిర్ణీత సమయంలో తెరవబడతాయి.
టెండర్ షరతులు/ వివరాలు మరియు టెండర్లను సమర్పించడానికి, దయచేసి మా వెబ్‌సైట్ www.ireps.gov.in ను సందర్శించండి.
**గమనిక:** టెండర్ పత్రాలకు ఏవైనా మార్పులు/ సవరణలు/ అదనపు చేర్పులు అవసరమైతే, అవి పై వెబ్‌సైట్‌లో పోస్ట్ చేయబడతాయి.
**చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ప్రాజెక్టులు), సికింద్రాబాద్**

**ఇ-టెండర్ ఆహ్వాన ప్రకటన (https://ireps.gov.in ద్వారా)** PUB/1588

CE/C/Plg&Sy/SC, CE/C-VI/SC & CE/C-II/SC నిర్మాణ సంస్థ, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్, వరుసగా, భారత రాష్ట్రపతి తరపున ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నాయి:

**NIT No :** 32-CAO-C-SC-2025 తేదీ: 05/12/2025 **పని పేరు:** SCR నిర్మాణ సంస్థ: తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ డివిజన్‌లోని నిజామాబాద్ స్టేషన్‌లో ఆర్‌బిజి భవనం, గూమ్టీ భవనం, అధికారులు మరియు సూపర్‌వైజర్ల విశ్రాంతి గృహం మరియు సిబ్బంది క్వార్టర్లు మొదలైన వాటి ప్రతిపాదిత నిర్మాణం. **అంచనా వ్యయం: (రూ.)** 22,00,28,684.20 **ఇఎండి: (రూ.)** 12,50,200.00 **పూర్తి చేయు కాలం:** 18 (పద్దెనిమిది) నెలలు. **టెండర్లు తెరిచే తేదీ:** 30/12/2025 15:00 గంటలకు

2. **NIT No:** EPC 12-CAO-C-SC-2025 తేదీ: 08/12/2025 **పని పేరు:** SCR నిర్మాణ సంస్థ: తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్-ధోన్ సెక్షన్ డబ్లింగ్ పనులకు సంబంధించి గద్వాల్ స్టేషన్ నుండి ఆలంపూర్ రోడ్ స్టేషన్ మధ్య ట్రాక్ డబ్లింగ్, విద్యుదీకరణ మరియు సిగ్నలింగ్ పనులతో సహా ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ మరియు నిర్మాణం (EPC) కాంట్రాక్ట్. **అంచనా వ్యయం: (రూ.)** 562,70,49,413.00 **ఇఎండి: (రూ.)** 2,00,00,000.00 **పూర్తి చేయు కాలం:** 30 (ముప్పై) నెలలు. **టెండర్లు తెరిచే తేదీ:** 06/03/2026 15:00 గంటలకు

3. **NIT No:** EPC10-CAO-C-SC-2025 తేదీ: 06/12/2025 **పని పేరు:** తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో మోటుమర్రి-విష్ణుపురం డబ్లింగ్ పనులకు సంబంధించి, విద్యుదీకరణ మరియు సిగ్నలింగ్ పనులతో సహా, సంత్ సేవాలాల్ మహారాజ్ నుండి విష్ణుపురం స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్ డబ్లింగ్ కోసం దక్షిణ మధ్య రైల్వే (నిర్మాణ సంస్థ) - ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ మరియు కన్‌స్ట్రక్షన్ (EPC) కాంట్రాక్ట్. **అంచనా వ్యయం: (రూ.)** 439,45,79,122.92 **ఇఎండి: (రూ.)** 2,00,00,000.00 **పూర్తి చేయు కాలం:** 24 (ఇరవై నాలుగు) నెలలు. **టెండర్లు తెరిచే తేదీ:** 05/03/2026 15:00 గంటలు

i) బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కోసం, దయచేసి https://ireps.gov.in వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వండి.
ii) టెండరర్లు టెండర్ సమర్పణ కాలంలో తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు, ఇది టెండర్ ముగింపు తేదీకి పదిహేను రోజుల ముందు ప్రారంభమవుతుంది.
iii) టెండరర్లు టెండర్ సమర్పణ కాలం ప్రారంభమయ్యే తేదీ వరకు జారీ చేయబడే ఏవైనా సవరణల కోసం (కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి) గమనిస్తూ ఉండాలి.
**చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్/నిర్మాణం/ సికింద్రాబాద్**

**టెండర్ నెం. 31-PA -25-26-Sr.DEE-M-HYB, 32-GSU-25-26-Sr.DEE-M-HYB** PUB/1589

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి ఆదేశాల మేరకు Sr.DEE/M/HYB, ఈ క్రింది టెండర్లకు వ్యతిరేకంగా ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు. టెండర్లు ముగింపు తేదీ: 06-01-2026, 15:00 గంటలు. బిడ్డర్లు తమ అసలైన/ సవరించిన బిడ్లను ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. ఇ-టెండర్‌కు వ్యతిరేకంగా మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు, మరియు అటువంటి ఏ మాన్యువల్ ఆఫర్ స్వీకరించబడినా అది పరిగణించబడదు.

**1. పని వివరణ: టెండర్ నెం. 31-PA-25-26 -Sr.DEE-M-HYB:** హైదరాబాద్ డివిజన్: - 1) BSX- గోదావరి పుష్కరాలు 2027 సందర్భంగా కొత్త హోల్డింగ్ ఏరియా అభివృద్ధిలో భాగంగా PF నెం 4, షెల్టర్ (COP), రిటైనింగ్ వాల్ ఏర్పాటు మరియు ఇప్పటికే ఉన్న FOBని PF 4 వరకు పొడిగించడం - విద్యుత్ ఏర్పాట్లు. 2) SC-MUE సెక్షన్: a) NZB వద్ద PF1పై 25 మీటర్ల పొడవున మరియు PF2/3పై 160 మీటర్ల పొడవున, b) KMC వద్ద PF1పై 300 మీటర్ల పొడవున మరియు PF2/3పై 200 మీటర్ల పొడవున, c) BSX వద్ద PF1పై 210 మీటర్ల పొడవున మరియు PF2పై 160 మీటర్ల పొడవున COP ఏర్పాటు - విద్యుత్ ఏర్పాట్లు. 3) HYB డివిజన్‌లోని 16 హాల్ట్ స్టేషన్లలో (HG - 2/3) దివ్యాంగుల సౌకర్యాల ఏర్పాటు మరియు 12 SG-3 స్టేషన్లలోని మరుగుదొడ్ల ఉన్నతీకరణ - విద్యుత్ ఏర్పాట్లు. **సుమారు వ్యయం: (రూ.)** 3,84,29,392/- **EMD: (రూ.)** 3,42,200/- **పూర్తి చేయు కాలం:** 12 నెలలు **ముగింపు తేదీ:** 06-01-2026

**2. పని వివరణ: టెండర్ నెం. 32-GSU-25-26-Sr.DEE-M-HYB :** హైదరాబాద్ డివిజన్: 1) SC-MUE సెక్షన్: సీతాఫల్‌మండి B-మల్కాజ్‌గిరి-క్యావల్రీ బ్యారక్స్- బోలారం ఆటో సెక్షన్లలో ట్రాక్ సర్క్యూట్‌ను మల్టీ సెక్షన్ డిజిటల్ యాక్సిల్ కౌంటర్‌తో భర్తీ చేయడం - విద్యుత్ ఏర్పాట్లు. 2) VDI, GWD, KQQ, WPR, MQN & BDHN స్టేషన్లలోని మొత్తం స్టేషన్లో లూప్ లైన్లలోని అనలాగ్ యాక్సిల్ కౌంటర్లు MSDACతో భర్తీ చేయడం - విద్యుత్ ఏర్పాట్లు. 3) సీతాఫల్‌మండి A-కాచిగూడ - ఫలక్‌నుమా ఆటో సెక్షన్లలో ట్రాక్ సర్క్యూట్‌ను MSDAతో భర్తీ చేయడం - విద్యుత్ ఏర్పాట్లు. 4) 16 ఇంజనీరింగ్ ఇంటర్‌లాక్ LC గేట్ల వద్ద మెకానికల్ ఆపరేటెడ్ లిఫ్టింగ్ బ్యారియర్లు ఎలక్ట్రికల్ ఆపరేటెడ్ లిఫ్టింగ్ బ్యారియర్‌తో భర్తీ చేయడం - విద్యుత్ ఏర్పాట్లు. 5) వాడియారం మరియు మాసాయిపేట స్టేషన్ల మధ్య KM. 0/04-06 వద్ద చేగుంట-మెదక్ రోడ్డుపై రెండు లేన్ల (ట్రాఫిక్ కోసం LC నెం:228 T స్థానంలో KM 555/03-04 వద్ద బ్రిడ్జ్ నెం: 636A (ROB) నిర్మాణ ప్రతిపాదన - విద్యుత్ ఏర్పాట్లు. 6) JKM-BDHN: JKM-BDHN స్టేషన్ల మధ్య RUB ఏర్పాటు చేయడం ద్వారా KM 17/900 - 18/0 వద్ద ఉన్న మ్యాన్ లెవల్ క్రాసింగ్ గేట్ నెం 17/JBని తొలగించడం - విద్యుత్ ఏర్పాట్లు. **సుమారు వ్యయం: (రూ.)** 1,07,93,923/- **EMD: (రూ.)** 2,04,000/- **పూర్తి చేయు కాలం:** 12 నెలలు **ముగింపు తేదీ:** 06-01-2026

**వెబ్‌సైట్ వివరాలు:** www.ireps.gov.in
టెండర్ పూర్తి వివరాలు చూడగలిగే నోటీస్ బోర్డు స్థానం: సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/M/HYB కార్యాలయం, హైదరాబాద్ భవన్, సికింద్రాబాద్- 500071
**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/M/ హైదరాబాద్**
A2016

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

ప్రజాపక్షం
శనివారం, 13 డిసెంబరు

# మోదీ–ట్రంప్ సంభాషణ

భారత ప్రధాని నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చాలాకాలం తర్వాత గురువారం టెలిఫోన్ సంభాషణ ద్వారా ఉభయ కుశలోపరి ముచ్చటించుకున్నారు. జనవరిలో ట్రంప్ రెండవ అధ్యక్ష పదవీకాలానికి పదవీ ప్రమాణం స్వీకరించిన దరిమిలా మోదీ వాషింగ్టన్ వెళ్లి శుభాకాంక్షలు తెలిపి, శుభాసంభాషణలు జరిపి వచ్చిన తదుపరి ట్రంప్ తమ వాణిజ్య భాగస్వాములుగా ఉన్న పలు దేశాలనుంచి దిగుమతులపై సుంకాల విధింపు ఇబ్బెదుముబ్బెదు పెంచినపుడు తమ ''వ్యూహాత్మక భాగస్వామి''గా భావించే భారత్‌ను విడిచిపెట్టలేదు. భారత్ వాణిజ్య మిగులు, భారత్‌లో అమెరికా నుంచి దిగుమతులపై అధిక సుంకాలు ఎత్తిచూపుతూ భారత్‌నుంచి దిగుమతులపై సుంకాలను 25 శాతానికి పెంచారు. రష్యా–ఉక్రేన్ యుద్ధాన్ని సాకుగా చూపి రష్యానుంచి ముడిచమురు దిగుమతిపై తాము విధించిన ఆంక్షలను భారత్ పాటించకుండా దిగుమతి చేసుకుంటున్నదంటూ ట్రంప్ మరో 25 శాతం సుంకం విధించారు. దక్షిణాఫ్రికా తర్వాత భారత్‌పైనే ట్రంప్ ఇంత భారీగా సుంకం విధించారు. భారత్ ఆ ఒత్తిడికి తలొగ్గకపోవటంతో ఇరు దేశాల సంబంధాల్లో ఉద్రిక్తత ప్రవేశించింది. రెండోవైపున, తమ పాలపదార్థాలు, జన్యుమార్పిడి వ్యవసాయోత్పత్తులకు తమ మార్కెట్ తెరిచేందుకు భారత్ అంగీకరించకపోవటంతో భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ప్రతిష్టంభనలో పడ్డాయి. విరామాలతో పలుదఫాలు చర్చలు జరిగినా ప్రతిష్టంభన తొలగిపోలేదు. అయితే తెరవెనుక చర్చల్లో అనేక వివాదాంశాలు పరిష్కారమైనట్లు చెప్పబడుతున్నది. ''భారత్ మున్నెన్నడూలేనంత ఉత్తమ ప్రతిపాదనలు చేసింది'' అని యుఎస్ వాణిజ్య ప్రతినిధి జమీసన్ గ్రీర్ ఈ వారంలో సెనేట్ అప్రోప్రియేషన్ సబ్ కమిటీకి చెప్పటం గమనార్హం. ఈ నేపథ్యంలోనే డిప్యూటీ యుఎస్ వాణిజ్య ప్రతినిధి రిక్ స్విట్జర్, భారత్‌తో ఒప్పంద ముఖ్య సంప్రదింపుదారు బ్రెండన్ లించ్ ఢిల్లీ వచ్చి వాణిజ్య ఒప్పందంపై జరుపుతున్న చర్చల్లో పురోగతి సాధించినట్లు చెప్పబడుతున్న సందర్భంలో ట్రంప్‌తో మోదీ ఫోన్ సంభాషణలు ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. 'X'లో మోదీ పోస్టు ప్రకారం ట్రంప్‌తో ఎంతో సుహృద్భావంతో ద్వైపాక్షిక సంబంధాలతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలను చర్చించారు. భారత్–అమెరికా సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతున్న తీరుపట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. వాణిజ్యం, క్లిష్టమైన టెక్నాలజీలు, ఇంధనం, రక్షణరంగం, భద్రత గూర్చి నేతలిరువురూ అభిప్రాయాలు మార్పిడి చేసుకున్నారు.

దౌత్య పరిభాషలోని ఈ పదాలన్నీ భారత్–అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం దిశలో పెద్ద పురోగతి జరిగినట్లు, త్వరలో సంతకాలు జరగవచ్చునని భావించవచ్చు. వివరాలు వెల్లడైతేగాని భారత్ మార్కెట్ ద్వారాలు ఎంతమేరకు తెరుస్తారో, దాని పర్యవసానాలేమిటో విదితం కాదు. అప్పుడైనా ట్రంప్ సుంకాలు ఎంత తగ్గిస్తారో వేచిచూడాలి. భారత్ మరిన్ని రాయితీలిస్తుందో చూడాలి.

స్థూలంగా చూస్తే భారత్, అమెరికా సంబంధాలు అన్ని రంగాల్లో బలంగానే కొనసాగుతున్నాయి. ట్రంప్ ఒత్తిళ్లన్నీ తమ దేశానికి లాభసాటి అయిన వాణిజ్య ఒప్పందం సాధించటం. ఒకవైపు వాణిజ్య చర్చలు తుది దశలో ప్రవేశించాక కూడా ఆయన గతవారం భారత్‌నుంచి బియ్యం దిగుమతులపై సుంకాల పెంపుదల కొరడా ఝుళిపించారు. భారత్ టెక్కీలకు హెచ్1బి తదితర వీసాల కుదింపు గొడవ అలాగే ఉంది. అంతేగాక, అమెరికా పౌరసత్వం కోసం మిలియన్ డాలర్ల గోల్డ్‌బాండ్ జారీ అమలును మొన్ననే మొదలెట్టారు. రెండోవైపున, భారత్ కూడా అమెరికాతో బహుముఖ సంబంధాల ప్రాధాన్యత తగ్గించలేదు. అయితే దక్షిణ గోళ బ్రిక్స్, ఎస్‌సిఒ వంటి బహుళపక్ష వేదికల్లో చురుకుగా పాల్గొనటం, రష్యా, చైనాలతో సంబంధాలు మెరుగుపరచుకోవటం ద్వారా తమ ''వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని'' ప్రకటిస్తూ ట్రంప్‌కు ఇబ్బందికరమైన సంకేతాలు పంపింది. భారత్‌తో రెండు దశాబ్దాలపాటు ఎంతో శ్రమించి నిర్మించిన సంబంధాలను చెడగొట్టిన అధ్యక్షునిగా ట్రంప్ చరిత్రలో మిగిలిపోతారంటూ ఆయన అంతర్గతంగా ప్రభుత్వంలోనుండి, పార్టీలోనుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో భారత్‌తో సత్సంబంధాల పునరుద్ధరణకు సంకేతంగా ప్రధాని మోదీతో సంభాషించాలని ట్రంప్ కోరుకుని ఉంటాడు. అమెరికాతో సంబంధాల్లో ఇబ్బందులు తొలగించుకోవటం ద్వారా వాణిజ్య వర్గాల్లోని అసంతృప్తిని తొలగించుకునే ఆసక్తితో ఉన్న నరేంద్రమోదీ వాణిజ్య ఒప్పందంపై కొన్ని సడలింపులు ఇచ్చి ఉంటారు. దాంతో ట్రంప్–మోదీ మధ్య ఐస్ కరిగింది. సంభాషణల పునరుద్ధరణ జరిగింది. దేశానికి మేలు జరిగితే ఇది మంచి పరిణామమే.

# కార్మికుల ఆరోగ్యం, భద్రతకు ఏదీ రక్షణ?

## ఉన్న హక్కులు ఊడగొట్టి పరిశ్రమలకు దాసోహం చేయిస్తున్న లేబర్‌కోడ్

డాక్టర్ అరుణ్‌మిత్రా

వృత్తిపరమైన ఆరోగ్యం, భద్రత చాలాకాలంగా ఆరోగ్య కార్యకర్తలు, కార్మికసంఘాలకు తీవ్రమైన ఆందోళనకర అంశంగా వుంది. ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవ కాలంలో బాలల చేత సైతం పొగగొట్టాలు శుభ్రం చేయించారు. ప్రమాదభూయిష్టమైన పరిశ్రమల్లో పని చేయించారు. పర్యవసానంగా అనేకమంది తీవ్రమైన జబ్బులపాలైనారు, పిన్నవయస్సులోనే మృత్యువాతపడ్డారు. అక్కడి నుండి ఇంగ్లండ్ చాలా ముందుకు ప్రయాణించింది. పిల్లలందరూ బడికి వెళ్లాలి, వారికి సవ్యమైన పౌష్టికాహారం అందించాలి, వారికి అవసరమైన ఆరోగ్యసంరక్షణను అందించాలి అనే దిశలో ఆ ప్రయాణం సాగింది. మనదేశంలో దీన్ని సాధించటానికి మనం ఎంతో దూరంలో ఉన్నాం.

2007లో జెనీవాలో జరిగిన ప్రపంచ ఆరోగ్య అసెంబ్లీ 60వ సమావేశం, ''కార్మికుల ఆరోగ్యం : ప్రపంచ కార్యాచరణ ప్రణాళిక''ను రూపొందించింది. ''కార్మికులు ప్రపంచ జనాభాలో సగానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆర్థిక, సామాజికాభివృద్ధికి ప్రధానమైన దోహదకారులు. అయితే వారిలో కొద్దిమందికి మాత్రమే వృత్తిసంబంధ ఆరోగ్య సేవలు అందుతున్నాయి అని అది గుర్తించింది.

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సంభవిస్తున్న మొత్తం మరణాలలో 20లక్షల 2వేలు లేదా 3.6 శాతం వృత్తి సంబంధ ప్రమాదాలలో లేదా వ్యాధులతో సంభవిస్తున్నట్లు ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌ఒ) అంచనా వేసింది. ఇండియన్ పాపులేషన్ క్లాక్ (జనాభా గడియారం) ప్రకారం మనదేశంలో ప్రతి సంవత్సరం 97లక్షల మరణాలు సంభవిస్తున్నాయి. వాటిలో దాదాపు 48000 మంది కార్మికులు లేదా మొత్తం మరణాలలో 4.8 శాతం వృత్తి సంబంధమైన ప్రమాదాల్లో మరణిస్తున్నారు. కార్మిక మరణాల్లో 24.20 శాతం నిర్మాణాల రంగంలో ఉన్నాయి. సవ్యమైన నిరోధన, రిపోర్టింగ్, తనిఖీ పద్ధతులను పాటిస్తే ఆ విషాదాలలో అనేకం నివారించటం సాధ్యం.

భారతదేశంలో శ్రామికవర్గం రమారమీ 54కోట్ల మంది. వారిలో దాదాపు 3 శాతం ప్రభుత్వ డిపార్టుమెంట్లలో, ప్రభుత్వరంగ పరిశ్రమల్లో ఉన్నారు. వారు మాత్రమే సామాజిక భద్రత కింద ఉన్నారు. మిగతా శ్రామికశక్తిలో కొద్ది సంఖ్య మాత్రమే నియతరంగంలో ఉండగా, విస్తారమైన మెజారిటీ – 93శాతం అనియతరంగంలో ఉన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వరంగం ఉద్యోగులు పోను, మొత్తం శ్రామికశక్తిలో సుమారు 11 శాతం మాత్రమే సామాజిక భద్రత పథకాల వర్తింపు కింద ఉన్నారు. అందువల్ల వృత్తి సంబంధమైన భద్రత అత్యంత ప్రాధాన్యత గల సమస్యగా ఉంది.

కార్యకలాపాల్లో వివిధ రంగాల మధ్య సమన్వయం ఏర్పాట్లను అభివృద్ధి చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఒ) సూచించింది. ఇది చాలా ముఖ్యం – ఎందుకంటే ఆరోగ్యంపై ప్రభావం వివిధ రంగాల్లో భిన్నంగా ఉంటుంది. గని త్రవ్వకాల్లో పనిచేసేవారు వారి చుట్టూ వ్యాపించి ఉన్న పదార్థాన్ని పీల్చుకోవటం వల్ల ఎక్కువగా జబ్బులపాలవుతుంటారు. అణుశక్తి పరిశ్రమలోనివారు ప్రమాదకరమైన అణుధార్మికత ప్రభావానికి గురవుతుంటారు. ఆసుపత్రి కార్మికులు అంటువ్యాధులు పాలవుతుంటారు. నిర్మాణాల రంగంలోని కార్మికులు ఎక్కువగా బాధించే గాయాల పాలవుతుంటారు. కుట్టుపనివారు వృధా మెటీరియలు, విషప్రభావం గల గ్యాస్‌లకు గురవుతుంటారు. ఆ ప్రకారం ప్రమాదాల నిరోధన, చికిత్స, పరిహారం పద్ధతుల్లో కూడా వ్యత్యాసం ఉంటుంది. ఆర్థిక కార్యకలాపాల్లోని అధిక రిస్క్ రంగాల్లో పనిచేసే కార్మికుల పట్ల, యువకులు, వృద్ధుల పట్ల, వికలాంగులు, వలస కార్మికుల పట్ల ప్రత్యేక శ్రద్ధవుంచాలి. మహిళల సమస్యలను ప్రత్యేకించి పరిగణనలోకి తీసుకోవాలి.

2025 నవంబర్ 21న నోటిఫై చేసిన ''వృత్తి సంబంధ భద్రత, ఆరోగ్యం మరియు పనిపరిస్థితులపై లేబర్ కోడ్, 2020'' కార్మికుల భద్రతకు సంబంధించిన వివిధ క్లాజులను పూర్తిగా తొలగించింది. సమర్థవంతంగా అమలు చేయటం, శ్రామిక శక్తిలోని విస్తృత విభాగాలకు కవరేజి ఇవ్వటానికి సంబంధించిన ప్రాథమిక సమస్యలను చేపట్టటంలో అది విఫలమైంది. ఫ్యాక్టరీలు, గనులు, రేవులు, నిర్మాణాలు, రవాణా, తోటలు, కాంట్రాక్టు కార్మికులు, వలసకార్మికుల వంటి అనేక రంగాల్లో భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులకు సంబంధించి గతంలో ఉన్న 13 కేంద్ర చట్టాలను కలగలిపి ఈ కోడ్ రూపొందించారు. ఆ విధంగా ప్రతి ఒక్క రంగానికి ఉండే నిర్దిష్టమైన పరిస్థితులను విస్మరించారు.

మొత్తం దుకాణాలు/కార్మికుల్లో 93 శాతం నాన్–రిజిస్టర్డ్ సంస్థల్లోనే ఉంటారు. వాటిలో పనిచేసే కార్మికుల సమస్యలను లేబర్‌కోడ్ దాటవేసింది. అప్రెంటీస్‌లు /ట్రైనీలు సహా–ఉపాధి స్వభావం ఏదైనప్పటికీ కార్మికులందరికీ కోడ్ వర్తింపజేయాలి. వ్యవసాయ కార్మికులు, గృహ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, ఉప్పుతయారీ కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, ఫారెస్టు వర్కర్స్, ఐటి వర్కర్స్, కొరియర్ వర్కర్స్, అంగన్‌వాడీ వర్కర్స్ వగైరా ఇతర కేటగిరీ కార్మికులను కోడ్ దాటవేసింది.



ఇంతకు క్రితం రంగాలవారీ ఉన్న నిర్దిష్టమైన చట్టాలను – ఫ్యాక్టరీ యాక్ట్, మైన్స్ యాక్ట్, కాంట్రాక్టు లేబర్ యాక్ట్, అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం వగైరా చట్టాల్లో ఉన్న బహుముఖమైన లీగల్ భద్రతలను ఒఎస్‌హెచ్ కోడ్ బలహీనపరిచింది. కొత్త చట్రం యజమానులకు వెసులుబాటుయిస్తూ, కార్యికులకు స్పష్టమైన అమలు చేయాల్సిన హక్కులను హరిస్తున్నది. అంతేగాక 10మంది ఆ పైగా కార్మికులున్న ఫ్యాక్టరీలకే ఈ కోడ్ వర్తిస్తుంది. ఇది చిన్న సాంకేతిక మార్పుగా కనిపించవచ్చుగాని కార్మికుల కవరేజి విషయంలో పెద్ద మార్పు తెస్తుంది. మన జౌళి, గార్మెంట్, మెటల్, హోసిరీ, ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్స్‌లో 10 లేదా 20 మంది పనిచేసే యూనిట్లే అత్యధికం. ఈ కార్మికుల సంఖ్యను పెంచటం వల్ల చిన్న, సూక్ష్మ యూనిట్లలో పనిచేసే లక్షలాది మంది చట్ట రక్షణ కోల్పోతారు.

లేబర్ ఇన్‌స్పెక్టర్ మెకానిజం నీరుగారింది. వారిని ''ఇన్‌స్పెక్టర్లు–కం–ఫెసిలిటేటర్లు'' అని నామకరణం చేశారు. లేబర్ చట్టాలను కచ్చితంగా అమలు చేసేటట్లు చూడాల్సిన వారి పాత్ర 'దోహదకారులు' స్థాయికి దిగజారింది. అంటే సలహాలిస్తారన్నమాట. దీంతో తనిఖీ అర్థరహితమవుతోంది.

రంగంవారీ ఉన్న నిర్దిష్టమైన రక్షణలను కోడ్ నీరుగార్చింది. ఇంతకుముందు రంగంవారీ కార్మికులకు నిర్దిష్టంగా – ప్లాంటేషన్ లేబర్ చట్టం, బీడీ అండ్ సిగార్ వర్కర్స్ చట్టం, మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ చట్టం, డాక్ వర్కర్స్ చట్టం – ఆ రంగం స్వభావాన్ని బట్టి పనిగంటలు, సంక్షేమం, గృహవసతి, వైద్య సంరక్షణ, భద్రత వంటి అంశాలపై ప్రత్యేకంగా చట్టాలున్నాయి. ప్రస్తుత లేబర్‌కోడ్ వీటన్నిటినీ కలిపివేసి సర్వసాధారణ చట్టంలోకి తెచ్చింది. సాధకబాధకాలపై ఫిర్యాదు, పరిష్కారం యంత్రాంగాన్ని నీరుగార్చింది.

సుదీర్ఘమైన పనిగంటలు, వెసులుబాటుతో కూడిన వర్క్‌షిఫ్టుల విషయంలో నిబంధనలు బలంగా ఉన్నాయి. ఒఎస్‌హెచ్ కోడ్ 48 గంటల పనివారాన్ని అలాగే వుంచినా, రాష్ట్ర డ్రాఫ్టులు, రూల్సు 12 గంటల రోజు షిఫ్ట్ అనుమతిస్తున్నాయి. 20వ శతాబ్దం ప్రారంభం నుంచి ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గం ఛాంపియన్ చేస్తున్న ఎన్నో పోరాటాలు, త్యాగాలతో కార్మికవర్గం సాధించుకున్న 8 గంటల పని దినాన్ని ఇది వెనక్కు కొడుతున్నది. ఇన్ఫోసిస్ చైర్మన్ నారాయణ మూర్తి 70 గంటల పనివారాన్ని ప్రతిపాదించటం (బహుశా ప్రభుత్వం ప్రోత్సాహంతో కావచ్చు)లో ఆశ్చర్యం లేదు. సుబ్రహ్మణ్యం మరింత ముందుకెళ్లి 90 గంటల పనివారాన్ని ప్రతిపాదించారు. మన శరీర వ్యవస్థలు వరుసగా 8 గంటలు కూడా పూర్తి శక్తితో పనిచేయలేవని వైద్య పరిశోధనలు నిర్ధారించాయి. 6 గంటల పని, అదీ ఉదయం పూట ఆదర్శమైన పనివేళ అని శాస్త్రవేత్తలు సాధారణంగా అంగీకరిస్తారు. స్వచ్ఛమైన, పరిశుభ్రమైన పరిసర వాతావరణం, శుభ్రమైన త్రాగునీరు, ఇంకా అటువంటి వసతులు కొరవడిన పరిస్థితుల్లో కార్మికులు ఆరోగ్యంగా ఉండటం, గరిష్ట శక్తి సామర్థ్యాలను వెచ్చించటం కష్టం.

కార్మిక యూనియన్‌లు, సంఘ సేవకులు, ఆలోచనాపరులైన పౌరులు, రాజకీయ పార్టీలూ ఆరోగ్యకరమైన జీవితం కోసం కార్మికుల హక్కులను సమర్థించాలి. ఈ ఒఎస్‌హెచ్ అండ్ డబ్ల్యుసి కోడ్ ఉపసంహరణకై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

# సిపిఐ శతాబ్ది ఉత్సవాలు

## ఆర్‌ఎస్‌ఎస్ కోట నాగ్‌పూర్‌లో సిపిఐ భారీ ర్యాలీ

# వేలాదిమందితో ప్రదర్శన

సిపిఐ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కేంద్రం నెలకొని ఉన్న నాగ్‌పూర్ పుర వీధుల్లో సిపిఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిపిఐ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనను నిర్వహించారు. మితవాద ప్రతీఘాత శక్తులు రాజ్యాంగం జోలికి రావొద్దని ఈ సందర్భంగా హెచ్చరించారు. నాగ్‌పూర్ వీధుల గుండా సిపిఐ శ్రేణులు కవాతు చేశారు. ఈ ప్రదర్శనలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ బాలచంద్ర కాంగో, మహారాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి సుభాష్ లాండే, నాగ్‌పూర్ జిల్లా సెక్రెటరీ యుగల్ రాయలు, విదర్భ ప్రాంతానికి చెందిన అన్ని జిల్లాల కార్యదర్శులు పాల్గొన్నారు. సుమారు 5వేల మంది సిపిఐ కార్యకర్తలు, మద్దతుదారులు విదర్భ ప్రాంతమంతటి నుంచి పెద్ద ఎత్తున ఈ ప్రదర్శన కోసం నాగ్‌పూర్‌కు తరలివచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయం ఎదుట నుంచి ప్రదర్శన సాగుతున్న సమయంలో ఫాసిజం, నియంతృత్వం నశించాలి, రాజ్యాంగ గౌరవాన్ని పునరుద్ధరించాలని వారు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం ప్రతిష్టాత్మక చిట్నీస్ పార్క్‌లో బహిరంగ సభను నిర్వహించారు.






మాజీ రాష్ట్ర కార్యదర్శి తుకారామ్ భస్మే అధ్యక్షతన జరిగిన సభలో కాంగో ప్రసంగిస్తూ స్వాతంత్ర్యోద్యమం నుంచి కార్మికోద్యమం వరకూ సిపిఐ అగ్రభాగాన నిలిచిందన్నారు. నిజాం వ్యతిరేక పోరాటంలో నాలుగున్నర వేల మంది కామ్రేడ్‌లు తమ జీతాలను త్యాగం చేశారని గుర్తు చేశారు.

యుపిఎ–1 ప్రభుత్వానికి 64 మంది వామపక్ష పార్టీ సభ్యులు ఉన్నప్పటికీ మంత్రివర్గంలో చోటు కోసం బేరసారాలు చేయలేదని, కానీ, మహాత్మాగాంధీ నరేగా, సమాచార హక్కు, విద్యా హక్కు,గిరిజనులకు అటవీ హక్కు చట్టాల కోసం నాటి ప్రభుత్వానికి మార్గదర్శనం చేశారని తెలిపారు.







# కదంతొక్కుతున్న జాతా

## కర్నాటకలో కెజిఎఫ్ నుంచి ప్రారంభం

సిపిఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని కోలార్ బంగారు గనులు(కెజిఎఫ్) నుంచి సిపిఐ కర్నాటక రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కర్నాటక రాష్ట్రవ్యాప్త జాతా ప్రారంభమైంది. ఈ జాతాను నవంబర్ 30న సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రారంభించారు. కెజిఎఫ్‌లో కమ్యూనిస్టు ఉద్య మం ఘన వారసత్వం కలిగి ఉంది. అక్కడి ప్రజలు 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో సిపిఐ వెటరన్ నాయకుడు కె.ఎస్.వాసన్‌ను శాసనసభకు తమ ప్రతినిధిగా ఎన్నుకున్నారు. 1957లో ఇదే నియోజకవర్గం నుంచి మరో సీనియర్ నాయకుడు ఎం.సి.నరసింహన్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

1955లో ప్రముఖ కమ్యూనిస్టు కామ్రేడ్ జీవానందం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ప్రదేశంలోనే జాతా ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన జెండాను డి.రాజా ఆవిష్కరించారు. అలాగే గిల్బర్ట్ ప్రాంతంలో జెండా దిమ్మను ప్రారంభించి, జెండాను ఎగురవేశారు. కింగ్ జార్జ్ ఆడిటోరియంలో సిపిఐ కోలార్ జిల్లా కార్యదర్శి జ్యోతిబసు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రాజా తో పాటు, సిపిఐ కర్నాటక రాష్ట్ర కార్యదర్శి సాతీ సుందరేశ్, తమిళనాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే టి.రామచంద్రన్, కర్నాటక రాష్ట్ర సహా య కార్యదర్శులు సంతోష్, రఘు, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్తీక్, డిఎంకె కోలార్ జిల్లా కార్యదర్శి అరివళగన్, విసికె రాష్ట్ర కార్యదర్శి మూర్తి, ఎండిఎంకె కర్నాటక ఇన్‌ఛార్జ్ జై శంకర్, తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాజా ప్రసంగిస్తూ కెజిఎఫ్ లో అంబేడ్కర్ విగ్రహాలను అనేకం చూశానని, రాజ్యాంగ నిర్మాతగా వివిధ వర్గాల నుంచి దేశాన్ని హిందుత్వ ఆధారం మతతత్వ రాజ్యం చేయాలని అనేక వత్తిళ్ళు వచ్చినప్పటికీ దేశాన్ని లౌకికదేశంగా నిలబట్టేందుకు ధృడంగా నిలబడ్డారని తెలిపారు. ఇప్పుడు అధికారంలో ఉన్న ఆర్‌ఎస్‌ఎస్–బిజెపిలు లౌకికవాదం, ప్రజాస్వామ్యం అనే భావనకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని, దానికి వ్యతిరేకంగా రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరునిపై ఉన్నదన్నారు. బిజెపి అధికారంలో కొనసాగేందుకే 'ఒక దేశం, ఒకే ఎన్నిక' అనే ప్రతిపాదనను ఉద్దేశ్యపూర్వకంగా ముందుకు తీసుకువస్తున్నారని విమర్శించారు. అది సమాఖ్య నిర్మాణంపై దాడి చేయడమే అవుతుందన్నారు. ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను గౌరవించాలని, వాటిని బలహీనపరచవద్దని విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో సిపిఐ మహోజ్వల పాత్రను పోషించిందని, తెలంగాణ సాయుధ పోరాటం, పుదుచ్చేరి స్వాతంత్ర్య పోరాటాలకు నేతృత్వం వహించిందని గుర్తు చేశారు. కెజిఎఫ్‌లో ప్రారంభమైన సిపిఐ శతాబ్ది ఉత్సవాల జాతా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు వెళ్తుందని, డిసెంబర్ 23న బెంగళూరులో ముగుస్తుందని సాతీ సుందరేశ్ వెల్లడించారు.





## గ్రామాలలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి నియోజకవర్గ పరిధిలో ఈనెల 17న జరగనున్న మూడవ విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఉత్తర్వుల మేరకు డిఎస్పీ రఘుచందర్ సూచనలతో ధర్మపురి సీఐ ఎలపాటి రాం నర్సింహారెడ్డి, ఎస్సై గురుక మహేష్ ల ఆధ్వర్యంలో శుక్రవారం నేరేళ్ల,రాయపట్నం గ్రామాలలో 50 మంది పోలీస్ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ రాం నర్సింహా రెడ్డి మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో భద్రతా భావాన్ని పెంచడానికి ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు.చట్టవిరుద్ధంగా ప్రవర్తించినా గొడవలు సృష్టించినా చట్టప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు పి.ఉదయ్ కుమార్( వెల్గటూర్),కృష్ణ సాగర్ రెడ్డి (గొల్లపల్లి),సతీష్ (బుగ్గారం),రవీందర్ కుమార్ (ధర్మపురి 2),పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన సర్పంచులు ఉపసర్పంచులను అభినందించిన మంత్రి పొన్నం

**ప్రజాపక్షం/హుస్నాబాద్:** హుస్నాబాద్ నియోజయోజకవనర్గంలోని స్థానిక ఎన్నికల్లో సర్పంచు గెలిచిమీరు వస్తే అభివృద్ధినా వంతుగా కృషిచెస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు, నూతన సర్పంచులకు అభయం ఇచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని మొదటి విడత జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులకు, ఉప సర్పంచులకు మంత్రి క్యాంపు కార్యాలయంలో వారికి శాలువ కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగ మంత్రి మాట్లాడుతూ కాంగ్రేస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి నేటి వరకు ఇచ్చిన హామీలను నేరవేర్చామని తెలిపారు. నియోజకవర్గంలోని మూడు జిల్లాల ప్రాదాణ్యత క్రమంగా జిల్లా మంత్రుల సహకారంతో ముఖ్య మంత్రిని కలసి నియోజకవర్గంను అన్ని రంగాల్లో అభివృద్ది కోసం నిధులను కోరుతామని అన్నారు. నియోజకవర్గంలో ఉన్న 173 మంది సర్పంచులకు పంచాయితీ రాజ్ శాఖ అధ్వర్యంలో గ్రామాల అభివృద్ది కోసం ప్లాన్ అప్ యాక్షన్‌పై శిక్షన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాయకులతో పాటు నూతన స ర్పంచులు ఉప సర్పంచులు పాల్గోన్నారు.

## సంక్షోభాలపై పార్లమెంటులో చర్చ అవసరం: ఎంపి గడ్డం వంశీకృష్ణ



**ప్రజాపక్షం/గోదావరిఖని :** దేశం ప్రస్తుతం తీవ్ర అస్థిర పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికి ప్రజలకు నేరుగా ప్రభావం చూపే అంశాలు పార్లమెంటులో చర్చకు రాకపోవడం విచారకరమని పెద్దపల్లి గడ్డం వంశీకృష్ణ తెలిపారు. శుక్రవారం దిల్లీలో ఎంపీ మాట్లాడుతూ, డిజిసిఎ కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చిన రెండు సంవత్సరాలు అవుతున్నా, ఇండిగో మాత్రం వాటిని నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రయాణికుల భద్రతకు సంబంధించిన ఈ అంశంపై చర్చ తప్పనిసరి అన్నారు. దిల్లీలో కాలుష్యం 500 ఎక్యూఐకిపైగా చేరి ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుండగా, దీనిపై కూడ ప్రభుత్వం మౌనం వహిస్తున్నదని విమర్శించారు. రూపాయి విలువ పడిపోవడం ఆందోళనకరమన్నారు. రూపాయి ఐసియులో ఉన్నట్టుందన్నారు. నిరుద్యోగం పెరిగిందన్నారు. మోడీ ప్రభుత్వం హామీ ఇచ్చిన సంవత్సరానికి 2 కోట్లు ఉద్యోగులు ఎక్కడ? అని ప్రశ్నించారు. ఆసలు సమస్యలను పక్కన పెట్టి 150 సంవత్సరాల క్రితం అంశాలపై చర్చ జరగడం ప్రజాస్వామ్యానికి మంచిదికాదన్నారు. రాహుల్‌గాంధీ అడిగిన ప్రశ్నలకు హోంమంత్రి సమాధానం ఇవ్వకుండా దారి మళ్లించడాన్ని కూడ ఆయన విమర్శించారు. ఎన్నికల కమిషనర్ ఎంపికలో ప్రధాన న్యాయమూర్తిని ఎందుకు తొలగించారు? న్యాయ వ్యవస్థపై గౌరవం ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. ఈ విషయాలను కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగతంగా కాకుండా దేశ ప్రయోజనాలను దృష్టిలో తీసుకొని చర్చకు రావాలని ఎంపీ అన్నారు.

## శాతవాహన అభివృద్ధి కోసం రూ.100కోట్ల ప్రతిపాదనలు



**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాతవాహన విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ తో మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత విద్య, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించిందని, ఈ ప్రయత్నంలో భాగంగా, శాతవాహన విశ్వవిద్యాలయానికి సుమారు 100 కోట్ల రూపాయల అభివృద్ధి పనుల విషయంలో, వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలు (డిపిఆర్), ప్రాధాన్యతా పనులను సమగ్ర ప్రతిపాదనలను తయారుచేయాలని సూచించారు. ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ విశ్వవిద్యాలయానికి అవసరమైన నూతన భవన నిర్మాణాల కొరకు, అధునాతన పరిశోధనా ప్రయోగశాలల స్థాపన కొరకు, ఆట స్థలాల సౌకర్యాల అభివృద్ధి కొరకు ఓపెన్‌ఎయిర్ ఆడిటోరియం నిర్మాణం, విశ్వవిద్యాలయం యొక్క కీలకమైన విద్యా లేదా మౌలిక సదుపాయాల అవసరాల కొరకు అతి తొందరలో ప్రతిపాదనలు సిద్ధం చేసి పది రోజులలో సమగ్ర వివరనాత్మక ప్రాజెక్టు నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి పంపిస్తామని తెలియజేశారు.

## రాయపట్నం ఎత్తిపోతల పరిశీలించిన అడ్లూరి



**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి మండలం రాయపట్నం గోదావరి నది తీరంలోనున్న ఎత్తిపోతల పథకాన్ని శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ పరిశీలించారు. రాయపట్నం లిఫ్ట్‌కు సంబంధించిన విద్యుత్తు ట్రాన్సర్మర్ లోని కాపర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటనపై మంత్రి స్వయంగా పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జాతో ఫోన్‌లో మాట్లాడారు.చోరీకి గురైన ట్రాన్స్ఫార్మర్ కాపర్ సంబంధిత నూతన సామాగ్రి కై వారం రోజుల్లో నిధులను విడుదల చేయాలని కోరారు.మంత్రి వెంట సంబంధిత అధికారులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థి ఎంపిక



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ లోని ఆల్ఫోర్స్ టైనీ టాట్స్ కు చెందిన విద్యార్థి కే.స్వరన్ జాతీయ స్థాయి సిమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో నరేందర్ రెడ్డి స్టూడెంట్ ను అభినందించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలని, వాటి ద్వారా విద్యార్థులకు ఎన్నో లాభాలు చేకూరుతాయని అన్నారు. విద్యార్థులకు వివిధ క్రీడల పట్ల అవగాహన కల్పించడమే కాకుండా వాటిలో పాల్గొనేందుకు ప్రోత్సాహంతో పాటు వనరులు కల్పించాలన్నారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీలలో అద్భుతంగా ప్రదర్శన కనబరిచిన విద్యార్థులను వివిధ స్థాయిలలో నిర్వహించే పోటీలకు ఎంపిక చేస్తూ ప్రోత్సాహాన్ని అందిస్తున్నామన్నారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడానికి ప్రత్యేక ప్రణాళికలు ఉన్నాయని,ఆ ప్రణాళికలో భాగంగా ఇటీవల కాలంలో ఆదిలాబాద్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలలో పాఠశాలకు చెందిన కే.స్వరన్ అత్యుత్తమ ప్రదర్శన కనబరచడమే కాకుండా రాష్ట్రస్థాయిలో రజత, కాంస్య పతకాలను గెలుచుకొని త్వరలో నిర్వహించబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్లెల్లో శాంతి భద్రతకు పటిష్ఠ చర్యలు: డిసిపి

**ప్రజాపక్షం/గోదావరిఖని :** గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల సందర్భంగా పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని గ్రామాల్లో శాంతి భద్రతలకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన గోదావరిఖని ఎసీపీ మడత రమేష్‌తో కలిసి మండలంలోని మూర్మూర్, ఎల్లంపల్లి, గోలివాడ గ్రామాలను సందర్శించారు. ప్రజలు, గ్రామ పెద్దలు, ఎన్నికల్లో పాల్గొంటున్న అభ్యర్థులతో సమావేశమయ్యారు. ఎన్నికల పోలింగ్ సందర్భంగా పాటించాల్సిన నియమ, నిబంధనల గురించి తెలియజేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా కీలకమన్నారు. వ్యక్తిగత దూషణలకు వెళ్లకుండా అందరూ సమన్వయం పాటించాలన్నారు. ఎదైనా ఘర్షణ వాతావరణం నెలకొంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఓటర్లను ఏలాంటి ప్రలోభాలకు గురిచేయవద్దన్నారు. నియమ నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు. ఫలితాల తర్వాత ఏలాంటి ర్యాలీలు, సమావేశాలకు అనుమతి లేదన్నారు. ఆయా అభ్యర్థులు గెలుపు, ఓటములను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలన్నారు.

ముఖ్యంగా అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను గౌరవించి సహకరిస్తే పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

## శుక్రవారం సభతో మహిళల్లో ఆరోగ్యంపై అవగాహన

### కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** శుక్రవారం సభ కార్యక్రమం ద్వారా జిల్లాలో మహిళలకు తమ ఆరోగ్యం, పిల్లల పోషణ పట్ల అవగాహన వస్తోందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కాలనీ అంగన్వాడీ కేంద్రం పరిధిలో నిర్వహించిన శుక్రవారం సభకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శుక్రవారం సభ ద్వారా మహిళలకు ప్రభుత్వ కార్యక్రమాల అవగాహన మాత్రమే కాకుండా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. దీనివల్ల చాలామంది మహిళలు రక్తహీనత గురించి తెలుసుకుని అధిగమించారని అన్నారు. తమ పిల్లలు ఎంత బరువు, ఎంత ఎత్తు ఉండాలి అనే విషయం పట్ల తల్లులకు అవగాహన పెరుగుతోందని తెలిపారు. తద్వారా పిల్లలకు పోషకాహారం అందజేస్తూ వారి ఆరోగ్యాన్ని సంరక్షిస్తున్నారని తెలిపారు. ఆటపాటలతో కూడిన అంగన్వాడీ విద్య పిల్లల భవిష్యత్తుకు ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు. అంగన్వాడీల్లో పిల్లల బరువులు, ఎత్తు కొలుస్తూ వారు పరిపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా చూస్తారని అన్నారు. పోషకాహారంతో పాటు ఆలనా పాలన చూసే అంగన్వాడి కేంద్రాలలో పిల్లలను చేర్పించాలని సూచించారు. ఎవరైనా దివ్యాంగ పిల్లలు ఉన్నట్లయితే వారిని భవితా కేంద్రాల్లో చేర్పించాలని తెలిపారు. ప్రభుత్వ దవాఖానాలు, ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయని, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఈ కేంద్రాల నుంచి ఉచితంగా మందులు స్వీకరించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలు 4 ఏఎన్సి పరీక్షలు చేయించుకోవాలని, ఎంతో ఖరీదైన టీఫా వంటి స్కానింగ్ సౌకర్యం కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా నిర్వహించే ఆరోగ్య మహిళ వైద్య పరీక్షలు చేయించుకోవాలని మహిళలకు సూచించారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ స్వరూపారాణి, సిడిపిఓ సబితా కుమారి, మెడికల్ ఆఫీసర్ ప్రణవ్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సంపత్, సఖి కేంద్రం కౌన్సిలర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మహాపడి పూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్



**ప్రజాపక్షం/చందుర్తి:** మండల కేంద్రంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం గచ్చు బావి ఆవరణలో అయ్యప్ప మహాపడి పూజ మహోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. అరటి బెరడుతో అలంకరించిన అయ్యప్ప మండపం, 18 మెట్లు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. గూడెం గురు స్వామి చక్రవర్తుల పురుషోత్తమ చారి అయ్యప్ప మహాపడి పూజ మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక నవత విద్యాలయం పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇట్టి పూజా కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నూతనంగా గెలుపొందిన సర్పంచ్ పులి సత్యం, రామన్నపేట గ్రామ సర్పంచ్ పోతరాజు భారతి నగేష్, పలువురు వార్డు సభ్యులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక నాయకులు, ప్రముఖు లు, మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఇట్టి కార్యక్రమానికి వీక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దండి: అదనపు కలెక్టర్




**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని స్థానిక సంస్థల జిల్లా కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించేది పాఠశాలలలేనని వారి లక్ష్యసాధనకు చిన్నప్పటినుంచి విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. శుక్రవారం తిమ్మాపూర్ మండల కేంద్రం లోని మండల పరిషత్, ఉన్నత ఉన్నత పాఠశాలలతో పాటు అంగన్వాడి కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. ఇంగ్లీష్ తెలుగు సబ్జెక్టులను చదివించి వారి నైపుణ్యాన్ని స్వయంగా తెలుసుకున్నారు. తెలుగుతోపాటు ఇంగ్లీషులో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మాట్లాడడం నేర్చుకోవాలని విద్యార్థులు విద్యుత్ తో పాటు క్రీడల్లోను ముందుండాలని పేర్కొన్నారు. అంగన్వాడి కేంద్రాలను అత్యుత్తమ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని చిన్నారులకు తొలిమెట్టు అంగన్వాడి కేంద్రాలేనని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, బోధన స్థాయి గురించి తెలుసుకొని, ప్రధానోపాధ్యాయులకు అదనపు కలెక్టర్ తగిన సూచనలు చేశారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా విద్యార్థులను తయారు చేయాలని పేర్కొన్నారు.

## రెండవ విడత పోలింగ్ కేంద్రాల్లో కలెక్టర్ సందర్శన



**ప్రజాపక్షం/సిద్దిపేట :** జిల్లాలో రెండవ విడుత మండలాల్లో గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి దుబ్బాక, అక్బర్‌పేటభూంపల్లి, మిరుదొడ్డి, తొగుట మండలాల్లో పలు క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఇ దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,హబ్సీపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అక్బర్‌పేట భూంపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల. ఖాజీపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల, రుద్రారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మిరుదొడ్డి మండలం చెప్యాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, అల్వాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తొగుట మండలం గుడికందుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. పెద్దమాసాన్‌పల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి సౌకర్యాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిపేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నియమావళీ ప్రకారం విద్యుత్ సరఫరా, లైట్స్, ఫాన్స్, ర్యాంపు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, తాగునీటి వసతి, ఇలా ప్రతిది పోలింగ్ స్టేషన్‌లో ఉండాలని అధికారులను ఆదేశించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లు కావున, వెబ్‌కాస్టింగ్‌లు పెట్టెందుకు సౌకర్యంగా ఉండాలని. లైవ్ వెబ్ క్యాస్టింగ్ కొరకు నెట్ కనెక్షన్ ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. అలగే పోలింగ్ స్టేషన్‌లో కౌంటింగ్ సెంటర్ సౌకర్యంగా ఉండేలా పెద్ద గదిని ఎంచుకోవాలని ఆయా ఎంపిడిఓలను ఆదేశించారు. పోలింగ్ స్టేషన్‌కు ఎవ్వరిని కూడ ఫోన్ అనమతి లేదని, చుట్టు గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆయా మండల ఎంపిడిఓలు, తహాశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టుల వద్ద సమస్యలకు పరిష్కారం: ఎఐటియుసి నాయకులు డిమాండ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలో ఉన్న గనులు, డిపార్ట్మెంట్‌లపై ఉన్న చెక్ పోస్టుల వద్ద ఉన్న సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం ఏఐటియుసి ఎస్ అండ్ పి సి డిపార్ట్మెంట్ కార్యదర్శి రెడ్డి వెంకట్ స్వామి జూనియర్ ఇన్స్పెక్టర్ చంద శ్రీనివాస్, సీనియర్ సెక్యూరిటీ గార్డు రాధా కృష్ణ తో కలిసి పరిశీలించి ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి కి వివరించి పరిష్కారం చేయాలని కోరడం జరిగిందని వెంకట స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఏరియా లోని చెక్ పోస్ట్ లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఏఐటియుసి అభ్యర్థన మేరకు ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి అన్ని సెక్యూరిటీ పోస్టుల్లో ఉన్న సమస్యలను తెలుసుకొని తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారని ఆయన అన్నారు. సెక్యూరిటీ పోస్టుల్లో ఉన్నటువంటి సమస్యలను అక్కడ విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బందిని అడిగి తెలుసుకోవడం జరిగిందని ఆయన అన్నారు. ఇట్టి సమస్యలపై ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ తో చర్చించడం జరిగిందని ఆయన అన్నారు. అన్ని చెక్ పోస్టులను ఆధునికరించే విధంగా రంగులు వేయడం జరుగుతుందని మరియు టైల్స్ తో ఫ్లోర్ లు వేయడం, ప్రతిరోజు క్లీనింగ్ చేయడం జరుగుతుందని సెక్యూరిటీ ఆఫీసర్ తెలిపారాని,అదేవిధంగా మైన్స్ లో సెకండ్ పోస్టుల్లో ప్రవేట్ సెక్యూరిటీ గార్డ్స్ ని ఇచ్చేందుకు అంగీకరించారని ,అన్ని చెక్ పోస్ట్ లల్లో ఫర్నిచర్ అతి త్వరలో వచ్చే విధంగా ఏర్పాటు చేస్తామని సెక్యూరిటీ ఆఫీసర్ హామీ ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కొన్ని చెక్ పోస్టులలో లైటింగ్ సరిగా లేనందువల్ల ఎక్కడైతే లైటింగ్ తక్కువ ఉందొ ఆ పోస్టులలో కూడా లైటింగ్ వేసేందుకు అంగీకరించారని ఆయన అన్నారు. అదేవిధంగా కొన్ని పోస్టులలో బుష్ కటింగ్ చేసి లిజనింగ్ అనుకూలంగా ఉండే విధంగా చేస్తామని హామీ ఇచ్చినారని , ఓసిపి 5 చెక్ పోస్ట్ లో బూమ్ బ్యారియర్ ఏర్పాటు చేస్తామని చెప్పడం జరిగిందని,ఓసిపి 5 లో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు పోస్టులలో మొబైల్ పోస్టులను ఏర్పాటు చేయడానికి సెక్యూరిటీ ఆఫీసర్ అంగీకరించినారని వెంకటస్వామి ఒక ప్రకటన లో పేర్కొన్నారు.



## కాంపౌండ్ వాల్స్ కూల్చివేత పనులు త్వరగా పూర్తి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న కాంపౌండ్ వాల్స్ కూల్చివేత పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. సుల్తానాబాద్ పట్టణంలోని పురపాలక కార్యాలయం,బాలికల ఎస్సీ హాస్టల్, ప్రభుత్వ వైద్యశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ సుల్తానాబాద్ పట్టణంలో ఆర్&బీ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి కాంపౌండ్ వాల్, ఎంపిడిఓ కార్యాలయ కూల్చివేత పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఎస్సీ బాలికల హాస్టల్ వద్ద కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి గట్టపల్లి వరకు విద్యుత్ పోల్స్, ట్రాన్స్ ఫార్మర్ షిఫ్టింగ్ పనులు డిసెంబర్ 16 లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రి వద్ద అవసరమైన డ్రైనేజీ నిర్మాణ పనుల ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్మాణం అవుతున్న పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ పాత భవనాలను వెంటనే తొలగించాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ రమెష్, ఆర్&బీ డిఈ రవికిరణ్ ,ఏఈ గుణశేఖర్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఏ ఈ కిషోర్, మున్సిపల్ ఏఈ రాజ్ కుమార్, మున్సిపల్ మేనేజర్ ఆలీమొద్దీన్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## సర్పంచులు గ్రామ అభివృద్ధికి తోడ్పడాలి

### ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:** గ్రామ సర్పంచ్ లు గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరామ రావు అన్నారు. శుక్రవారం రోజున కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని కెజిఎన్ ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన 18 మంది సర్పంచులు గెలవగా సర్పంచులతో పాటువార్డు మెంబర్లను శాల్వాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూసర్పంచులు గ్రామములో వీధి లైట్లు, శానిటేషన్, గ్రామస్తులకు త్రాగునీరు విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి అన్నారు. గెలిచిన 18 మంది కాంగ్రెస్ సర్పంచులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ సర్పంచుల గెలుపు వెనుక పార్టీ నాయకులు కార్యకర్తల సమిష్టి కృషి మరువలేనిది అన్నారు. రెండవ సారి సర్పంచులుగా గెలిచిన వాళ్లను ప్రత్యేకంగా అభినందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ పథకాలను సర్పంచులు ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకుపోవాలి అన్నారు. సర్పంచులు బాధ్యతగా పని చేస్తూ గ్రామస్తుల మన్నలను పొందాలి అన్నారు. సేవా గుణంతో పని చేసే వారికి ప్రజల గుర్తింపు ఉంటుంది అన్నారు. పార్టీలో పని చేసే ప్రతి ఒక్కరు నా కుటుంబ సభ్యులేనని, గ్రామ పాలనలో మీసేవ వెలకట్టలేనిదని, మీతో పాటు నేను గ్రామాల ప్రగతి లక్ష్యంగా నిరంతరం పని చేస్తాము అన్నారు. నాకు పదవి ఉన్నా లేకున్నా ఎప్పుడు ప్రజలతో మమేకమై ఉంటాను అన్నారు.

**కాంగ్రెస్ బలపరిచే అభ్యర్థులను గెలిపిస్తే ప్రజలకు మరింత మేలు**

**సుల్తానాబాద్:** అభివృద్ధి సంక్షమానికి ఓటు వేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు కోరారు.గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా శుక్రవారం సుల్తానాబాద్ మండలం ఐతరాజుపల్లి, భూపతిపూర్, నరసయ్యపల్లి, బొంతకుంటపల్లి, కందునూరుపల్లి, నారాయణపూర్, చిన్న బొంకూర్, రేగడి మద్దికుంట, అల్లిపూర్ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తూ సర్పంచ్ అభ్యర్థుల బ్యాలెట్ నమూనాలతో ఇంటింటికి తిరుగుతూ ఓటు వేయాలని ఓటర్లను కోరారు.ముందుగా సుల్తానాబాద్ మండలం ఐతరాజుపల్లి గ్రామంలోని రామాలయంలో స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,గ్రామాల అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాటుపడు తున్నారని చెప్పారు. తాను ఎలాంటి కోతలు లేకుండా సెంటర్లలో వడ్ల కొనుగోల్లను చేపట్టి రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటున్నామని చెప్పారు. త్వరలోనే రైతులకు సన్న వడ్లకు సంబంధించిన బోనస్ డబ్బులను కూడా ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. గ్రామాలలో పక్కా ప్రణాళిక కార్యాచరణతో ప్రజలు కోరిన పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. మాట తప్పే ప్రసక్తి లేదని అన్నారు. అలాగే నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అగ్రభాగంగా నిలిపేందుకు కృషి చేస్తున్నారని ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలతో పాటు సిసి రోడ్లు డ్రైనేజీలు నిర్మాణానికి నిధులు అందిస్తూ గ్రామాలను సస్యశ్యామలం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళలు, గ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## సారంగాపూర్ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన జనరల్ అబ్జర్వర్

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా జనరల అబ్జర్వర్ ఐషా మస్రత్ ఖానమ్ సారంగాపూర్ మండల కేంద్రాన్ని సందర్శించారు.జిల్లా వ్యయ పరిశీలకుడు అధ్యఇతన జరిగిన సమావేశంలో మండలంలోని ఎన్నికల అభ్యర్థులతో ఆమ మాట్లాడారు.అనంతరం సారంగాపూర్‌లోని డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్,సెంటర్ ను పరిశీలించి,అక్కడి ఏర్పాట్లు,బ్యాలెట్ బాక్సుల లభ్యత,వాటి పరిస్థితిని సమీక్షించారు.అనంతరం ధని గ్రామంలోని పోలింగ్ స్టేషన్‌ను కూడా సందర్శించి,పోలింగ్ నిర్వహణపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో,తహసీల్దార్,ఎంపిఓ అజీజ్ ఖాన్ తదితర మండల అధికారులు పాల్గొన్నారు.నిర్మల్ జిల్లాలోని మొత్తం 7 మండలాల్లో,సారంగాపూర్ మండలం సహా,ఫేజ్ 2 గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ డిసెంబర్ 14 2025(ఆదివారం)న జరగనుంది.

## నిర్మల్‌లో నవోదయ పరీక్ష ఏర్పాట్లు పూర్తి

### 1,552 మంది విద్యార్థులు

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లాలో శనివారం ఉదయం 11.30 నుండి పగలు 1.30 వరకు జరగనున్న నవోదయ పరీక్షకు ఏర్పాట్లు పూర్తయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న తెలిపారు.విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందుగానే చేరుకోవాలని,ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారు.ప్రతి విద్యార్థి తప్పనిసరిగదా హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డును వెంట ఉంచుకోవాలని సూచించారు.ఈ పరీక్షకు నిర్మల్ జిల్లాలో మొత్తం 1,552 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు వెల్లడించారు.
బైంసా ప్రాంత విద్యార్థులకు బైంసాలోని ఆల్‌ఫోర్స్,వేదం, వాసవి పాఠశాలలు పరీక్ష కేంద్రాలుగా ఉండగా, నిర్మల్ ప్రాంత విద్యార్థులకు నిర్మల్‌లోని సెయింట్ థామస్ హైస్కూల్, విజయ హై స్కూల్‌లో కేంద్రాలు కేటాయించారు. ఖానాపూర్ ప్రాంత విద్యార్థులకు నిర్మల్ దివ్య నగర్‌లోని వాసవి హైస్కూల్ పరీక్ష కేంద్రాంగా ఉంటుంది. ప్రతి గదిలో 24 మంది విద్యార్థులకు చొప్పున కేటాయించారు.



## కన్నెపల్లిని మోడల్ గ్రామంగా మారుస్తాం

### కాంగ్రెస్ నాయకుడు జువ్వాజీ అనిల్ గౌడ్

**ప్రజాపక్షం/తిర్యాణి/ ఆసిఫాబాద్ :** తిర్యాణి మండలం కన్నెపల్లి గ్రామ పంచాయతీ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి తుంరం మాన్కును 'బ్యాట్' గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు జువ్వాజీ అనిల్ గౌడ్ కోరారు. శుక్రవారం కన్నెపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పది ప్రధాన హామీలతో కూడిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా అనిల్ గౌడ్ మాట్లాడుతూ కన్నెపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ఐదేళ్ల పాటు ఓటర్లందరి ఇంటి పన్నును తామే భరిస్తామని సంచలన హామీ ఇచ్చారు. గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి మోడల్ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతామన్నారు. అభివృద్ధి కోసం తుంరం మాన్కును భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్, సీనియర్ నాయకులు పెరుమాండ్ల వెంకటేశం గౌడ్, గ్రామ పటేల్ వెడ్మ శంకర్, వెడ్మ మొగిలి, కామెర శంకర్, మహేష్, వెడ్మ లచ్చు, రాయిసిడం సోనేరావు, చుంచు సుషన్, తొంగల సతీష్, తోగరి కుమార్, ఆత్రం హనుమంతరావు, సిడం జంగు, బోర్లకుంట శంకర్, ఇప్ప సంజీవ్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

## పొనకల్ సర్పంచ్‌గా జక్కు సుష్మా భూమేశ్ ఘన విజయం

### అభివృద్ధి, మంచితనమే గెలిపించాయి

**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండలంలోని పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా జక్కు సుష్మా భూమేశ్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. మాజీ సర్పంచ్ జక్కు భూమేశ్ గతంలో చేసిన గ్రామాభివృద్ధి, ప్రజల్లో ఆయనకు ఉన్న మంచి పేరు, సేవా భావం ఈ గెలుపులో కీలకపాత్ర పోషించాయి. ప్రజలు మరోసారి వారి కుటుంబంపై నమ్మకం ఉంచడంతో, ఎన్నికల బరిలో నిలిచిన సుష్మా ఘన విజయం సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జక్కు సుష్మా భూమేశ్ మాట్లాడుతూ తమకు ఈ అవకాశం ఇచ్చిన పొనకల్ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, నిరంతరం అందరికీ అందుబాటులో ఉంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని ఆమె హామీ ఇచ్చారు.





## సర్పంచ్‌గా గెలిపిస్తే ఇంటింటికీ ఉచిత మినరల్ వాటర్ : రాంచందర్

**ప్రజాపక్షం/తిర్యాణి/ఆసిఫాబాద్ :** తిర్యాణి సర్పంచ్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే గ్రామంలోని ప్రతి ఇంటికి ఉచితంగా మినరల్ వాటర్ అందిస్తానని సర్పంచ్ అభ్యర్థి నైతం రామచందర్ హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అనంతరం కొమురం భీమ్ చౌరస్తాలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామచందర్ ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. తన ఎన్నికల గుర్తు 'కత్తెర'ను ఓటర్లకు చూపిస్తూ, భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజలు ఆశీర్వదించి అవకాశం ఇస్తే రానున్న ఐదేళ్లలో గ్రామ పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపిస్తానని స్పష్టం చేశారు. ప్రధానంగా ప్రతి ఇంటికి మినరల్ వాటర్ బాటిళ్లను ఉచితంగా సరఫరా చేస్తానని వాగ్దానం చేశారు. అంతేకాకుండా, సర్పంచ్‌గా తనకు వచ్చే ప్రతి నెల గౌరవ వేతనాన్ని, ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి రూపాయిని పూర్తిగా ప్రజల సంక్షేమం కోసమే ఖర్చు చేస్తానని తెలిపారు. ప్రచార కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మద్దతుదారులు తదితరులు పాల్గొన్నారు.



## పిట్లంలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

**ప్రజాపక్షం/పిట్లం :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం పిట్లం గ్రామంలో పోలీసులు సాయంత్రం 6 గం.లకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డిచ్‌పల్లి 7వ బెటాలియన్ వారితో కలిసి పిట్లం పోలీస్‌స్టేషన్ నుండి గడి హనుమాన్ మందిరం మీదుగా తిమ్మానగర్ రోడ్, శివాజీ విగ్రహం వరకు పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తూ ఎలాంటి బెరుకు, భయం లేకుండా ఓటర్లు తమ ఓటు హక్కును విజయవంతంగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ రూరల్ సిఐ అన్నదేవర తిరుపయ్య, నిజాంసాగర్ ఎస్సై శివకుమార్, పిట్లం ఎస్సై టి.వెంకట్‌రావ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్ అధికారులకు శిక్షణ

**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రంలో శుక్రవారం రైతు వేదికలో ఎన్నికల అధికారులకు ట్రైనర్ ప్రవీణ్ ద్వారా ఎన్నికల నిబంధనలు సూచనలు తెలియచేశారు. డిఎల్‌పిఓ శివ కృష్ణ, ఎంపిడిఓ తిరుమల, పోలింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణకు హాజరయ్యే పోలింగ్ అధికారులు మండల స్థాయి అధికారులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటేసి గ్రామాలు అభివృద్ధి చేసుకుందాం

### నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్, మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి గ్రామాలు అభివృద్ధి చేసుకుందామని నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్, మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలచారి, నియోజకవర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరిరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు సారంగాపూర్ మండల కేంద్రంలో పాటు కౌట్ల(బి), జామ్ గ్రామాలలో గడపగడపకు వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఓటర్లకు బ్యాలెట్ నమూనాను చూపిస్తూ, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వారు ఓటర్లకు వివరంగా తెలియజేశారు. కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేయడం ద్వారానే పల్లె ప్రగతి సాధ్యమవుతుందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో



పాటు మరింత అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని వారు ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధిని ధ్యేయంగా పెట్టుకుని పని చేస్తోందని నాయకులు ఉద్ఘాటించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు సన్నబియ్యం అందిస్తున్న ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని వారు పేర్కొన్నారు. గత టిఆర్ఎస్ పాలనలో సారంగాపూర్ మండలంలో కనీసం ఒక డబుల్ బెడ్‌రూమ ఇల్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇల్లు లేని నిరుపేదలకు ప్రతి గ్రామంలో ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయడం జరిగిందని, అదేవిధంగా రేషన్ కార్డు లేని ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడం జరిగిందని వారు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుందని వెడ్మ బొజ్జు పటేల్, ఇతర నాయకులు భరోసా ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, జెడ్పిటిసి ఫోరం మాజీ అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బొల్లోజి నరసయ్య, సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజ్మొహమ్మద్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు కొట్టె శేఖర్, గాజుల రవికుమార్ పాల్గొన్నారు.

## జిల్లావాసుల ముంగిటకే పోర్టబుల్ ఎక్స్‌రే సేవలు : కలెక్టర్ కుమార్‌దీపక్

**ప్రజాపక్షం/నస్పూర్ :** జిల్లాలోని క్షయ వ్యాధిగ్రస్తులకు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ. 23 లక్షల వ్యయంతో సమకూర్చుకున్న 'పోర్టబుల్ ఎక్స్ రే' మిషన్‌ను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ శుక్రవారం ప్రారంభించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఎస్. అనితతో కలిసి ఆయన ఈ పరికరాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర క్షయ నియంత్రణ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ పరికరాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా ఈ సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ అత్యాధునిక పరికరం ఎఐ టెక్నాలజీతో పనిచేస్తుందని, పరీక్ష చేసిన వెంటనే రిపోర్టు రోగికి, సమీప పిహెచ్‌సి వైద్యులకు చేరుతుందన్నారు. దీనివల్ల ప్రజలకు వ్యయప్రయాసలు తగ్గుతాయని పేర్కొన్నారు. జిల్లాలోని మారుమూల గ్రామాల్లో నివసించే దాదాపు లక్షా 76 వేల మందికి పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేశామని కలెక్టర్ వివరించారు. ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన వారు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, బరువు తక్కువ ఉన్నవారు, హెచ్ఐవీ బాధితులు, క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు ప్రాధాన్యతనిస్తూ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ మిషన్ నిర్వహణ కోసం ఒక సాంకేతిక నిపుణుడు, ఒక సూపర్వైజర్ అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సమన్వయకర్త సురేందర్, డీపీవో ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.





## బొగ్గు ఉత్పత్తిలో భద్రత తప్పనిసరి.. ప్రమాదాల నివారణే లక్ష్యం

### జిఎం మునిగంటి శ్రీనివాస్

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సంస్థ నిర్దేశించిన లక్ష్య సాధనలో సింగరేణి ఉద్యోగులు భద్రతా ప్రమాణాలు పాటించడం ద్వారానే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎస్ఆర్‌పి 1గనిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇన్‌స్పెక్షన్ కమిటీ కన్వీనర్, హెచ్ఆర్‌డి జిఎం ఆర్.విజయ ప్రసాద్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జిఎం రఘుకుమార్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉద్యోగులు భద్రత ఆవశ్యకతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గని 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కొమురయ్య, ఏజెంట్ రవికుమార్, రక్షణ అధికారి విజయ్‌కుమార్, గని మేనేజర్ ఆత్మారం సహాని, ఇన్‌స్పెక్షన్ కమిటీ సభ్యులు రవీందర్, శివశంకర్, శైలేంద్ర కుమార్, రమేష్, మహేంద్రనాథ్, పోషమల్లు, డా.మురళీధర్ రావు, రాజలింగయ్య, శ్రీనివాస్, కిరణ్, రక్షణ అధికారి చంద్రమురళి, పిట్ కార్యదర్శి పి.పరశురాములు, రక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచులకు ఘన సన్మానం

### గ్రామాలలో సంబరాలు

**ప్రజాపక్షం/ఎడపల్లి :** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్, ఎంఎస్సీ ఫారం, బ్రహ్మణపల్లి, దుబ్బతండా గ్రామ పంచాయతీలకు నూతనంగా ఎన్నికైన సర్పంచుల అభ్యర్థులకు శుక్రవారం ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు కలిసి నూతన సర్పంచులను సన్మానించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. జాన్కంపేట్ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన సుంచనకోట అనురాధ రాధాకిషన్ గౌడ్, ఎంఎస్సీ ఫారం సర్పంచ్‌గా ఎన్నికైన జయశ్రీ శ్రీనివాస్‌గౌడ్, బ్రహ్మణపల్లి సర్పంచ్‌గా ఎన్నికైన పురమళ్ల హనుమంతు, దుబ్బతండా సర్పంచ్‌గా ఎన్నికైన మంగ్యా నాయక్ ఈ నలుగురు సర్పంచ్‌లను గ్రామస్తులు, పలువురు నాయకులు కలిసి పూలమాలలు వేసి శాలువాలతో ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి నూతన సర్పంచులు తమ వంతు కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లు సాధించి తీరుతాం.. ఆత్మహత్యలకు పాల్పడొద్దు

### బిసి విద్యార్థి జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు చేరాల వంశీ

**ప్రజాపక్షం/మంచిర్యాల :** బిసి హక్కుల కోసం పోరాడుదాం, కచ్చితంగా రిజర్వేషన్లు సాధించి తీరుతాం, కానీ ఎవరూ ప్రాణత్యాగాలు, ఆత్మహత్యలు చేసుకోవద్దని బిసి విద్యార్థి జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు చేరాల వంశీ పిలుపునిచ్చారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని వివిడిసి డిగ్రీ కళాశాలలో బిసి విద్యార్థి జెఎసి ఆధ్వర్యంలో 'సాయి ఈశ్వరచారి ఆశయసాధన సభ', రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థి, కుల సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాబోయే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం బిసి బిల్లును ప్రవేశపెట్టి, రాజ్యాంగ సవరణ ద్వారా రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఒకవేళ కేంద్రం స్పందించకపోతే, ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంటులో ప్రైవేట్ బిల్లునైనా ప్రవేశపెట్టాలని కోరారు. ప్రభుత్వం విడుదల చేసే ఉద్యోగ నోటిఫికేషన్లలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలన్నారు. రిజర్వేషన్ల సాధన కోసం బిసి మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు తమ పదవులకు రాజీనామా చేసి ఉద్యమంలోకి రావాలని, లేనిపక్షంలో విద్యార్థులు, యువకులు వారి ఇళ్లను ముట్టడిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్, పీడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు తోట రాజేష్ పటేల్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పల్లె భూమేష్, బీసీ నాయకులు డా. చుంచు రాజుకిరణ్, ఉదారి చంద్ర మోహన్ గౌడ్, రంగు రాజేశం, టిఆర్‌పి మహేష్ వర్మ, జాగిరీ రాజేష్, వైద్య భాస్కర్, గుమ్ముల శ్రీనివాస్, పాషా, సుందిళ్ల మల్లేష్, వేముల కిరణ్, అంకం సాగర్, నిరుద్యోగ జెఎసి మహేష్, చిరంజీవి, దినకర్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## జీవరక్షణ అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి

### కేంద్ర విపత్తు నిర్వహణ అధికారులు

**ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్ :** ప్రకృతి విపత్తులు, పరిశ్రమల్లో ప్రమాదాలు వంటి పరిస్థితులకు ఏ క్షణమైనా స్పందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కేంద్ర విపత్తు నిర్వహణ అధికారులు సూచించారు. విపత్తు నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వీడియో కన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కేంద్ర అధికారులు మాట్లాడుతూ,వర్షాలు,వరదలు, అగ్ని ప్రమాదాలు, భూకంపాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు ప్రాణనష్టం తగ్గించేందుకు విపత్తు దళాలు అత్యంత వేగంగా చర్యలు ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణ కేంద్రాల్లో నిరంతరం పాల్గొని ప్రతిసమస్యను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ప్రకృతి విపత్తుల సమయంలో సమాచార మార్పిడి అత్యంత కీలకం అని పేర్కొంటూ,వాతావరణ శాఖ హెచ్చరికలు వచ్చిన వెంటనే ప్రమాద ప్రాంతాల ప్రజలను ముందుగా అప్రమత్తం చేసి,అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు ఆదేశించారు.విపత్తుల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు అవసరమైతే హెలికాప్టర్ సేవలను వినియోగించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.బాధితులకు అవసరమైన మందులు, ఆహారం, అత్యవసర సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా సిద్ధం చేయాలని అన్నారు.కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్,ఆర్డీఓ రత్న కళ్యాని,అగ్ని మాపక అధికారి ప్రభాకర్ తో పాటు ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల సామాగ్రి పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి

### కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/వేమనపల్లి/చెన్నూర్ :** జిల్లాలో ఈనెల 14న జరగనున్న రెండో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం ఎన్నికల సామాగ్రి పంపిణీని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వేమనపల్లి మండల కేంద్రంలోని ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని ఎంపీడీవో కుమారస్వామితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది శనివారం (13వ తేదీన) నిర్దేశిత సమయానికి కేంద్రాల్లో రిపోర్ట్ చేయాలని, అక్కడి నుంచే సామాగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలిస్తామని సూచించారు. రెండో విడతలో బెల్లంపల్లి, భీమిని, కన్నేపల్లి, నెన్నెల, కాసిపేట, తాండూర్, వేమనపల్లి మండలాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు, అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుండి కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందని వివరించారు. వెబ్ కాస్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో ఎన్నికలను పటిష్టంగా పర్యవేక్షిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అధికారులు ఎక్కడా అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా ముగిసిన మొదటి విడత ఎన్నికలు

### రెండవ, మూడవ విడత ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి
### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ :** టీం వర్క్ తో అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా మొదటి విడత ఎన్నికలు సజావుగా ముగిశాయని ఈ నెల 14, 17వ తేదీన జరిగే రెండు, మూడవ విడత ఎన్నికలను అదే రీతిలో జరిగేలా అధికారులంతా పని చేయాలనీ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. రెండవ, మూడవ విడత ఎన్నికల నిర్వహణ మీద ఎంపీడీవో, తహసీల్దార్, ఇతర పోలింగ్ అధికారులతో కలెక్టర్ శుక్రవారం గూగుల్ మీటింగ్ ద్వారా రివ్యూ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీం వర్క్ తో అన్ని శాఖల సమన్వయంతో పనిచేశారని, మొదటి విడత పోలింగ్ విజయవంతంగా పూర్తి చేసుకోవడానికి సహకరించిన అన్ని శాఖల సిబ్బందికి
ముఖ్యంగా విద్యాశాఖ నుండి పెద్ద ఎత్తున పాల్గొన్న టీచర్లకు జిల్లా పంచాయతీ శాఖ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రెండవ, మూడవ విడత పోలింగ్ ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లను సరిగ్గా నిర్వహించాలని చెక్ లిస్ట్ ప్రకారం పోలింగ్ మెటీరియల్ పంపిణి జరగాలని, పోలింగ్ కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు ఉండాలని, ఓటింగ్ కి సంబందించి ఇచ్చే నివేదిక లన్ని పూర్తి సమాచారం తో ఉండాలన్నారు. ఈ అంశం మీద అక్కడ ఉండే పోలింగ్ అధికారులు ఓటర్ల కు తెలియజేయాలన్నారుపోలింగ్ అయిపోగానే రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కౌంటింగ్ ప్రక్రియ జాగ్రత్త గా జరగాలన్నారు.
వేగవంతంగా జరిగేందుకు అవసరమగు సిబ్బంది ని నియమించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియ వెంటనే చేయాలన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ, మండల స్పెషల్ అధికారులు సమన్వయముగా పని చేసి పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు.

## శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగం

### నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని, సమస్యాత్మకమైన, అతి సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్ల గుర్తించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయిచైతన్య అన్నారు. శుక్రవారం డిచ్‌పల్లి సర్కిల్ క్యాంపు కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఎన్నికల రెండవ విడత నిర్వహణలో భాగంగా నిజామాబాద్ డివిజన్ పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించే విదంగా ప్రతి ఒక్కరు ఎన్నికల నియమావళిని తూ.చా. తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి నిర్దిష్ట దూరంలో మార్కింగ్ చేయించి, ప్రచారం, గుర్తులను ప్రదర్శించడం నివారించాలన్నారు. అవసరాన్ని బట్టి స్ట్రైకింగ్ ఫోర్సు సేవలను వినియోగించుకొని గుంపులను చెదరగొట్టాలన్నారు. ఎన్నికలను ప్రభావితం చేసే డబ్బు, మద్యం మరే ఇతరాలు అక్రమ రవాణా జరగడానికి వీలులేకుండా అంతర్ రాష్ట్ర, అంతర్‌జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. విలేజ్ పోలీసు అధికారులు ఆయా గ్రామాలపై నిఘా ఉంచి, ముందస్తు సమాచారాన్ని సేకరించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఏసిపి వెంకట్ రాంరెడ్డి, నిజామాబాద్ నార్త్ రూరల్ సిఐ శ్రీనివాస్, నిజామాబాద్ సౌత్ రూరల్ సిఐ సురేష్, డిచ్‌పల్లి సిఐ వినోద్, ధర్పల్లి సిఐ భిక్షపతి, నిజామాబాద్ రూరల్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్, డిచ్‌పల్లి ఎస్ఐ ఆసిఫ్, జక్రాన్‌పల్లి ఎస్ఐ మహేశ్, ఇందల్వాయి ఎస్ఐ సందీప్, మాక్లూర్ ఎస్ఐ రాజశేఖర్, సిరికొండ ఎస్ఐ రామకృష్ణ, ధర్పల్లి ఎస్ఐ కళ్యాణి, ముగ్పాల్ ఎస్ఐ సుస్మిత తదితరులు పాల్గొన్నారు.



# క్రీడ

## విండీస్‌పై రెండో టెస్టులో విజయం..


### సిరీస్‌లో కివీస్‌కు ఆధిక్యం



వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో న్యూజిలాండ్ 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ కేవలం 128 రన్స్‌కే ఆలౌటైంది. కేవలం 56 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన కివీస్.. మూడో రోజు మూడవ సెషన్‌లోపే గెలుపు నమోదు చేసింది. కివీస్ బౌలర్ జాకబ్ డఫీ 38 రన్స్ ఇచ్చి తన ఖాతాలో అయిదు వికెట్లు వేసుకున్నాడు. దీంతో మూడు టెస్టుల సిరీస్‌లో 10 ఆధిక్యంలోకి వెళ్లింది కివీస్. ఫస్ట్ టెస్టు మ్యాచ్ డ్రా అయిన విషయం తెలిసిందే. ఈ సిరీస్‌లో అయిదు వికెట్లు తీసుకోవడం డఫీకి ఇది రెండోసారి. రెండో ఇన్నింగ్స్‌లో డఫీకి తోడుగా మైఖేల్ రే కూడా అద్భుతంగా బౌల్ చేశాడు. అతను 45 రన్స్ ఇచ్చి మూడు వికెట్లు తీసుకున్నాడు. క్రైస్ట్‌చర్చ్‌లో జరిగిన తొలి టెస్టులో అతికష్టంగా మ్యాచ్‌ను డ్రా చేసుకున్న విండీస్ వెల్లింగ్టన్‌లో మాత్రం చేతులెత్తేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 73 రన్స్ వెనుకబడ్డ ఆ జట్టు.. రెండో ఇన్నింగ్స్‌లో పెద్దగా స్కోరు చేయలేక పోయింది. కెవమ్ హాడ్జ్ అత్యధికంగా 35 రన్స్ చేశాడు. వచ్చే గురువారం బే ఓవల్‌లో మూడవ టెస్టు జరగనున్నది.

## 2028 ఒలింపిక్సే లక్ష్యం

### రిటైర్‌మెంట్‌ను వెనక్కి తీసుకున్న వినేశ్ ఫొగాట్..



భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ సంచలన ప్రకటన చేశారు. తన రిటైర్‌మెంట్‌ను వెనక్కి తీసుకున్నారు. ఒలింపిక్ కలను సాకారం చేసుకునేందుకు తిరిగి వస్తున్నట్లు ప్రకటించారు. వినేశ్ ప్రకటనతో ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా వినేశ్ పోస్టు పెట్టారు. 'ప్యారిస్ ఒలింపిక్స్‌తో నా రెజ్లింగ్ జర్నీ ముగిసిందా అని ప్రజలు ఇప్పటికీ అడుగుతూనే ఉన్నారు. ఈ ప్రశ్నకు నేను ఇప్పటికీ సమాధానం చెప్పలేకపోయాను. నేను రెజ్లింగ్ మ్యాట్, ఆ ఒత్తిడి, అంచనాల నుంచి, నా సొంత ఆశయాలకు కూడా కొంతకాలం దూరంగా ఉండాల్సి వచ్చింది. ఇన్నేళ్లలో మొదటిసారిగా నేను కాస్త ఊపిరిపీల్చుకోగలిగాను. నా సుదీర్ఘ ప్రయాణంలోని ఎత్తుపల్లాలను అర్థం చేసుకోవడానికి నేను కొంత సమయం తీసుకున్నాను. నేను కెరీర్‌లో ఎన్నో ఎత్తులు చూశాను. అందులో ఈ ప్రపంచం ఎన్నడూ చూడని హృదయ విదారకర ఘటనలు, త్యాగాలు ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ చూసిన తర్వాత నేను ఓ సత్యాన్ని తెలుసుకున్నాను. నేను ఇప్పటికీ ఈ క్రీడను ప్రేమిస్తున్నాను. ఇప్పుడు మళ్లీ బరిలోకి దిగాలని అనుకుంటున్నాను. ఈ సారి నేను ఒంటరిగా బరిలోకి దిగట్లేదు. నా వెంట నా కొడుకు వస్తున్నాడు. నన్ను ప్రోత్సహించేందుకు నా కొడుకు సిద్ధమయ్యాడు. లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్స్‌లో కలుద్దాం' అంటూ తన పోస్టులో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.

## కోల్‌కతాలో 70 ఫీట్ల ఎత్తైన మెస్సీ విగ్రహం



ఫుట్‌బాల్ లెజెండరీ ప్లేయర్ లియోనిల్ మెస్సీ.. ఇండియాకు వస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఆయన కోల్‌కతా చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని లేక్ టౌన్ వద్ద సుమారు 70 అడుగుల ఎత్తైన మెస్సీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. శ్రీ భూమి స్పోర్టింగ్ క్లబ్ ఆ అర్జెంటీనా సూపర్‌స్టార్ విగ్రహాన్ని తయారు చేయించింది. మెస్సి విగ్రహంలో అతను ఫిఫా వరల్డ్‌ప్ ట్రోఫీని పట్టుకుని ఉన్నాడు. మాంటీ పాల్స్ బృందం ఆ విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. గోట్ టూరులో భాగంగా మెస్సీ ఇండియా వస్తున్నారు. కోల్‌కతాతో పాటు ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ నగరాల్లో మెస్సీ టూరు చేయనున్నారు. లేక్ టౌన్ వద్ద ఇనుముతో విగ్రహాన్ని రూపొందించారు. మెస్సీ కుటుంబసభ్యుల కటౌట్లు, స్టాచ్యూలు కూడా ఉన్నాయి. ప్రపంచంలోనే ఇది అత్యంత ఎత్తైన మెస్సీ విగ్రహమని బెంగాల్ మంత్రి తెలిపారు.

## దుబాయ్‌లో దుమ్మురేపాడు

14 సిక్సర్లు, 9 ఫోర్లతో 171 రన్స్.. వైభవ్ సూర్యవంశీ ధమాకా ఇన్నింగ్స్



వైభవ్ సూర్యవంశీ దుమ్మురేపాడు. బౌండరీలతో హోరెత్తించాడు. సిక్సర్లు, ఫోర్లతో దుబాయ్ మైదానంలో చెలరేగిపోయాడు. ఆసియాకప్ అండర్19 టోర్నీలో భాగంగా శుక్రవారం యూఏఈతో జరుగుతున్న మ్యాచ్‌లో 171 రన్స్ చేసి ఔటయ్యాడు. వైభవ్ తన సూపరఫాస్ట్ ఇన్నింగ్స్‌లో 14 సిక్సర్లు, 9 ఫోర్లు బాదాడు. తృటిలో అతను డబుల్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. కేవలం 95 బంతుల్లోనే సూర్యవంశీ 171 కొట్టాడు. అండర్19 క్రికెట్‌లో అత్యధిక స్కోరు చేసిన రెండవ ఇండియన్ బ్యాటర్‌గా సూర్యవంశీ నిలిచాడు. తన ధమాకా ఇన్నింగ్స్‌తో వైభవ్ రికార్డులు బద్దలు కొట్టాడు. అండర్19 ఆసియాకప్‌లో అత్యధిక సంఖ్యలో ఓ ఇన్నింగ్స్‌లో సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా నిలిచాడతను. గతంలో 2017లో ఆఫ్ఘనిస్తాన్ బ్యాటర్ దార్విష్ రసూలీ అత్యధికంగా 10 సిక్సర్లు బాదాడు. మరో ఆసియా రికార్డును కూడా బ్రేక్ చేశాడు సూర్యవంశీ. ఆసియాకప్‌లో తన పవర్ హిట్టింగ్‌తో ఆకట్టుకున్న వైభవ్.. అత్యధిక సిక్సర్ల సంఖ్యను కూడా తన పేరిట రాసుకున్నాడు. ఆసియాకప్ అండర్19 టోర్నీలో రసూలీ ఇప్పటి వరకు 22 సిక్సర్లు బాదాడు. ఆ సంఖ్యను దాటేసిన వైభవ్ ఆ టోర్నీలో ఇప్పటికే 26 సిక్సర్లు కొట్టేశాడు.

శుక్రవారం జరుగుతున్న గ్రూప్ ఏ మ్యాచ్‌లో తాజా సమాచారం ప్రకారం ఇండియా 40 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 311 రన్స్ చేసింది. ప్రస్తుతం వేదాంత త్రివేది, విహాన్ మల్హోత్రా క్రీజ్‌లో ఉన్నారు.

# ఫోకస్ సైన్స్

## 'సిపి' ఉల్లంఘన



సెర్న్‌లో శాస్త్రవేత్తలు ఒక కొత్త రకమైన 'కాస్మిక్ పారిటీ సిమెంట్రీ' (సిపి) ఉల్లంఘనను గుర్తించారు. అత్యంత సూక్ష్మ దశలో పదార్థం (మ్యాటర్), కాంతి (లైట్), జీవం (లైఫ్)కు చోటు కల్పించే తత్వాన్ని కనుగొన్నారు. ఇవే దాదాపు మొత్తం కనిపించే పదార్థాన్ని నిర్మించే కణాలు. బిగ్ బ్యాంగ్ జరిగిన వెంటనే పదార్థం, ప్రతిపదార్థం సమానంగా సృష్టించబడి ఉండాలి. ఈ రెండూ పరిపూర్ణ సమతౌల్యంలో ఉండి పరస్పరం పూర్తిగా నిర్మూలించుకోవాలి. కానీ, ఒక చిన్న అసమతౌల్యం మిగిలిపోయిందనే విషయాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. అదే పదార్థం బ్రతకడానికి, నక్షత్రాలు, గ్రహాలు, చివరకు జీవం ఏర్పడటానికి దారిచూపించి ఉండవచ్చని నమ్ముతున్నారు. మనల్ని నిర్మించే ఈ అతి ప్రాథమికమైన కణాల్లో ఇలాంటి అసమమితి కనిపించడం ఇదే మొదటి సారి. విశ్వం అసలు ఎందుకు ఉంది అన్న ప్రశ్నకు ఇది ఒక లోతైన సంకేతాన్ని అందిస్తున్నది.

## ఎన్నో కాలాలు!






మనకు తెలిసినవి భూత, భవిష్యత్, వర్తమాన కాలాలు. మరో విధంగా చెప్పాలంటే, గతం, వర్తమానం, భవిష్యత్తు.. ఏ పరిణామమైనా ఈ పరిధిలోకే వస్తుంది. కానీ, ఇంతకు మించిన కాలాలు లేదా స్థల పరిమాణాలు ఉన్నాయని భౌతిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. సమయానికి వెలుపల, ఎన్నో పైస్థాయి కాలాలు లేదా పరిణామాలు ఉండవచ్చని ఊహిస్తున్నారు. ప్రతి అదనపు పరిమాణం మనం తెలిసిన విశ్వానికి కొత్త అంశాలను జతచేస్తున్నది. వీటిలో పదో ఒక పరిమాణం అత్యంత ఆశ్చర్యకరం. దీనిని, ప్రతి సాధ్యమైన కాలరేఖ, ప్రతి ప్రత్యామ్నాయ విశ్వం, ప్రతి వాస్తవికత ఒకేసారి ఉన్న స్థాయిగా అభివర్ణిస్తున్నారు. ఇక్కడ అనంత సంఖ్యలో భూములు ఉంటాయి. అంటే, అనంత మార్పులు.. కాలాలు కూడా ఉంటాయి. పరిణామాలు ఎన్నో విభిన్న సందర్భాల్లో కొనసాగుతుంటాయి. కొన్ని విశ్వాలు మన విశ్వాన్ని దగ్గరగా పోలి ఉంటాయి. మరికొన్ని పూర్తిగా భిన్నమైన భౌతిక సూత్రాలతో పనిచేస్తాయి. ఈ ఆలోచనను పరిశీలించడం అనేది మన ఉనికిపై ఉన్న అవగాహనను అనంతరంగా విస్తరిస్తుంది. వాస్తవం మన ఊహించిన దాని కంటే ఎంత పెద్దది, క్లిష్టమైనది, పొరలతో నిండినదో ఈ కొత్త సిద్ధాంతం చూపిస్తుంది.

## ఖగోళ మర్మాన్ని ఛేదిస్తారా?

ఈ విశ్వం... మానవ మేధస్సుకు సవాళ్లు విసురుతున్న అంతుచిక్కని రహస్యం. మనిషి నిరంతర అన్వేషణతో ఎన్నో ప్రశ్నలకు సమాధానలు కనుగొన్నాడు. మూఢ నమ్మకాలను చెదరగొట్టే ఆవిష్కరణలు చేశాడు. కానీ, ఇప్పటికీ ఇంకా అనేక లోతైన అంశాలపై అవగాహన లేదు. ప్రత్యేకించి, విశ్వం ఎందుకు ఉద్భవించింది?



ఎందుకు పదార్థంతో నిండి ఉంది? ఎందుకు శూన్యంగా లేదు? అనే ప్రశ్నలు పదేపదే వేధిస్తున్న నేపథ్యంలో, న్యూక్లియర్ పరిశోధనలు నిర్వహించే 'సెర్న్' శాస్త్రవేత్తలు సమాధానాలను వెతికే పనిలో పడ్డారు. ఈ ఖగోళ మర్మాన్ని ఛేదించడానికి అతి చేరువలోకి వచ్చారు. వారి అధ్యయన నివేదికను అనుసరించి, బిగ్ బ్యాంగ్ జరిగిన మొదటి క్షణాల్లో ప్రతిపదార్థంపై పదార్థం ఎలా గెలిచిందో చెప్పగలిగే సంకేతాలు వారి ప్రయోగాల్లో కనిపిస్తున్నాయి. అదే మనం తెలిసిన విశ్వానికి రూపమిచ్చింది. అయితే, ఈ కొత్త ఫలితాలు పదార్థం మరియు ప్రతిపదార్థం (మ్యాటర్ అండ్ యాంటీ మ్యాటర్) ప్రవర్తనల మధ్య ఉన్న అతి సూక్ష్మ తేడాలను కొలిచిన ఖచ్చితమైన ప్రయోగాల నుండి వచ్చాయి. నక్షత్రాలు, గ్రహాలుసహా అన్నిటినీ నిర్మించేది పదార్థమే. ప్రతిపదార్థం దాదాపు అలాగే ప్రవర్తించినా, పదార్థాన్ని తాకిన వెంటనే నశించిపోతుంది. ఈ అసమతౌల్యమే దశాబ్దాలుగా శాస్త్రజ్ఞులను అయోమయంలో పడేసింది. సెర్న్‌లో జరిగిన తాజా ప్రయోగాలు కణ భౌతికశాస్త్రంలో పదార్థాన్ని మద్దతు ఇచ్చే ప్రాథమిక వ్యవస్థలు ఉండవచ్చని సూచిస్తున్నాయి. ఇవే విశ్వం పూర్తిగా మాయమవకుండా కాపాడి ఉండవచ్చు. ఈ ఆవిష్కరణ కేవలం సిద్ధాంతం మాత్రమే కాదు.... విశ్వం ఎందుకు ఉందో అర్థం చేసుకోవడం భౌతిక శాస్త్రం, ఖగోళ శాస్త్రంతోపాటు వాస్తవికతపై ఉన్న అవగాహనను పూర్తిగా మార్చే అవకాశాన్ని కూడా కల్పిస్తుంది. ఇది పాత ఊహాగానాలను సవాలు చేస్తుంది.. ప్రస్తుత అవగాహనను మెరుగుపరుస్తుంది... సృష్టి గురించి కొత్త సిద్ధాంతాల దారిని తెరుస్తుంది. గతంలో పరోక్ష సూచనలపై ఆధారపడ్డ ప్రయత్నాలతో పోలిస్తే, ఈ ప్రయోగాలు పాఠ్యపుస్తకాలను సైతం మార్చగలిగిన స్పష్టమైన డేటాను అందిస్తున్నాయి. భవిష్యత్ శాస్త్రజ్ఞులను ప్రేరేపించగల శక్తి వీటిలో ఉంది. ప్రత్యేకించి, ఇది మనిషి ఆసక్తి ఎంత దూరం వెళ్తుందో గుర్తు చేస్తుంది. ఊహించలేని వేగంతో కణాలను ఢీకొట్టి వాటి క్షణకాలిక పరస్పర చర్యలను పరిశీలించడం ద్వారా, గెలాక్సీలు, నక్షత్రాలు, జీవం అన్నిటినీ సృష్టించిన శక్తులను నేరుగా చూస్తున్నాం. విశ్వం తన రహస్యాలను కొంచెం కొంచెంగా తెరిచి చూపుతోంది. మన ఉనికిని సాధ్యంచేసిన నియమాలను అర్థం చేసుకునే స్థితికి మనం చేరుకుంటున్నాం. సెర్న్‌లోని ఈ క్షణం కేవలం ఒక శాస్త్రీయ సాధనతోనే సరిపుచ్చకుండా, విశ్వాన్ని చూసి ఆశ్చర్యపోవడానికి ఒక ఆహ్వానాన్ని కూడా ఇస్తున్నది. విశ్వం ఎలా ప్రారంభమైంది? అందులో ఉన్న ప్రతి దానిని నడిపించే సూత్రాలు ఏవి? అనే ప్రశ్నలకు సమాధానం లభించే రోజు త్వరలోనే వస్తుందని ఆశిద్దాం.




## చండూరులో సిపిఐకి మూడు ఉపసర్పంచ్ స్థానాలు






ప్రజాపక్షం/చండూరు: నల్లగొండ జిల్లా చండూరు మండలం కస్తాలలో సిపిఐ సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ పదవులను కైవసం చేసుకుంది. కస్తాల, పుల్లెంల , కొండాపురం గ్రామాలలో సిపిఐ ఉపసర్పంచ్ పదవులను కాంగ్రెస్ మద్దతుతో ఎన్నికైయ్యారు. కస్తాల సర్పంచ్ లేదన్న సత్యం (సిపిఐ), ఉపసర్పంచ్‌గా కట్ట స్వర్ణ (సిపిఐ), పుల్లెంల సర్పంచ్‌గా ముక్కముల వెంకన్న (కాంగ్రెస్), ఉప సర్పంచ్‌గా చెడుబుద్ది ఊషయ్య (సిపిఐ), కొండాపురం సర్పంచ్‌గా గిరి కరుణాకర్ (కాంగ్రెస్), ఉప సర్పంచ్‌గా గడ్డం యాదయ్య (సిపిఐ) ఎన్నికైయ్యారు. చండూరు మండలంలో సిపిఐ, కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేసిన నాయకులకు సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఖమ్మంలో సిపిఐ ఉపసర్పంచ్‌లు ..





ప్రజాపక్షం/చింతకాని : ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో సిపిఐ 5 సర్పంచ్ స్థానాలు గెలుపొందగా రాఘవాపురం, బస్వాపురం ఉపసర్పంచ్‌లు సిపిఐ గెలుపొందగా చిన్నమండవ, నాగిలిగొండలో కోరం లేక ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడింది. బస్వాపురం ఉసపసర్పంచ్‌గా చంద్రకాని నర్సింహారావు ఎన్నికవ్వగా, రాఘవాపురం ఉప సర్పంచ్‌గా అబ్బూరి ఉమా మహేశ్వరరావు(మహేష్) ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గాలను సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయకార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లిఖార్జునరావు, కూచిపుడి రవి అభినంధించారు.

## సర్పంచ్‌గా ఎన్నికైన కర్రె లక్ష్మికి సన్మానం



ప్రజాపక్షం/ఎల్కతుర్తి : హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి మండలంలో గోపాల్‌పూర్ గ్రామ సర్పంచ్‌గా కర్రే లక్ష్మి బిక్షపతి అత్యధిక మెజార్టీతో సిపిఐ అభ్యర్థిగా గెలుపొందారు. శుక్రవారం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారపాక అనిల్, సిపిఐ ఎల్కతుర్తి మండల కార్యదర్శి రాజ్‌కుమార్, బికెఎం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రే లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు మునిగాల బిక్షపతి కర్రే లక్ష్మి భిక్షపతిలను శాలువాతో సన్మానించారు.

## యువతతోనే గ్రామాల ప్రగతి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ



ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ : యువతతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ రెండోవిడత ఎన్నికల్లో భాగంగా శుక్రవారం నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం తానాకుర్దు గ్రామంలో పశ్య పద్మ ప్రచారం నిర్వహించారు. తానాకుర్ద్ గ్రామ సర్పంచ్‌గా పోటీచేస్తున్న జలందర్‌రెడ్డిని గెలిపించాలని గ్రామంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ గ్రామ అభ్యుదయానికి, గ్రామ ప్రజలతో మమేకమయ్యే జలందర్‌రెడ్డిని గెలిపించాలని, కత్తెర గుర్తుపై ఓటేయాలని కోరారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న బిజెపి బలపరిచిన అభ్యర్థులను ఓడించాలన్నారు. గ్రామ అభివృద్ధికి వార్డు సభ్యులుగా పోటీచేసిన వారికి అండగా నిలిచేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జలందర్‌రెడ్డిని సిపిఐ బలపరిచిందన్నారు. సర్పంచ్ అభ్యర్థి జలందర్‌రెడ్డితో పాటు సిపిఐ అభ్యర్థులుగా పోటీచేస్తున్న వార్డుసభ్యులకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్, సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య, అడ్డికె రాజేశ్వర్, సిపిఐ నాయకులు సాయా గౌడ్, కార్యకర్తలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాజుల సాయిబాబా, లక్క గంగారాం, బిసి సంఘం మండల నాయకులు తిరుపతి, సంజీవి, పెరక శ్రీనివాస్, వేల్పూర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## పనిచేసే వారిని ఎన్నుకోండి


### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం

ప్రజాపక్షం/నేలకొండపల్లి: గ్రామ పంచాయతీ ఎన్నికలలో ప్రజల కోసం పని చేసే వారిని ఎన్నుకోవాలని సిపిఐ జాతీయ నాయకులు భాగం హేమంతరావు సూచించారు. ఖమ్మం జిల్లా నేలకొండమల్లి మండలంలోని మోటాపురంలో కూటమి అభ్యర్థి రామారావు విజయం కాంక్షిస్తూ శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాభివృద్ధి పట్ల అంకిత భావంతో పని చేసే నాయకుడిను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మందుల లక్ష్మయ్య. శ్యామిలేటి శ్రీనివాసరావు, నామవరపు శివ. తాళ్లపల్లి వెంకన్న, శ్యామిలేటి కృష్ణ. రవికుమార్, రావెళ్ల కృష్ణారావు, భాగం మురళీ, ఇంటూరి ఆశోక్, గుగులోత్ వీరు, చావా రామయ్య, ఏలూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



## ప్రజల మనిషి ఏషాల అశోక్

### సిపిఐ రాష్ట్ర నాయకుడు గోదా శ్రీరాములు



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : ప్రజల మనిషి ఏషాల అశోక్‌ని గెలిపించాలని సిపిఐ రాష్ట్ర నాయకులు గోదా శ్రీరాములు కోరారు. శుక్రవారం భువనగిరి మండలం బస్వాపురం గ్రామంలో సిపిఐ అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ గోదా శ్రీరాములు ప్రచారం చేశారు. 10 వార్డులలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏషాల అశోక్ 35 సంవత్సరాలుగా విద్యార్థి దశ నుంచి పలు ఉద్యమాలలో పాల్గొన్నాడని, రాష్ట్ర చేనేత సంఘం ప్రధానకార్యదర్శిగా చేనేత కార్మికుల సమస్యలపై పోరాడారన్నారు. బస్వాపురం గ్రామ ఎంపిటిసిగా పైసా ఖర్చు లేకుండా ఎన్నికయ్యాడన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి నిజాయితీగల అశోక్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, సహాయ కార్యదర్శి ఉడత రాఘవులు, నాయకులు వర్రె సాయిలు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టులతోనే గ్రామాలు అభివృద్ధి

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం





ప్రజాపక్షం/వలిగొండ : కమ్యూనిస్టులతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. యాద్రాద్రి జిల్లా వలిగొండ నర్సాపురం గ్రామంలో 8వ వార్డు సిపిఐ అభ్యర్థి ఎల్లంకి మహేష్ గ్యాస్ పొయ్యి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ గ్రామాలలో ఇప్పుడున్న పరిస్థితులలో కమ్యూనిస్టు అభ్యర్థులను గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నిధులు దుర్వినియోగం కాకుండా, అవినీతి జరగకుండా కమ్యూనిస్టులు అడ్డుకుంటారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్ ఉన్నారు. అనం తరం వలిగొండ మండలంలోని నర్సాపురం, దుప్పల్లి, గోపరాజుపల్లి గ్రామాలలో సిపిఐ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కమ్యూనిస్టులు సర్పంచులుగా, వార్డు సభ్యులుగా ఉండాయన్నారు. గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ వరకి కమ్యూనిస్టులు ఉంటేనే ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ గ్రామాలకు ఎమ్మెల్సీగా నా నిధులనుండి కూడా అభివృద్ధి పనులకు ఖర్చుచేస్తానన్నారు. కమ్యూనిస్టు అభ్యర్థులను సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా గెలిపించాలని ఎమ్మెల్సీ సత్యం ఓటర్లను కోరారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, సలిగంజి వీరస్వామి, ఎల్లంకి మహేష్, దుప్పల్లి జావిద్, మాజీ సర్పంచ్ కీసర్ల సత్తిరెడ్డి, సలగంజి కృష్ణ కుమార్, కట్ల యాదగిరి పాల్గొన్నారు.

## ప్రజాతీర్పుకు అనుగుణంగా పనిచేయండి

### వార్డుసభ్యులను సన్మానించిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్



ప్రజాపక్షం/లక్షెట్టిపేట/మంచిర్యాల : మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం దౌడపల్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటింది. ఎన్నికల్లో విజయం సాధించిన వార్డు సభ్యులను శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలవేన శంకర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబడిన సభ్యులు ప్రజా తీర్పుకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో కమ్యూనిస్టులకు ఆదరణ లభించడం అభినందనీయమన్నారు. దౌడపల్లిలో మొత్తం 10 వార్డులకు సిపిఐ బలపరిచిన 7గురు అభ్యర్థులు పోటీ చేయగా, వారందరూ విజయం సాధించడం గర్వకారణమన్నారు. మెజారిటీ సభ్యులు గెలవడంతో ఉపసర్పంచ్ పదవిని సిపిఐ కైవసం చేసుకుందన్నారు. 1వ వార్డు నుంచి గెలిచిన సంతపూరి మధుకర్‌ను ఉప సర్పంచ్‌గా వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. సిపిఐ మండల కార్యదర్శి మేదరి దేవవరం మాట్లాడుతూ సర్పంచ్‌గా తనకు 400 లకు పైగా ఓట్లు వేసి ఆదరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ, ఉపసర్పంచ్, వార్డు సభ్యుల సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తామమ న్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంతపూరి మధుకర్, వార్డుసభ్యులు మూగల దేవేంద్ర, కంది సత్తన్న, అయిత శాంతయ్య(రాజుదాస్), దుర్గం దేవదాస్, ఏ మూరి శ్రీదేవి, సంతపూరి విజయలక్ష్మి తో పాటు సిపిఐ నాయకులు కేతిరెడ్డి రమణారెడ్డి, ఏలియా, మనోజ్, కిరణ్ పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ముల్కనూర్ సర్పంచ్ భారీ మెజార్టీ పట్ల అభినందించిన మంత్రి పొన్నం




**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** ముల్కనూర్ సర్పంచ్‌గా జాలి ప్రమోద్‌రెడ్డి విజయం సాధించడం పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేసి ప్రమోద్ రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందించారు. ముల్కనూర్ సర్పంచ్ ఎన్నికలో ప్రత్యర్థి టిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిపై 2536 ఓట్ల తేడాతో గతంలో ఉన్న రికార్డును బద్దలు కొట్టడం జరిగింది గతంలో టిఆర్ఎస్ అభ్యర్థి 1500 మెజార్టీ సాధించడం ఇప్పటివరకు రికార్డుగా ఉంది. ప్రమోద్‌రెడ్డి యువతలో మంచి క్రేజ్ ఉన్న నాయకుడిగా ఈ అవకాశం ఇవ్వడం వల్ల భారీ మెజార్టీని దక్కించుకున్నారు. మొత్తంగా4159 ఓట్లు సాధించి ప్రత్యర్థి కి 1623 పై భారీ మెజారి దక్కించుకున్నారు .

## మద్యం దుకాణాలు మూసివేత

**ప్రజాపక్షం / జనగామ :** గ్రామ పంచాయతీ రెండో దశ ఎన్నికల సందర్భంగా జనగామ నియోజకవర్గంలోని పలు మద్యం దుఖాణాలను మూసివేశారు. జనగామ పట్టణం, మండలం, బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పులలో మద్యం దుఖానాలను మూసివేశారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి మద్యం విక్రయాలు జరగొద్దని ఎక్సైజ్ అధికారులు ఆదేశించారు.

## గ్రామాభివృద్ధి కోసం పని చేసే వారినే సర్పంచ్‌గా ఎన్నుకోవాలి

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** గ్రామ ప్రజల సమస్యల గురించి, గ్రామ అభివృద్ధి గురించి ఆలోచించే వారినే సర్పంచ్ గా ఎన్నుకోవాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు.ధర్మసాగర్ మండలంలోని కాషగూడెం, రాయగూడెం, తాటికాయల, పెద్ద పెండ్యాల, ఎల్కుర్తి, ధర్మసాగర్ గ్రామాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని, ఇంకో మూడు సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎంపీ కడియం కావ్య ఉన్నారని, తాను ఎమ్మెల్యేగా ఉన్నానని తెలిపారు. గ్రామంలో ఏ అభివృద్ధి కార్యక్రమం జరగాలన్న ప్రభుత్వ సహకారం, ఎమ్మెల్యే సహకారం, ఎంపి సహకారం కావాలని ప్రభుత్వ సహకారం లేకుండా, ఎమ్మెల్యే సహకారం లేకుండా గ్రామములో ఒక చిన్న పని కూడా చేయలేమని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలందరూ ఆలోచించాలని కోరారు. మీరందరూ ఆశీర్వదించి ఆదివారం జరిగే సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచ్‌గా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే వారికి తోడుగా నేనుంటానని, ఎంపి ఉంటారని తెలిపారు. దింతో గ్రామాల అభివృద్ధికి సంబంధించిన నిధులు సమకూర్చడానికి అవకాశం ఉంటదని తెలిపారు. ఎమ్మెల్యేగా నేనున్నానని, అభివృద్ధి చేసే బాధ్యత నాదని తెలిపారు. వేరే పార్టీకి ఓటేసి ఊరును ఆగం చేసుకోవద్దని, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఊరును బాగు చేసుకుందామని కోరారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు, వార్డు అభ్యర్థులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విద్య బలోపేతానికి ప్రజా ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** విద్యను మరింత బలోపేతం చేసేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయ గెస్ట్ హౌస్‌లో రిటైర్డ్ ప్రొఫెసర్ల సంఘం కుర్తా, రిటైర్డ్ నాన్‌టిచింగ్ ఉద్యోగుల సంఘం ఆహ్వానంపై జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. సమావేశ అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ..ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 1000 కోట్ల రూపాయలు మంజూరు చేసిన నిర్ణయాన్ని సమావేశంలో ముందుంచి ప్రశంసించారు. కాకతీయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు కలిసి సమిష్టిగా పని చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు సదానందం, కూరపాటి వెంకట్ నారాయణ, రవీందర్, ఎర్రగట్టు స్వామి, ఎర్రం రామ్ రెడ్డి, సమ్మయ్య, కందకట్ల సుధాకర్, అలాగే విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు నాగేశ్వరరావు, కృష్ణమాచారి, ప్రభాకర్, మల్లయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం : ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులంతా కలిసికట్టుగా పని చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి మండలంలో రామ్ నాయక్ తండా, కొంపల్లి, గుడాడ్ పల్లి, గొర్ల వేడు గ్రామాలల్లో కాంగ్రెస్ పార్టీ బల పరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కోసం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్‌తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల్లో నాయకులు, గ్రామస్తులు శాలువాలు కప్పి స్వాగతం పలికారు. ర్యాలీ తీసి, గ్రామ కూడళ్లలో ఏర్పాటు చేసిన పబ్లిక్ కార్నర్ మీటింగ్ లలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని, భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. గొర్లవేడు గ్రామ సర్పంచ్ అభ్యర్థి రామినేని తులసి రవీందర్ ఉంగరం గుర్తుపై అమూల్యమైన ఓటు వేసి అధిక మెజారిటీ తో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రెండో విడత ఎన్నికల ప్రచారం ముగింపు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలో రెండవ విడత ఎన్నికల ప్రచారం ముగిసింది. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా 14న జరుగనున్న భూపాలపల్లి, పాలపల్లి, చిట్యాల, పలిమెల మండలాలల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. 2వ విడతలో చిట్యాల మండలంలో 26 గ్రామ పంచాయతీలు, 218 వార్డులకు, 25 పంచాయతీలకు, 198వార్డులకు, భూపాలపల్లి మండలంలో 26గ్రామ పంచాయతీలు, 216 వార్డులకు, అదే విధంగా పలిమెల మండలంలో 8 గ్రామ పంచాయతీలకు 62వార్డులకు మొత్తం నాలుగు మండలాలలోని 85 గ్రామ పంచాయతీలకు, 694 వార్డులలో 14న ఎన్నికలు జరగనున్నాయి. మొదటి కాంగ్రెస్ అత్యధిక సర్పంచులు గెలుచుకున్నారు. రెండో విడతలో సైతం కాంగ్రెస్ సత్తా చాటే అవకాశం ఉన్నట్లు మొదటి విడతతో తెలిసిపోయింది.

## నేడు పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామాగ్రి

# కట్టుదిట్టమైన బందోబస్తు



**ప్రజాపక్షం / జనగామ :** మొదటి విడత పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. రెండో విడత ఈ నెల 14న జరగనుండగా అంతా గప్..చుప్ అయ్యింది. ప్రచారం శుక్రవారం సాయంత్రం 5 గంటలతో ముగియడంతో ఇక అభ్యర్థులు పంపకాల్లో నిమగ్నమయ్యారు. మూడో విడత ఈ నెల 17న జరగనుంది. రెండో విడతలో 79 పంచాయతీలు, 710 వార్డులకు ఎన్నికలు జరగనుండగా ఒక పంచాయతీ ఏకగ్రీవం అయ్యింది. మిగతా పంచాయతీలకు పోలింగ్ జరగనుండగా శనివారం సాయంత్రం వరకు పోలింగ్ సామాగ్రి కేంద్రాలకు చేరనుంది. జనగామ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మొదటి విడత 110 పంచాయతీలకు ఎన్నికలు ప్రకటించగా 10 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. 100 పంచాయతీలకు పోలింగ్ జరగడంతో పాటు ఫలితాలు వెలువడ్డాయి. మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారు. రెండో విడతలో జనగామ నియోజకవర్గంలోని జనగామ, బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల మండలాల్లోని 71 పంచాయతీలకు ఎన్నికాలు జరగనుండగా ఏకగ్రీవం అయిన పంచాయతీలకు మినహా మిగతా వాటికి ఎన్నికలు పోలింగ్ జరగనుంది . రెండో విడత పోలింగ్ ఈ నెల 14న జరనుండగా శుక్రవారం సాయంత్రంతో ప్రచారం ముగిసింది. చివరి రోజు కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు పోటాపోటీగా ప్రచారం చేశాయి. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తరిగొప్పుల, నర్మెట ప్రాంతాల్లో ప్రచారం చేయగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు లకావత్ ధనవంతి, మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిలు జనగామలో ప్రచారం చేశారు. కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి బచ్చన్నపేటలో ప్రచారం చేశారు. ఐదు గంటలకు మైక్‌లు మూగబోయాయి. మైక్ శబ్ధాలు మూగబోయినప్పటికీ అంతర్గత మీటింగ్‌లు, పంపకాలు మాత్రం జోరుగానే సాగుతున్న పరిస్థితి. మొదటి విడతలో లోపాల్ని సమీక్షించిన అధికారులు రెండో విడతలో అలాంటి సమస్య తలెత్తవద్దనే ఉద్దేశ్యంతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్, బిఆర్ఎస్ మద్య తీవ్ర స్థాయిలో గొడవలు జరిగాయి. జనగామ, బచ్చన్నపేట, నర్మెట మండలాల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ శ్రేణులు గొడవలకు దిగాయి. కేసులు సైతం నమోదైన పరిస్థితి. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. ఒకే రోజు పోలింగ్ కౌంటింగ్ కావడంతో కూడా సమస్యలు తలెత్తుతున్నాయి. దీనితో జనగామ నియోజకవర్గ పరిధిలోని అన్ని పంచాయతీల్లో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. రెండో విడత పోలింగ్ ఆదివారం జరగనుండడంతో పోలింగ్ సామాగ్రి శనివారం సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాలను చేరనుంది. గ్రామ పంచాయతీలకు పంపించే బ్యాలెట్ బాక్స్‌లు, పేపర్లు మండల కేంద్రాల్లోని ఎంపిడిఓ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాల వద్ద పంపణీ చేస్తున్నారు. ఉదయం 10 గంటల నుండే సమాగ్రి పంపణీ చేయనుండగా మధ్యాహ్నం వరకే కేంద్రాలకు చేరుకోనున్నారు.

## బాధితులకు సకాలంలో పరిహారం అందించాలి : కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ :** అత్యాచార కేసుల్లో బాధితులకు పరిహారాన్ని సకాలంలో అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్ని అత్యాచార కేసులు నమోదయ్యాయి, ఛార్జ్‌షీట్ చేయడానికి ఎన్నిరోజులు పడుతుంది, ఇప్పటి వరకు ఎన్ని కేసులు పెండింగ్ లో ఉన్నాయి, బాధితులకు పరిహారం చెల్లింపు, తదితర అంశాలను గురించి జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ఇతర అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ అత్యాచార బాధితులకు పరిహారం చెల్లింపులో ఆలస్యం జరగకుండా చూడాలన్నారు. ప్రతి రెండు నెలలకోసారి కమిటీ సమావేశం కావాలని, ఆ సమావేశంలో చర్చించే అంశాలను ముందస్తుగా తెలియజేయాలన్నారు. అత్యాచార ఘటనలు జరగకుండా అవగాహన కార్యక్రమాలను అధికారులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డిడి నిర్మల, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ప్రేమకళా, బిసి సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, సిఎంఒ సుదర్శన్ రెడ్డి, సిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ సంజీవ రావు, ఇన్‌చార్జి డిసిపిఓ ఎస్ ప్రవీణ్ కుమార్, ఐసిసింధు రాణి, డివిఆక్ట్ కౌన్సిలర్ పావని, భరోసా ఎస్ఐ కె శ్రీలత, పిఎంహెచ్ఎన్ డాక్టర్ రూబీనా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇందిర, శైలజ, మానస, స్వర్ణ, రజిత తదితరులు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా చెత్త శాంపిల్‌ల సేకరణ

బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** సమర్థవంతంగా చెత్త శాంపిల్‌ల సేకరణ చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. శుక్రవారం వరంగల్ పరిధి పోతననగర్‌లో గల బయో మిథనైజేషన్ ప్లాంట్‌తో పాటు ఎన్ఐయుఎ వారు సేకరిస్తున్న చెత్త శాంపిల్స్ తీరును కమిషనర్ పరిశీలించి సమర్థవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏ రకమైన చెత్త వస్తుందో అధ్యయనం నిర్వహించి నివేదిక ఇవ్వడానికి వీలుగా ఎన్ఐయుఎ వారు నగరంలోని వివిధ ప్రాంతాల నుండి చెత్త శాంపిల్స్‌ను సేకరించి ఆ ప్రాంతం నుండి ప్లాస్టిక్ కాగితం, ఆహార పదార్థాలు తదితర వ్యర్థాలను సేకరించి అందులో గల రసాయనాలను గుర్తించి ఆ ప్రాంతంలో ఏ రకమైన చెత్త వ్యర్థాలు వస్తున్నాయో గుర్తించడం వవలన భవిష్యత్తులో ఆ ఏరియాలో ఎలాంటి ప్లాంట్‌లు ఏర్పాటు చేయడానికి అనుకూలమే రిపోర్ట్ అందజేస్తాని ఇందులో భాగంగా కేటగిరైజేషన్ సెగ్రిగేషన్ చేపడతారని ఈ ప్రక్రియను ప్రతి సంవత్సరం చేపట్టడం వలన ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ సూపర్‌వైజర్‌లు గోల్కొండ శ్రీను, నరేందర్‌తో సానిటరీ ఇన్స్‌స్పెక్టర్లు మధుపాల్గొన్నారు.

## యోగ, ఆయుష్ సేవల విస్తరణపై ప్రశ్నించిన ఎంపి కావ్య




ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : దేశంలో యోగా ప్రచారం, హర్బల్ ఔషధాల నాణ్యత, గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్ సేవల విస్తరణ వంటి కీలక అంశాలపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఈ అంశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతున్నారో తెలియజేయాలన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నిర్వహించిన జాతీయ, ప్రాంతీయ యోగా క్యాంపైన్ల వివరాలు, వాటిలో పాల్గొన్న వారి సంఖ్య, కేటాయించిన బడ్జెట్‌ను వెల్లడించాలన్నారు. దేశంలో హర్బల్ ఔషధాల నాణ్యత ప్రమాణాలు పాటించేలా ప్రభుత్వం ఎలాంటి పర్యవేక్షణ వ్యవస్థ అమలు చేస్తోంది? లైసెన్స్ పొందిన తయారీదారుల సంఖ్య ఎంత? గ్రామీణ ప్రాంతాల్లో కనిపిస్తున్న కొరతను నివారించేందుకు ఏ చర్యలు తీసుకున్నారో అనే అంశాలపై ఎంపి డాక్టర్ కడియం కావ్య స్పష్టత కోరారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్ సేవల విస్తరణలో ఆయుష్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు చేరవేయడానికి ప్రభుత్వం ఎన్ని మొబైల్ యూనిట్లు పంపిణీ చేసింది? ఇప్పటివరకు ఎన్ని గ్రామాలు వీటి పరిధిలోకి వచ్చాయి? స్థానిక స్వయం సహాయక సంఘాలతో చేపట్టిన సహకార కార్యక్రమాలపై వివరాలు ఇవ్వాలని కోరారు.ఈ మేరకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నలకు కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి గణపత్రావ్ జాదవ్ సమాధానమిచ్చారు.2025 అంతర్జాతీయ యోగా దినోత్సవం "వన్ ఎర్త్ వన్ హెల్త్" థీమ్‌తో నిర్వహించగా, విశాఖపట్నంలో ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన మహార్యాలీకి 3.02 లక్షల మంది హాజరయ్యారని మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా 13.64 లక్షల యోగ సంగమ్ ఈవెంట్లు నిర్వహించబడినట్లు చెప్పారు. 2024 యోగా దినోత్సవం "యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సేఫ్టీ" థీమ్‌తో శ్రీనగర్‌లోని దాల్ సరస్సుపై 7,000 మంది పాల్గొన్న ప్రధాన కార్యక్రమం నిర్వహించగా, జమ్మూ–కాశ్మీర్ జిల్లాల్లో మరో 20,000 మంది పాల్గొన్నారని తెలిపారు. పుణే, సూరత్, బోధ్ గయాల్లో జరిగిన ప్రీ–ఈవెంట్లకు వేలాది మంది హాజరయ్యారని వివరించారు. 2024–25లో యోగ, ఆయుష్ ప్రచారం కోసం ఐఈసీ పథకం కింద రూ.43.20 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు .హర్బల్, ఆయుష్ మందులకు ప్రమాణాలు నిర్ణయించే బాధ్యత ఫార్మకోపియా కమిషన్‌దని మంత్రి తెలిపారు. ఉత్పత్తి, ఎగుమతులు, మౌలిక వసతులు బలోపేతానికి "ఆయూష్" పథకం క్రింద చర్యలు చేపట్టారని చెప్పారు. 34 రాష్ట్ర ల్యాబ్‌లు అప్‌గ్రేడ్ చేయబడి, 108 ల్యాబ్‌లు టెస్టింగ్ కోసం లైసెన్స్ పొందినట్లు వెల్లడించారు.జాతీయ ఆయుష్ మిషన్ కింద 150 గిరిజన గ్రామాలకు మొబైల్ యూనిట్లు వెళ్లి, 3 లక్షల మందికి ఆరోగ్య పరీక్షలు, మందులు, యోగ తరగతులు అందించాయని మంత్రి తెలిపారు. 'ఆయుష్ గ్రామం' ప్రాజెక్ట్ ద్వారా స్వయంసహాయక సమూహాలతో కలిసి ఆరోగ్య అవగాహన, జీవనశైలి మార్పులు, ఇంటివద్ద హర్బల్ చికిత్సలపై ప్రచారం జరుగుతుందని చెప్పారు.

**ఎంపి కావ్య ఆందోళనకు కేంద్ర ప్రభుత్వం హామీ:** గ్రామీణ ప్రాంతాల్లో సమగ్ర హోలిస్టిక్ హెల్త్ సేవల లోటు ఉన్నదన్న వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం స్పందించి, ఆయా సేవల విస్తరణపై చర్యలు కొనసాగిస్తామని కేంద్ర మంత్రి తెలిపారు.

## పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలి

వరంగల్ కలెక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ వరంగల్ :** పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు. ఎయిర్‌పోర్ట్, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ పనుల పురోగతిపై సమీక్ష జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద , కమిషనర్, ఆర్ అండ్ ఆర్, ల్యాండ్ అక్విజెషన్, ఐక్యాడ్ శివకుమార్ నాయుడుతో కలిసి వరంగల్ ఎయిర్‌పోర్ట్ , కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా వారు ఎయిర్పోర్ట్, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ ప్రాజెక్టు నిర్వహణ, విధి విధానాల గురించి సంబంధిత అధికారులతో సమీక్షించారు. . ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి , వరంగల్ ఆర్డీఓ సుమ, కలెక్టరేట్ ఏవో విశ్వప్రసాద్, జోనల్ మేనేజర్ స్వామి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలలో చైతన్యం రాకుంటే ప్రజాస్వామ్య మనుగడకే ముప్పు

తాటిపాముల వెంకట్రాములు

**ప్రజాపక్షం/ వరంగల్ :** రాష్ట్రములో జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికలలో మద్యం ఏరులై పారుతున్నదని, విచ్చలవిడిగా డబ్బు పంపిణీ జరుగుతున్నదని అనేక ప్రలోభాలకు గురి చేస్తున్నారని, ప్రజలలో చైతన్యం రాకుంటే ప్రజాస్వామ్యం మనుగడకే ప్రమాదం బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఎన్నికలైనా ప్రజాస్వామ్యతంగా జరగాలి కానీ జనరల్ ఎన్నికలైనా, పంచాయతీ ఎన్నికలైనా డబ్బు మయంగా మారాయని నోటుతో ఓటు కొనుక్కోవడం, మద్యం, మటన్, చికెన్,చీరలు సారెలు పంపిణీ చేయడం ఓటును అంగడి సరుకుగా మార్చడం అత్యంత బాధాకరమన్నారు. ప్రజలను దోచుకుని అక్రమంగా డబ్బు కూడబెట్టిన వారు డబ్బు సంచులతో ఎన్నికలలో పోటీ చేస్తున్నారన్నారు. ఫలితంగా ఓటును అమ్మేవారు కొనేవారుగా ఎన్నికల వ్యవస్థ తయారైందన్నారు. డబ్బులు కుమ్మరించి గెలవడం తర్వాత అక్రమంగా సంపాదించడం రాజకీయాలను వ్యాపారంగా మార్చారన్నారు. వీటన్నింటినీ అరికట్టడంలో ఎన్నికల కమిషన్ సంబంధిత అధికారులు ఘోరంగా విఫలమైనారన్నారు. ఓ టును అమ్ముకోకుండా ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దేం దుకు ప్రజాస్వామ్య వాదులు ,స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

## మూడవ ర్యాండమైజేషన్ పూర్తి



**ప్రజాపక్షం/ములుగు:** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో రెండవ విడతలో ఎన్నికలు జరగనున్న ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్ మండలాల పోలింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ సమక్షంలో నిర్వహించారు. ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ నిర్వహించిన ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్లు నిశితంగా పరిశీలించారు. ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపిఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. అయితే నామినేషన్ల ఉపసంహరణ నాటికే ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు స్థానాలతో కూడిన గ్రామ పంచాయతీలకు పోలింగ్ జరపాల్సిన అవసరం లేకపోవడం వలన ర్యాండమైజేషన్ ప్రక్రియ నుండి మినహాయింపు కల్పించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజీతో సమస్యను పరిష్కరించుకోండి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** ఈ నెల 21వ తేదీ ఆదివారం జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ జాతీయ మెగా లోక్ అదాలత్ సంబంధించి వరంగల్ కమిషనరేట్ పోలీసులు రూపొందించిన వాల్ పోస్టర్లను వరంగల్ పోలీస్ కమిషనర్ శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ నెల 21, ఆదివారం రోజున జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ మొదలగు కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుంది అని తెలిపినారు. రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా లోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు, ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడ్డదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుంది. కావున ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుంది అని పోలీస్ కమిషనర్ తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం వరంగల్ ఎ. ఎస్పీ శుభం, ఏసీపీ దేవిడ్ రాజు, ఇన్స్ స్పెక్టర్లు రమేష్, కరుణాకర్ పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా ప్రైవేటు ఆసుపత్రులు నిర్వహించొద్దు

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ




**ప్రజాపక్షం/భూపాలపల్లి:** జిల్లాలో అనుమతులు లేకుండా ప్రైవేట్ ఆసుపత్రులు నిర్వహించరాదని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం ఐడిఓ సికార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాలులో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్, రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో అనుమతులు లేకుండా ఎలాంటి ప్రైవేటు ఆసుపత్రులు క్లినిక్ లు నిర్వహించరాదని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసే ఆస్పత్రులను ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించాలని, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలని, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తేనే అనుమతులు ఇవ్వాలని తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి (పిసిబి) మార్గదర్శకాల ప్రకారం బయో మెడికల్ వేస్ట్ చార్జీలను ఆస్పత్రుల వద్ద తీసుకోవాలని సంబంధిత ఏజెన్సీని ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వైద్య సేవల నిమిత్తం ఆసూపత్రులు, క్లినిక్ లకు వచ్చే రోగులకు రాసే చీటీలో కాంపో జిషన్ తో పాటు మందుల వివరాలు అర్థమయ్యేలా పెద్ద అక్షరా( క్యాపిటల్ లెటర్స్ తో రాయాలన్నారు. వైద్య సేవల రుసుము తెలిసేలా చార్జీల పట్టిక ప్రదర్శించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, అదనపు ఎస్పి నరేష్, డిఎంహెచ్ఓ డా.మధుసూదన్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డా॥ శ్రీదేవి, ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ కిరణ్, డెమో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## ముక్కోటి గోడపత్రికలు ఆవిష్కరించిన కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఈనెల 29,30 తేదీల్లో జరిగే ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు తెలిసే విధంగా గోడపత్రికలను కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆవిష్కరించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం లోని తన ఛాంబర్లో శ్రీ సీతారామ చంద్ర స్వామివారి తెప్పోత్సవం, ముక్కోటి ఏకాదశి ద్వార దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే విధంగా వీటిని రాష్ట్ర అంతా అంటించాలని సూచించారు. భక్తులకు కల్పించాల్సిన వసతులు, సౌకర్యాల గురించి, ఏర్పాట్లపై ఈనెల 15న భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల నుండి భక్తులకు స్వామి వారి చెంతకు తరలివచ్చే అవకాశం ఉందన్నందున 15న జరిగే సమావేశానికి అధికారులంతా హాజరు కావాలని ఆయన సూచించారు.

## ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తా

### ప్రచారంలో దూసుకుపోతున్న సిపిఐ అభ్యర్థి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ప్రభుత్వ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధికి కృషి చేస్తానని లింగగూడెం పంచాయతీ సిపిఐ బలపరచిన అభ్యర్థి వట్టం నాగమణి అన్నారు. సిపిఐ బలపరిచిన అభ్యర్థి వట్టం నాగమణి ప్రచారంలో దూసుకుపోతున్నారు. లింగగూడెం పంచాయతీ పరిధిలోని ఇంటింటికి తిరిగి ప్రచారంలో సర్పంచ్ గా గెలిపించి గ్రామ పంచాయతీ సేవ చేసే భాగ్యం కలిగించాలని ప్రజలను కోరారు. సిసి రోడ్లు, డ్రైనేజి లు , మంచినీటి సదుపాయం వంటి అభివృద్ధి పనులుచేస్తామని సమస్యలు పరిష్కరిస్తామని, గ్రామంలోని పారిశుద్ధ్యం నిర్మూలించి గ్రామంలోని సమస్యలను పరిష్కరించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతానని ప్రజలకు వివరిస్తూ గెలుపే లక్ష్యంగా ప్రచారంలో ముందుకు సాగుతున్నారు.ఈ ఎన్నికల్లో నిజాయితీకి, నిబద్ధతకు, అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వట్టం నాగమణి కోరారు.ప్రచారంలో సిపిఐ మండల కార్యదర్శి కొమ్మినేని సుధాకర్, కారం రాములు, మధు పాల్గొన్నారు.

## విపత్తుల నిర్వహణకు పటిష్ఠ ప్రణాళిక

### అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విపత్తుల నిర్వహణకు పటిష్ట ప్రణాళిక సి ద్ధం చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. వరదలు, పరిశ్రమల ప్రమాదాలు, ఇతర ప్రమాదాల నియంత్రణపై జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ మేనేజర్ జనరల్ సుధీర్ బాహల్ వీడియో సమావేశం ద్వారా శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. వరదలు వచ్చినప్పుడు, పరిశ్రమలలో ప్రమాదాలు జరిగినప్పుడు, ఇతర ప్రమాదాలు జరిగినప్పుడు స్పందించాల్సిన తీరుపై జిల్లాలలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించాలని దీనికి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలు చేశారు. జిల్లాలో భారీ వరదల సమయంలో నీటి విడుదల కోసం పైన ఉన్న ప్రాంతాలు దిగువ ప్రాంతాలతో సమన్వయం చేసుకుంటూ ఉండాలన్నారు. విపత్తుల సమయంలో వెంటనే ఎన్డిఆర్ఎఫ్, ఆర్మీ, ఎస్డిఆర్ఎఫ్ వంటి ఏజెన్సీలకు సమాచారం వెళ్లేలా వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలన్నారు.జిల్లా పరిశ్రమ ల శాఖ సహయ సంచాలకులు నకుల్రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పోలింగ్ పకడ్బందీగా ఏర్పాట్లు

### ఖమ్మం డిపిఒ ఆశాలత



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** జిల్లా లో రెండో విడత లో జరిగే స్థానిక ఎన్నికల కు సంబంధించిన పోలింగ్ ఏర్పాట్లు ను పకడ్బందీగా నిర్వహించాలని ఖమ్మం జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆదేశించారు. కొత్తకొత్తూరులో మెటిరియ్ పంపిణీ కేంద్రం, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం ను సందర్శించారు. నేలకొండపల్లి మండలం లోని 32 గ్రామ పంచాయతీలలో మూడు పంచాయతీలు ఏకగ్రీవం కాగా 29 గ్రామ పంచాయతీలలో ఆదివారం పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్పంచ్ అభ్యర్థులు 72 మంది. 300 వార్డులకు గాను. 24 వార్డులు ఏకగ్రీవం కాగా 276 వార్డులకు 528 మంది పోటీలో ఉన్నట్లు తెలిపారు. మండలం ను నాలుగు జోన్లుగా విభజించినట్లు తెలిపారు. ఆరు రూట్లు గా ఏర్పాటు చేశారని తెలిపారు. 600 మంది పోలింగ్ సిబ్బంది ని నియమించినట్లు తెలిపారు. కొత్త కొత్తూరు ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో 10 కౌంటర్ల ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలం కు 27 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఎంపీడీవో యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి సిహెచ్.శివ పాల్గొన్నారు.

## అభివృద్ధి సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



**ప్రజాపక్షం/ఇల్లందు:** అభివృద్ధి సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ భూక్యా వెంకటేష్ అన్నారు. శుక్రవారం తిలక్‌నగర్ గ్రామ పంచాయతీ నందు సిపిఐ మద్దతుతో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థి ధనసరి స్రవంతి గెలుపునకై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత పంచాయతీ సర్పంచ్‌గా ధరసరి స్రవంతి తిలక్‌నగర్ పంచాయితీ నందు కోటి 30లక్షల రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు వేయడం జరిగింది. వీధి దీపాలు, పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. మరో మారు గెలిపిస్తే మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. సిపిఐ మండల కార్యదర్శి బొబ్బిశెట్టి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు ఈసం లక్ష్మ ణ్, ఎట్టి హరికృష్ణ, ధనసరి రాజు, పూనెం మధు, రాజశేఖర్, హరీష్, రమణ, లక్ష్మ య్య, వట్టం కన్నయ్య, పాల్గొన్నారు.

## ప్రచారంలో దూసుకుపోతున్న వినోద్

**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండల పరిధిలో గల జగన్నాధపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కుంజా వినోద్ ప్రచారం ప్రజల ఆదరణతో ముమ్మరంగా సాగుతుంది. నామినేషన్ వేసిన నాటి నుండి నిరంతరం గ్రామంలో ఇంటి ప్రచారాన్ని నిర్వహిస్తూ గ్రామంలో నేటికి నెరవేరని సమస్యలను తనను గెలిపిస్తే తప్పక నెరవేరుస్తానని హామీ ఇస్తూ, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రచారం వేగం పెంచారు. దీనికి తోడు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తనయుడు ధనసరి సూర్య, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రచారం చేయడం జగన్నాధపురం గ్రామం నుండి కోటమ్మ అమ్మవారి దేవాలయం వరకు రోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇవ్వడంతో గ్రామంలో వినోద్ ప్రచారానికి ఆదరణ లభించింది.

# సిపిఐ కంచుకోటగా..
# కూనంనేని 'ఇలాఖా'



**ఒకటి కాదు రెండు కాదు వరుసగా ఏడుసార్లు ఘన విజయం. ఇప్పుడు విడిపోయి ఏడు పంచాయతీలుగా ఏర్పడింది కాని ఒకప్పుడు 25వేల ఓటర్లు పైబడిన మేజర్ గ్రామ పంచాయతీ. 1987 నుంచి సిపిఐ వరుస విజయాలను సాధిస్తున్నది. ఎక్కడో మారుమూల ప్రాంతం కాదు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో అంతర్భగంగా ఉండే చుంచుపల్లి. ఇది సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని ఇలాకా ఇది. మేజర్ పంచాయతీగా ఉన్న చుంచుపల్లిని ఏడు గ్రామ పంచాయతీలుగా విభజించారు. అందులో విద్యానగర్ కాలనీ మేజర్ గ్రామ పంచాయతీగా ఉంది. ఈ పంచాయతీలో సిపిఐ అభ్యర్థిగా పోటీ చేసిన శాంతిశ్రీని ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒక మేజర్ గ్రామ పంచాయతీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం చాలా అరుదు. అందులో వరుస విజయాలు సాధిస్తూ మరోసారి ఏకగ్రీవం కావడం సామాన్య విషయం కాదు.**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఒకసారి పార్టీ గెలిస్తేనే ఏదో చేయలేదని అసంతృప్తి కలిగే రోజులివి. ఇక రెండోసారి మూడోసారి అంటే అంత తేలికైన విషయం కాదు. కాని మూడున్నర దశాబ్దాలుగా ఈ గ్రామ పంచాయతీపై ఎర్ర జెండా రెపరెప లాడుతుంది. ఎన్నికలు జరిగిన ప్రతిసారి ఇక్కడ సిపిఐ జెండాదే గెలుపు. చుంచుపల్లి గ్రామ పంచాయతీ ఒకప్పుడు కొత్తగూడెం మండలంలో మేజర్ గ్రామ పంచాయతీగా ఉండేది. మండలాల ఏర్పాటు తర్వాత చుంచుపల్లి కేంద్రంగా మండలం ఏర్పాటైంది. చుంచుపల్లి పంచాయతీని సైతం చుంచుపల్లి తండా, విద్యానగర్ కాలనీ, నందా తండా, ఎన్‌కె నగర్, బాబు క్యాంపు, రామాంజనేయ కాలనీ, వెంకటేశ్వర కాలనీ పంచాయతీలుగా విడదీశారు. ఇందులో విద్యానగర్ కాలనీలో కూనంనేని సాంబశివరావు నివాసం ఉంటారు. 1987లో కూనంనేని మండల అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత చుంచుపల్లి గ్రామ పంచాయతీని చుంచుపల్లి గెలుచుకుంది. అక్కడి నుంచి విజయపరంపర కొనసాగుతూనే ఉంది. ఒక దశలో అన్ని పార్టీలు ఏకమైన ఇక్కడ సిపిఐ పై విజయం సాధించలేకపోయాయి. ఇక్కడి ప్రజలు కమ్యూనిస్టు పార్టీ పట్ల అచంచల విశ్వాసాన్ని కలిగి ఉండటం అభినందనీయం. ఈ దఫా కూడా పైన పేర్కొన్న ఏడు పంచాయతీలలో వెంకటేశ్వర కాలనీ పంచాయతీలో కాంగ్రెస్‌కు మద్దతునిస్తుండగా మిగిలిన వాటిలో విద్యా నగర్ కాలనీ ఏకగ్రీవమైంది. మిగిలిన ఐదింటిలోనూ సిపిఐ అభ్యర్థులే గెలవనున్నారు. 14న ఈ ప్రాంతంలో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. వరుస విజయాలతో సిపిఐ గెలుస్తుండటం చరిత్రలో మిగిలిపోతుందన్న ప్రచారం జరుగుతుంది. కూనంనేనికి ఈ పంచాయతీ పరిధిలో తెలియని వారు లేరంటే అతిశయోక్తి కాదు. సామూహిక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు కూనంనేనికి గల వ్యక్తిగత పరిచయాలు ఈ ప్రాంతంలో సిపిఐకి ఉన్న చురుకైన, సేవాతత్పరత కలిగిన నాయకత్వం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా వ్యూహం, నిరంతరం పరిచయాలు సిపిఐని ఒక బలమైన శక్తిగా తయారు చేశాయి. ఈనెల 14న జరిగే ఎన్నికల్లో సైతం మరో విజయాన్ని సిపిఐ అభ్యర్థులు అందుకోనుండటం గమనార్హం.




## ప్రజలు మెచ్చేలా సర్పంచ్‌లు పని చేయాలి

### నూతన సర్పంచ్‌ల అభినందన సభలో మంత్రి తుమ్మల




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామాల్లో వివాదాలు లేకుండా ప్రజలంతా మెచ్చేలా సర్పంచ్‌లు పాలన సాగించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రఘునాథపాలెం మండలంలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లకు అభినందన కార్యక్రమాన్ని శుక్రవారం వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించారన్నారు. హామీలను అమలు చేసే బాధ్యత తనదని గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌లు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. గ్రామాభివృద్ధే ధ్యేయంగా పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు బాధ్యతలు నిర్వహించాలన్నారు. ప్రజలు మెచ్చేలా పని చేసి మెరుగైన పాలనను అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్ చౌదరి, కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ఆత్మ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వరరావు, నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

## భూ వివాదాల పట్ల అవగాహన తప్పనిసరి

### సమస్యల పరిష్కారంలో వేగం

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భూ వివాదాలు, భూ చట్టాల పట్ల పోలీస్ అధికారులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రిచెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ తెలంగాణ నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఐపిఎస్ ట్రైనీ అభ్యర్థులకు భూ వివాదాలు, శాంతి భద్రతల నిర్వహణపై ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తన క్యాంపు కార్యాలయం నుంచి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రభుత్వ ప్రజా సేవలు, భూ సమస్యల పరిష్కార విధానాలు, కోర్టు వ్యవహారాలు, పోలీస్ శాఖతో సమన్వయం, భూ భారతి, రెవెన్యూ చట్టాల అమలు వంటి కీలక అంశాలపై సమగ్రంగా వివరించారు. తెలంగాణ రాష్ట్ర క్యాడర్‌లో పని చేయడానికి ఎంపికైన ఐపిఎస్ అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. భూ వ్యవహారాలకు సంబంధించి కనీస ప రి జ్ఞానం, అవగాహన పోలీస్ అధికారులకు ఉండటం వల్ల శాంతిభద్రతల నిర్వహణలో చాలా ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో 70 శాతం నేరాలు భూ వివాదాలకు సంబంధించి జరుగుతాయని అర్బన్ ప్రాంతాల్లో కూడా భూ వివాదాలతో నేరాలు పెరగటం పరిపాటి అవుతుందన్నారు. భూ వివరాలకు సంబంధించి కనీస అవగాహన పోలీస్ అధికారులకు ఉంటే మరింత మెరుగ్గా శాంతిభద్రతలను పరిరక్షించే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. చారిత్రకంగా తెలంగాణ ప్రాంతంలో అనేక పోరాటాలు భూమికి సంబంధించి జరిగాయన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత భూముల ధరలు చాలా పెరిగాయని దీని వల్ల చాలా వివాదాలు ఏర్పడుతున్నాయన్నారు. భూ వివాదాలకు సంబంధించిన కేసులను పోలీసులు ఎవరితో ఇంటరాక్ట్ కావాల్సి ఉంటుంది, ప్ర స్తుతం అమలవుతున్న భూ భారతి చట్టం వంటి అంశాలను పోలీస్ అధికారులు తెలుసుకోవాలన్నారు. ప్రతి జిల్లాకు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం అదనపు కలెక్టర్ రెవెన్యూ ప్రత్యేకంగా ఉంటారని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రెవెన్యూ వ్యవస్థ ఉంటుందని ప్రతి స్థాయిలో పోలీస్ అధికారులు రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తే మెరుగైన ఫలితాలు లభిస్తాయన్నారు. ఈ వీడియో సమావేశంలో పలు రాష్ట్రాల క్యాడర్ ట్రైనీ పోలీస్ అభ్యర్థులు సోహల్, మనీషా మెహరా, రాహుల్, అయోషా ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## గెలుపు దిశగా సిపిఐ బలపరిచిన అభ్యర్థులు





**ప్రజాపక్షం/పాల్వంచ :** ఈ నెల 14వ, తేదీన జరిగే స్థానిక సంస్థల రెం డవ దశ ఎన్నికల ప్రచారానికి చివరి రోజు శుక్రవారం సర్పంచ్, వార్డు సభ్యులు తమ మందీ మార్బలంతో ప్రచారాన్ని హోరెత్తించారు. ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహిస్తూ తమ గు ర్తులు చూపెడుతూ గ్రామంలో నెలకొన్న అనేక సమస్యలను నెరవేరుస్తామంటూ ఓటర్లను ఓట్లను అభ్యర్తించారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లి ( ఎస్), తోగ్గూడెం, రంగాపురం, పాం దురంగాపురం తండా, నాగారం, నా గారం కాలని, బంద్రుగొండ, చంద్రాలగూడెం, రేగులగూడెం, లక్ష్మిదేవి పల్లి (యు ), ఉల్వనూర్ తదితర 29 పంచాయతీలలో సిపిఐ బలపరిచిన అభ్యర్థులు ప్రచారంలో ముందున్నా రు. ఆయా గ్రామాలలో కొన్ని చోట్ల త్రి ముఖ, మరికొన్ని చోట్ల ద్వి ముఖ పోటీ నెలకొంది. దీనితో ఎన్నికల పోటీ రసవత్తరంగా మారింది. ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు చేస్తు న్న అభివృద్ధి పనులకు ఆకర్షితులవుతున్న ప్రజలు ఆయా అభ్యర్థులను గెలిపించటానికి సిద్ధంగా ఉన్నారని తె లుస్తోంది. సంగం, బిక్కుతండా, తవిశలగూడెం, ఇల్లందులపాడు తండా గ్రామాలలో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను ప్రజలు ఏకగ్రీవమయ్యారు. పాండురంగాపురం తండా గ్రామంలో మిత్రపక్షాలు బలపరిచిన బానోత్ సంగీత గెలుపు ఇప్పటికే ఖాయమైనది పలువురు చెప్పటం గమనార్హం. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంత గ్రామాలలో నెలకొన్న పోడు భూముల సమస్యలపై కేవలం కమ్యూనిస్టు పార్టీ మాత్రమే పోరాటం చేస్తుందని, నాయకులే జైలు జీవితం అనుభవించి వచ్చారని, కావునా ఒక్కసారి ఆ పార్టీ సపోర్ట్ చేసిన అభ్యర్థులకు ఓట్లేసి కమ్యూనిస్టు ఉద్యమానికి బలాన్నివ్వాలని ఆ ప్రాంత వాసులు ఓ నిర్ణయానికి వచ్చారని తెలుస్తోంది.

## తండ్రి బాటలో తనయుడు

### గడల సీతారామయ్య రాజకీయ వారసుడిగా భాస్కర్‌రావు



**ప్రజాపక్షం/కొణిజర్ల:** రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవడం, దాన్నికొనసాగించడం అంత అషామాషీ కానేకాదు. అందునా కమ్యూనిస్టు పార్టీల్లో ఇంకా అరుదు. కాకలు తీరిన కమ్యూనిస్టు యోధులు సైతం వారి వారసుల మీద పార్టీ నీడ పడకుండా ఇతరత్రా వ్యాపారాల్లో స్థిరపరుస్తున్న రోజులివి. అలాంటిది తండ్రి రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని ఆ పేరును చిరస్థాయిగా నిలబెడుతున్న అసలు సిసలైన కమ్యూనిస్టు నాయకుడు భాస్కర్‌రావు. ఈ ఊరి ప్రజల చేతి వెంట్రుకలు నిక్కపొడుస్తాయి. నాడు సిపిఐ పార్టీలో కీలకంగా పని చేస్తూ తుళ్లూరి సీతారామయ్య, తులశమ్మ దళంలో తురుపు ముక్కగా మెలుగుతూ అజ్ఞాతవాసంలో పని చేసిన యోధుడు ఈయన. తుపాకీ చేతబట్టి రజాకార్లకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని లేవనెత్తి వారి గుండెల్లో నిద్రపోయాడు సీతారామయ్య. ఖమ్మం నుంచి మణుగూరు వరకు పార్టీని విస్తరించి గ్రామ శాఖలు ఏర్పాటు చేయడం ద్వారా ఉద్యమాన్ని ఉవ్వెత్తున లేపారు. పార్టీ తాలూకా కార్యదర్శిగా పని చేస్తూ సిపిఐ పార్టీని నలుదిక్కులా విస్తరింపజేయడంలో కీలక భూమిక పోషించారు. సిపిఐ ఆధ్వర్యంలో అలా మొదలైన భూ పంపిణీ ఉద్యమ పంథాలో సాగుతూ వందెకరాలకుపైనే నిరుపేదల ఇండ్ల స్థలాలుగా పంపిణీ చేయడం గొప్ప పరిణామంగా నేటికీ చెప్పుకుంటారు.

### తండ్రికి తగిన తనయుడిగా..

మంచైనా, చెడైనా కొడుకు వేసే ప్రతి అడుగూ తండ్రి పేరును ప్రభావితం చేయడం సహజంగా జరుగుతుంది. అలాంటిది ఎంతో గొప్ప కీర్తి కలిగిన తండ్రి పేరును నిలబెట్టడం, చెడు ప్రభావం లేకుండా కాపాడటం సాధారణ విషయం కాదు. సీతారామయ్య తనయుడు మాత్రం తండ్రి కీర్తిని మరింతగా ఇనుమడింపజేస్తూ ముందుకు సాగుతుండటం విశేషంగా చెప్పుకోవచ్చు. వృత్తి రీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ సిపిఐ పార్టీలో పార్టీ విస్తరణకు సహకరించేవారు. భాస్కర్‌రావు. తండ్రి హయాంలో మొదలైన ప్రజా ఉద్ధరణ కార్యక్రమాలను సొంత డబ్బులతో కొనసాగిస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా తనదైన ముద్ర వేసుకున్నారు. కష్టం కలిగిన ప్రతిసారీ వారి కన్నీళ్లు తుడుస్తూ వారి తలలో నాలుకలా మెదిలారు. కరోనా కష్ట కాలంలో తనికెళ్ల గ్రామ ప్రజలకు ఆర్థిక సాయం చేస్తూ చేయూతనిచ్చారు.

## హోటల్‌పై పెట్రోల్‌తో దాడి.. నిప్పంటించిన దుండగులు





**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నగరంలోని ఇల్లెందు రోడ్డు పాపిరెడ్డి కన్వెక్షన్ హాల్ పక్కన ఉన్న సెటు హోటల్‌పై గుర్తుతెలియని వ్యక్తులు గురువారం అర్థరాత్రి పెట్రోలు పోసి నిప్పంటి దాడికి యత్నించారు. అర్బన్ పోలీసులు, బాధితుడు కాటేపల్లి జనార్ధన్ కథనం ప్రకారం ఎస్ఎఫ్ఎస్ సమీపంలో నివాసం ఉండే కాటేపల్లి జనార్ధన్‌కు పాపిరెడి కన్వెక్షన్ పక్కన హోటల్ ఉంది. రోజువారిగా జనార్ధన్ శుక్రవారం తెల్లవారుజామున హోటల్‌కు వచ్చాడు. చేసే సరికి షెట్టర్ కాలి మసిబారి ఉండటంతో అగ్నిప్రమాదం జరిగినట్లు బావించి వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అర్బన్ పోలీసులు స్థానికులు, హోటల్ సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. ఆప్రాంతాన్ని పరిశీలించగా ఖాళీగా పడి ఉన్న ఒక బాటిల్‌ను గుర్తించారు. అందులో కొద్దిపాటి పెట్రోలు ఉండటంతో దానిని దాడికి ఉపయోగించినట్లుగా అనుమానం వ్యక్త చేశారు. దుండుగులు బాటిల్‌తో పెట్రోలు వెంట తెచ్చి హోటల్ షెటర్‌పై పోయడంతో పాటు కింద నుంచి గదిలోపలికి పోసి నిప్పంటించి ఉంటారని బావించారు. ఈప్రమాదంలో సుమారు ఇరవై వేల రూపాయల విలువ చేసే ఖాళీ బస్తాలతో పాటు వాటర్‌బాటిల్స్ దహనం అయినట్లు బాధితుడు తెలిపారు. వాటర్‌బాటిల్స్‌కు నిప్పంటుకుని కాలడంతో నీరు బయటకు రావడంతో గది మొత్తం మంటలు వ్యాపించకుండా అదుపులోకి వచ్చిఉంటాయని లేకుంటే అస్థినష్టం భారీగా ఉండేదని వాపోయ్యాడు. గిట్టని వారు ఈఘతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## స్థానిక సంస్థల ప్రచారంలో దూసుకుపోతున్న సిపిఐ



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు, ఆళ్లపల్లి మండల మాజీ వైస్ ఎంపిపి రేసు ఎల్లయ్య ఆధ్వర్యంలో ఆళ్లపల్లి గ్రామ పంచాయితీ సిపిఐ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మెస్సు మమత విజయమే లక్ష్యంగా ఆళ్లపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారంలో దూసుకుపోతుంది. వార్డు అభ్యర్థులు ఎల్లబోయిన నవీన్, గౌరబోయిన సీత, గలిగ ప్రశాంతి, తాటి సంధ్యారాణి, కుంట సహదేవ్ వారి వార్డులలో మాజీ ఉప సర్పంచ్ గుంతోజు సదానందచారి, మల్లేష్, మద్దెల వెంకటేశ్వర్లు, ఇమ్మానేయులు, శ్రీరామ్ సమ్మయ్య, బాబు, నరెడ్ల శివ, గుంతోజు శివ, నరెడ్ల రాం బాబు, సిపిఐ యువత పాల్గొన్నారు.

# రీల్

## 'నభా నటేశ్' పోస్టర్ విడుదల




నిఖిల్ హీరోగా యాక్షన్ సినిమా 'స్వయంభు'. ఈ సినిమాలో నభా నటేశ్ హీరోయిన్గా నటిస్తోంది. సినిమాలో అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తున్న నభా నటేష్కు సంబంధించిన పోస్టర్ను విడుదల చేశారు. సుందర అనే క్యారెక్టర్ నభా నటేష్ చేస్తున్నారు. నిఖిల్ సరసన సంయుక్త, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. భరత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా విడుదలకు సిద్ధం అవుతోంది. ఠాగూర్ మధు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. బాహుబలికి కెమెరా మెన్గా పని చేసిన సెంథిల్ కుమార్ ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్గా పని చేస్తున్నారు.

## నేడు 'ఉస్తాద్' పాట రిలీజ్




పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్ డోస్ పెంచారు. ఈనెల 13న రాజమండ్రి లో పాటను రిలీజ్ చేయనున్నారు. ఈ ఈవెంట్ కు పవన్ కళ్యాణ్ హాజరయ్యే అవకాశం ఉంది. దేఖ్లేంగే సాలా అనే పాటను రిలీజ్ చేస్తారు రాజమండ్రిలోని ఆదిత్యా యూనివర్సిటీలో ఈ ఈవెంట్ జరుగనుంది. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. భాస్కర్ పట్ల రాసిన ఈ పాటను విశాల్ దద్లాని పాడారు. ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ సరసన శ్రీలీల హీరోయిన్గా నటిస్తోంది. రాశీ ఖన్నా మరో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మైత్రీ మూవీస్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది

## ఈ సినిమా ప్రేక్షకుల్ని నవ్విస్తుంది



### ప్రొడ్యూసర్స్ జయకాంత్, అమర్ బురా

నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా 'గుర్రం పాపిరెడ్డి'. ఈ చిత్రాన్ని డా.సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్తో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'గుర్రం పాపిరెడ్డి' సినిమా ఈ నెల 19న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్కు రాబోతోంది. ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు ప్రొడ్యూసర్స్ జయకాంత్ (బాబీ), అమర్ బురా. ప్రొడ్యూసర్ జయకాంత్ (బాబీ) మాట్లాడుతూ.. డైరెక్టర్ మురళీ మనోహర్ మా ఫ్రెండ్. ఆయన 'గుర్రం పాపిరెడ్డి' స్టోరీ మాకు నెరేట్ చేశాడు. కథ చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపించింది. ప్రొడక్షన్ స్టార్ట్ చేసేందుకు ఇలాంటి కొత్త తరహా కథ కరెక్ట్ అనుకుని మూవీ స్టార్ట్ చేశాం. కొత్త ప్రొడ్యూసర్స్ అంటే ఏదైనా లవ్ స్టోరీతో, యూత్ ఫుల్ కంటెంట్ తో చేస్తుంటారు. కానీ రొటీన్ ప్రాజెక్ట్ చేయొద్దనే డార్క్ కామెడీ జానర్లో 'గుర్రం పాపిరెడ్డి' సినిమాను నిర్మించాం. ఫరియా అబ్దుల్లాకు మంచి కామెడీ టైమింగ్ ఉంది. తన రోల్ చేయడమే కాదు ఒక సాంగ్ రాసి పాడి కొరియోగ్రాఫ్ చేసింది. ఆ పాట వైరల్గా మారుతోంది. బ్రహ్మానందం, యోగి బాబు కీ రోల్స్ చేశారు. బ్రహ్మానందం డబ్బింగ్ చెబుతున్న టైమ్లో సినిమాలో పెద్ద క్యారెక్టర్ చేయించారు అన్నారు. ఆయన ఇటీవల కాలంలో ఇంత లెంగ్త్ రోల్ చేయలేదు. స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు ఆయన క్యారెక్టర్ ఉంటుంది. అలాగే యోగి బాబు కోసం రెండు నెలలు వెయిట్ చేశాం. రాజ్ కుమార్ కాసిరెడ్డి, వంశీధర్ కోసిగి మధ్య హిలేరియస్ కామెడీ వర్కవుట్ అయ్యింది. వాళ్లిద్దరికీ ఈ సినిమా ఫేమ్ తీసుకొస్తుంది. ప్రొడ్యూసర్ అమర్ బురా మాట్లాడుతూ తెలివిలేని వాళ్లు తెలివైన వాడిని ఎలా ఎదుర్కొన్నారు అనేది మా మూవీ పాయింట్. ఫన్, కామెడీతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. సందేశాలు వినేందుకు ప్రేక్షకులు థియేటర్స్కు రారు. వాళ్లను ఆ కాసేపు ఎంటర్ టైన్ చేయాలి. మా మూవీ కంటెంట్ మీద పూర్తి నమ్మకంతో ఉన్నాం. మ్యాడ్, మ్యాడ్–2 చూస్తున్నప్పుడు ఆ పాత్రలను చూస్తేనే ఎలా నవ్వుకున్నామో మా సినిమాలోనూ ఆర్టిస్టులను చూడగానే ఫన్గా ఫీలవుతారు. మా మూవీ కంటెంట్ ప్రతి ఒక్కరికీ నచ్చినా స్టార్ హీరో లేదు అనేది బిజినెస్ పరంగా ఇబ్బంది అయ్యింది. కంటెంట్ను నమ్మి మా గుర్రం పాపిరెడ్డి సినిమాను 140 స్క్రీన్స్ లో రిలీజ్ చేస్తున్నాం. ముందే పెద్ద సంఖ్యలో థియేటర్స్ వేసి సినిమాకు జనం లేరు అనిపించుకోవడం కంటే రెస్పాన్స్ బాగుంటే పెంచుకోవచ్చు అని అనుకున్నాం. టికెట్ ప్రైస్ కూడా అందుబాటులో ఉండేలా చూసుకుంటున్నాం.

## ఫరియా అబ్దుల్లా కొరియోగ్రఫీ చేసింది

### డైరెక్టర్ మురళీ మనోహర్




నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా 'గుర్రం పాపిరెడ్డి'. ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు డైరెక్టర్ మురళీ మనోహర్. మా నేటివ్ ప్లేస్ హైదరాబాద్. చిన్నప్పుడు శివ, నాయకుడు లాంటి సినిమాలు చూసిన ప్రభావంతో సినిమా ఇండస్ట్రీ వైపు ఆకర్షితుడిని అయ్యాను. ఇక్కడ ఎంబీఏ పూర్తిచేశాక లండన్ వెళ్లాను. అక్కడి ఫిలిం ఇనిస్టిట్యూట్లో కోర్స్ చేసి ఇండియాకు వచ్చి సంపత్ నందితో వర్క్ చేయడం ప్రారంభించాను. ఆయన డైరెక్ట్ చేసిన చాలా మూవీస్కు నేను వర్క్ చేశాను. 2010 నుంచి టాలీవుడ్లో ఉన్నాను. సంపత్ నంది సపోర్ట్తో సింబా మూవీ చేశాను. ఆ సినిమా నా ఫస్ట్ మూవీ. అయితే అది రిలీజ్ కావడంలో ఆలస్యమైంది. మా మూవీలో హీరోయిన్ క్యారెక్టర్కు ఫరియా అబ్దుల్లా బాగుంటుంది అనిపించి తీసుకున్నాం. ఆమె చాలా బాగా పర్ ఫార్మ్ చేసింది. ఈ చిత్రంలో ఒక పాట కూడా తనే రాసి పాడి కొరియోగ్రఫ్ చేసింది అన్నారు.

## ప్రభాస్ ఫోటోలు వైరల్



హీరో ప్రభాస్ తాజా ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ప్రభాస్ నటించిన రాజా సాబ్ సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభాస్ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. రాజా సాబ్ సినిమాకు మారుతీ దర్శకత్వం వహించారు. తమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 9న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మిస్తోంది.

## 'పెద్ది' కొత్త షెడ్యూల్...



పెద్ది మార్చి 27, 2026న గ్రాండ్గా పాన్- ఇండియా థియేట్రికల్ విడుదలకు సిద్ధంగా ఉంది.

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మోస్ట్ ఎవైటెడ్ రస్టిక్ యాక్షన్ ఎంటర్టైనర్ 'పెద్ది'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రం ఇప్పటికే ఫస్ట్లుక్ పోస్టర్లు, ఫస్ట్ షాట్ గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'చికిరి చికిరి'తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. రామ్ చరణ్ ట్రేడ్మార్క్ మెగా గ్రేస్, ఉర్రూతలూగించే స్క్రీన్ ప్రజెన్స్తో ఈ పాట సోషల్ మీడియాలో సంచలనం సృష్టించి, ప్రపంచవ్యాప్తంగా వైరల్గా మారింది. 'పెద్ది' టీం నేటి నుండి హైదరాబాద్లో కొత్త షూటింగ్ షెడ్యూల్ను ప్రారంచనుంది. ఈ షెడ్యూల్లో కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు, వాటిలో కొన్నింటిని ఢిల్లీలో చిత్రీకరిస్తారు. జనవరి నెలాఖరు వరకు చిత్రీకరణ కొనసాగుతుంది, అప్పటికి సినిమా మొత్తం టాకీ పార్ట్ పూర్తవుతుందని భావిస్తున్నారు. ప్లానింగ్ ప్రకారం, నిర్మాణ పనులన్నీ సజావుగా సాగుతున్నాయి, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్కుమార్ ఒక కీలక పాత్ర పోషించడం ఈ చిత్రానికి మరింత బలాన్ని చేకూరుస్తుంది, అలాగే జగపతి బాబు, దివ్యేందు శర్మ ముఖ్యమైన పాత్రలలో నటిస్తున్నారు.

## 'అఖండ–2' సక్సెస్ మీట్



'అఖండ–2'కు బ్రహ్మాండమైన రెస్పాన్స్ వస్తోంది. బుకింగ్స్ చాలా స్ట్రాంగ్గా వున్నాయి. సినిమాకి ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోందని నిర్మాతలు రామ్ ఆచంట, గోపి ఆచంట అన్నారు. ఈ సినిమా సక్సెస్ మీట్ ఘనంగా నిర్వహించారు. అఖండ–2 ది తాండవం సక్సెస్ సెలబ్రేషన్స్లో నిర్మాత గోపి ఆచంట మాట్లాడుతూ అందరికీ నమస్కారం. కొన్ని అనివార్య కారణాల వల్ల సినిమా ఒక వారం రోజులు వాయిదా పడింది. ఈ సందర్భంగా మా బాలయ్య బాబుకి, డైరెక్టర్ బోయపాటి శ్రీనుకి, బాలయ్య బాబు ఫ్యాన్స్కి మా ప్రొడక్షన్ తరఫున సారీ చెప్తున్నాం. ఈ సమస్యని పరిష్కరించడానికి మ్యాంగో మీడియా రామ్, నిర్మాత దిల్ రాజు చాలా సపోర్ట్ చేశారు. వారికి ధన్యవాదాలు. ఒక వారం రోజులు ఆలస్యం అయినప్పటికీ శుక్రవారం (డిసెంబర్ 12న) ఈ సినిమా ప్రీమియర్స్తో రిలీజ్ అయింది. ప్రీమియర్స్కి బ్రహ్మాండమైన రెస్పాన్స్ వచ్చింది. మేము భ్రమరాంబలో చూసాం. ఫ్యాన్స్ అసలు సీట్లో కూర్చోవడం లేదు. నిలుచుని చప్పట్లు విజిల్స్ తో అద్భుతమైన రెస్పాన్స్ ఇచ్చారు. ఈరోజు మార్నింగ్ మ్యాట్నీ షోలు కూడా అద్భుతంగా ఉన్నాయి. అన్ని ఏరియాల నుంచి మంచి కలెక్షన్స్, రిపోర్ట్స్ వస్తున్నాయి. నార్త్లో జి సినిమాస్ ద్వారా దాదాపు 800 స్క్రీన్స్లో రిలీజ్ చేశాం. అక్కడ ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తున్నారని రిపోర్ట్స్ వస్తున్నాయి. సినిమాకి వర్డ్ ఆఫ్ మౌత్ బ్రహ్మాండంగా ఉంది. సూపర్ ట్రెండ్లో టికెట్స్ బుక్ అవుతున్నాయి. రెండు రాష్ట్రాల్లో సక్సెస్ సెలబ్రేషన్స్ చేయాలని భావిస్తున్నాము. నిర్మాత రామ్ ఆచంట మాట్లాడుతూ.. ప్రీమియర్స్ రెస్పాన్స్ అదిరిపోయింది. రాత్రి జరిగిన ప్రీమియర్స్కి నైజాం సీడెడ్ ఆంధ్ర కలిపి 10 కోట్లు గ్రాస్ చేసింది. కర్ణాటకలో కూడా దాదాపు కోటి రూపాయలు కలెక్ట్ చేసింది. ప్రీమియర్స్లో కోటి రూపాయలు కలెక్ట్ చేసిన నాన్ కన్నడ సినిమాల్లో ఇది ఐదో సినిమా. బుకింగ్స్ చాలా స్ట్రాంగ్గా ఉన్నాయి. డిస్ట్రిబ్యూటర్స్ నుంచి చాలా అద్భుతమైన రిపోర్ట్స్ వస్తున్నాయి. శుక్రవారం ఈవినింగ్ నుంచి ఫ్యామిలీస్ కూడా యాడ్ అవుతాయి. ఈ వీకెండ్కి అదిరిపోయే ఫిగర్స్ చూస్తామని నమ్మకం ఉంది. రిలీజ్ తర్వాత అందరం చాలా హ్యాపీగా ఉన్నాం. ఓవర్సీస్ రెస్పాన్స్ కూడా అద్భుతంగా ఉంది. ఈ వీకెండ్లో కూడా అది కొనసాగుతుంది. బుకింగ్స్ చాలా స్ట్రాంగ్గా ఉన్నాయి. అన్ని ఫాస్ట్గా ఫిల్లింగ్ అవుతున్నాయి. శని, ఆదివారాల్లో ఇంకా సూపర్గా ఉంటాయి. గ్రౌండ్ రిపోర్టు చాలా ఎక్సలెంట్గా ఉంది. డిస్ట్రిబ్యూటర్స్ అందరు కూడా ఫుల్గా ఫుల్ హ్యాపీగా ఉన్నారు. బజ్ బ్రహ్మాండంగా ఉంది. ముఖ్యంగా బాలయ్య బాబు ఫ్యాన్స్ చాలా హ్యాపీగా ఉన్నారు. అద్భుతమైన సినిమా తీశారని ప్రశంసిస్తున్నారు..

## ఉత్సాహంగా సాగుతున్న ఆర్చరీ పోటీలు



ప్రజాపక్షం/హైదరాబాద్: బేగంపేట్లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం రెండో రోజు 32వ సీనియర్ నేషనల్ ఆర్చరీ ఛాంపియన్ షిప్ (ఎన్టిపిసి) లు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. సీనియర్ ఇండియన్ రౌండ్ 21వ సీనియర్ కంపౌండ్ 45వ సీనియర్ రీకర్వ్ (పురుషులుమహిళలు) నేషనల్ ఆర్చరీ ఛాంపియన్షిప్ విజయవంతంగా ముగిసింది. ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహించాయి. పురుషుల టీమ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్కు చెందిన సోలగం సాంబశివ, గుదురు వెంకట లోకేష్, చిట్టాపల్లి మోహిత్ సాయిలు మొదటి స్థానంలో నిలిచారు. రెండో స్థానంలో ఉత్తరప్రదేశ్కు చెందిన సోడే దేశాయిల్, శివమ్ వైధ్వాన్, శుభమ్లు నిలిచారు. ఇక మూడో స్థానంలో హర్యానాకు చెందిన మనేష్, గౌతమ్ పంవార్, సుమిత్, వినీత్ కుమార్, పవన్లు నిలిచారు. ఇక మహిళల టీమ్ విభాగం ఛత్తీస్గఢ్ మొదటి స్థానం గెలవగా రెండో స్థానంలో జార్ఖండ్, మూడో స్థానంలో అస్సాం దక్కించుకుంది. శుక్రవారం జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమానికి అనిల్ కామినేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ఆర్చరీ సంఘం అధ్యక్షులు టి. రాజు, ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అశ్విన్ రావు, డెవలప్మెంట్ కమిటీ సభ్యులు పుట్టా శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం-విష్ణుపురం మధ్య రైల్వే భద్రత భేష్



### జిఎం సంజయ్కుమార్ శ్రీవాస్తవ

ప్రజాపక్షం/హైదరాబాద్ : భద్రాచలంవిష్ణుపురం రైల్వే సెక్షన్ మధ్య భద్రతతో పాటు భద్రాచలం స్టేషన్ పునరాభివృద్ధి పనులు భేష్గా నిలిచిందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్కుమార్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ శుక్రవారం భద్రాచలం ,విష్ణుపురం రైలు మార్గం సహా పలు ప్రాంతాల్లో సమగ్ర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్తో పాటు పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్లో సైతం తనిఖీని నిర్వహించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.25.41కోట్ల వ్యయంతో జరుగుతున్న పునరాభివృద్ధి పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ప్లాట్ఫామ్ ఉపరితలాల మెరుగుదల, అదనపు కవర్ల ఏర్పాటు, లిఫ్టులు, కొత్త వెయిటింగ్ హాల్, ముఖభాగం భవనం అభివృద్ధి, సర్క్యులేటింగ్ ఏరియా అప్గ్రేడ్ వంటి పనులపై అధికారులు జిఎంకు వివరాలు అందించారు. పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.అదే స్టేషన్లోని క్రూ లాబీని జీఎం పరిశీలించారు. లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్ల కోసం ఉన్న సౌకర్యాలను పరిశీలిస్తూ, వారి రోజువారీ సవాళ్లను తెలుసుకున్నారు. సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీలో భాగంగా స్టేషన్లో ఉన్న 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్' స్టాల్ను కూడా శ్రీవాస్తవ సందర్శించారు. భద్రాచలం రోడ్ స్టేషన్లో పలువురు ప్రజా ప్రతినిధులు జీఎంని కలసి తమ విజ్ఞప్తులను సమర్పించారు. తరువాత భద్రాచలం రోడ్ విష్ణుపురం సెక్షన్లో రియర్ విండో ఇన్స్పెక్షన్ చేపట్టి, ట్రాక్లు, వంతెనలు, సిగ్నలింగ్ వ్యవస్థల భద్రతా నిర్వహణను జిఎం పరీక్షించారు. శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు.

## భూసేకరణ తుది తీర్పుకు లోబడి ఉండాలి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా రావిర్యాల వద్ద ఔటర్ రింగ్ రోడ్ ఇంటర్ చేంజ్ నుంచి ఆమన్గల్ రీజినల్ రింగ్ రోడ్ వరకు గ్రీన్ఫీల్డ్ రేడియల్ రోడ్ నిర్మాణం కోసం సేకరించే భూసేకరణ తాము వెలువరించే తుది తీర్పుకు లోబడి ఉండాలని హైకోర్టు షరతు విధించింది. పిటిషనర్లను తమ భూముల నుంచి తరలించవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పిటిషనర్ల భూములకు సంబంధించి గతంలో జారీ చేసిన స్టేటస్కు ఉత్తర్వులను శుక్రవారం మరోసారి పొడిగించింది. భూసేకరణకు అధికారులు ఇచ్చిన ప్రాథమిక నోటిఫికేషన్ను రంగారెడ్డి జిల్లా తట్టి అన్నారం బండ్లగూడకు చెందిన నీరటి రవీందర్ ఇతరులు సవాల్ చేసిన పిటిషన్ను జస్టిస్ శ్రవణ్కుమార్ శుక్రవారం విచారించారు. పిటిషనర్కు నోటీసు కూడా ఇవ్వలేదని, భూసేకరణ నిలిపివేయాలని పిటిషనర్ న్యాయవాది వాదించారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ, కొందరు పిటిషనర్లు పరిహారం తీసుకున్నారని, భూసేకరణకు అవరోధం లేకుండా చేయాలని కోరారు. వాదనలపై న్యాయమూర్తి.. తాము తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు పిటిషనర్లను తొలగించరాదని ఆదేశించారు. విచారణ ఈ నెల 29కి వాయిదా వేశారు.

## అఖండ-2 నిర్మాతకు ఊరట

### టిక్కెట్ల ధరల పెంపునకు బెంచ్ అనుమతి

ప్రజాపక్షం/హైదరాబాద్ : నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ–2 టికెట్ల ధరలు పెంపు జీవో అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులపై ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన డివిజన్ బెంచ్ స్టే విధించింది. టిక్కెట్ ధరల పెంపునకు వీలుగా ప్రభుత్వం ఇచ్చిన మెమోను నిలిపివేస్తూ సింగిల్ జడ్జి గురువారం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సిన్మా నిర్మాత అత్యవసర అప్పీల్ పిటిషన్ వేశారు. ఈ అప్పీల్పై జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్కుమార్ డివిజన్ బెంచ్ విచారించి స్టే విధించింది. పెరిగిన టిక్కెట్ ధర ప్రకారం కావాల్సిన వాళ్లు సిన్మా చూస్తారని, అవసరం లేని వాళ్లు సిన్మా చూడరని అభిప్రాయపడింది. సింగిల్ జడ్జి వద్ద పిటిషన్లు వేసిన ముగ్గురి వ్యక్తుల కోసం నిర్మాత, డిస్ట్రిబ్యూటర్లు ఇబ్బందిపడటం సరికాదదంది. ఈ నెల 15 వరకు సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఇదిలా ఉండగా, టిక్కెట్ ధరలపై జారీ చేసిన మెమో అమలును నిలిపివేసినప్పటికీ బుక్ మై షో పెంచిన ధరల ప్రకారమే టిక్కెట్లను విక్రయించిదంటూ దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్ జస్టిస్ శ్రవణ్కుమార్ విచారించారు. కోర్టు ధిక్కరణ పిటిషన్లో నోటీసులు జారీ చేశారు.

## అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)



పంచాయితీల పరిధిలో కూనంనేని విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీ, గ్రామ సెంటర్లలో జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ మాజీ కార్మికులు, పేదలు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు నివశిస్తున్న పాత క్వార్టర్లు, సింగరేణి స్థలాల నుంచి వెళ్లగొట్టే సంగిరేణి చర్యలకు స్వస్తి చెప్పి స్వేచ్ఛగా నివశించే వెసులుబాటు కల్పించామని అన్నారు. సింగరేణి సేఫ్ నిధులతో ప్రభావిత గ్రామాల అభివృద్ధి, కార్మిక వాడల్లో మౌళిక సదుపాయాల కల్పనకు కృషి జరుగుతుందన్నారు. కార్మికులు, పేదలు, మాజీ కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తామని చెప్పారు. అనునిత్యం ప్రజలను వెన్నంటి ఉండి వారి కష్టాలు, సమస్యలపై స్పందించేది కమ్యూనిస్టు పార్టీ ప్రజాప్రతినిధులే అని, ఈనెల 14న జరగనున్న గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎన్నికల సమయలో డబ్బుల మూటలతో వచ్చే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు సలిగంటి శ్రీనివాస్, దుర్గరాశి వెంకటేశ్వర్లు,జి వీరస్వామి, వాసిరెడ్డి మురళీ, వట్టికొండ మల్లిఖార్జున రావు, పొలమూరి శ్రీనివాస్, యాంత్ర మహేష్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## జనజీవనంలోకి

(మొదటి పేజీ తరువాయి)

లొంగిపోయారని ఆయన చెప్పారు. ఒక ఎకె47 రైఫిల్, రెండు సెల్ఫ్లోడింగ్ రైఫిల్స్ (ఎస్ఎల్ఆర్లు), ఒక స్టెన్గన్, ఒక బారెల్ గ్రెనేడ్ లాంచర్ (బిజిఎల్)లను కూడా అందజేశారు. ఈ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నందుకు మొత్తం రూ. 8 లక్షల రివార్డును ప్రకటించారని ఎస్పి తెలిపారు. లొంగిపోయిన కేడర్లలో, మావోయిస్టుల కంపెనీ ప్లాటూన్ కమాండర్ మిదియం భీమా (30) తలపై రూ.8 లక్షల రివార్డును ప్రకటించారు. అదే విధంగా గంగా కుంజం (22), లేకం రామ, తాటి సోని (32), శాంతి సోధి (21)ల తలలపై ఒక్కొక్కరి చొప్పున రూ.5 లక్షల బహుమతి ప్రకటించగా, మద్వి నవీన్ (20), మద్వి రుక్మి (24), ఓయం మంగ్లీ (22), పొడియం మంగి (20), మద్వి గంగి (19)లకు ఒక్కొక్కరి తలలపై రూ.1 లక్ష రివార్డు ఉన్నట్లు చవాన్ అన్నారు. ఇటీవలి కాలంలో జరిగిన లొంగుబాటు సంఖ్య ఈ ప్రాంతంలో విశ్వాసం, శాంతి, అభివృద్ధి ప్రక్రియ క్రమంగా ఊపందుకుంటున్నట్లు కనిపిస్తుందని పోలీసు అధికారి తెలిపారు. గత 11 నెలల్లో కనీసం 1,514 మంది మావోయిస్టులు బస్తర్ ప్రాంతంలో ఆయుధాలు విడిచిపెట్టారని ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (బస్తర్ రేంజ్) సుందర్రాజ్ పట్టిలింగం తెలిపారు. పొలిట్బ్యూరో సభ్యుడు దేవ్జీ, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు పప్పారావు, దేవా (బార్సే దేవా),ఇతరులతో సహా మిగిలిన మావోయిస్టులు హింసను త్యజించడం తప్ప వేరే మార్గం లేదని ఆయన అన్నారు. పోలీసుల గణాంకాల ప్రకారం, గత రెండేళ్లలో ఛత్తీస్గఢ్లో దాదాపు 2,400 మంది నక్సలైట్లు లొంగిపోయారు.

## ఊపిరి అందడం లేదు

(మొదటి పేజీ తరువాయి)

నాశనం అవుతోంది. ప్రజలకు క్యాన్సర్ సోకుతోంది. వృద్ధులు ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు' అని రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. వాయు కాలుష్యంపై పార్లమెంట్ వెలుపల కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా గాంధీ విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన నగరాల్లో వాయు కాలుష్యం ప్రతి సంవత్సరం తీవ్రమవుతోందని అన్నారు. వాయు కాలుష్యం పెరగడాన్ని తాను పూర్తిగా అంగీకరిస్తున్నానని, అందరూ కూడా అంగీకరిస్తారని భావిస్తున్నాన్నారు. అందరం దీనిపై చర్చించి ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ప్రభుత్వం కూడా చెప్పిందని, ఈ సమస్య చాలా కాలంగా కొనసాగుతోందని, పరిస్థితి ప్రతి సంవత్సరం మరింత దిగజారుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వాయు కాలుష్యం సమస్యను పార్లమెంటులో కూడా చర్చించాలని, సమస్య నుంచి పడయపడేలా ఆలోచించాలన్నారు. ప్రభుత్వం మంచి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ముందుకు తీసుకెళ్తే అది చాలా బాగుంటుందని సూచించారు.

### చర్చకు సిద్ధం : రిజుజు

కాగా, లోక్సభలో వాయు కాలుష్య సంక్షోభంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. ఢిల్లీ దట్టమైన పొగమంచుతో నిండిపోయి, గాలి నాణ్యత చాలా పేలవంగా మారిన వర్గంలోకి చేరిన నేపథ్యంలో రిజిజు ఈ వ్యాఖ్యలు వచ్చాయి. జీరో అవర్ సందర్భంగా లేవనెత్తిన డిమాండ్లకు ప్రతిస్పందిస్తూ ప్రభుత్వం మొదటి రోజు నుంచే తన వైఖరిని స్పష్టం చేసిందని రాహుల్ గాంధీ నేతృత్వంలోని ప్రధాన ప్రతిపక్షంతో సహా సభ్యుల సూచనలను చేర్చడం ద్వారా అన్ని ముఖ్యమైన విషయాలను చర్చించడానికి, పరిష్కారాల వైపు పనిచేయడానికి సిద్ధంగా ఉందని రిజిజు అన్నారు. ఈ అంశాన్ని బిఎసిలో కాంగ్రెస్ సభ్యులు కూడా లేవనెత్తారని రిజిజు గుర్తు చేశారు. వివిధ చట్టాలు, నియమాల ప్రకారం, తాము ఈ చర్చను ఎలా చేపట్టాలో చూడాలని తెలిపారు. సమయం కేటాయింపును పార్లమెంటరీ ప్యానెల్ పరిశీలిస్తుందన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com